www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 3-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 109 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి మ 3.51 తదుపరి అమావాస్య; నక్షత్రం: పునర్వసు ఉ. 11.59 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా. 8.28-10.09; దుర్ముహూర్తం: ఉ. 5.58-7.40; అమృతఘడియలు: ఉ. 9.29-11.09; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.43 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నాపై ఈడీ దాడులకు ప్రణాళిక!

ఈడీలో పనిచేసేవారే చెప్పారు

'చక్రవ్యూహం' ప్రసంగం

'ఆ ఇద్దరి'లో ఒకరికి నచ్చలేదట

దాడుల కోసం ఎదురుచూస్తున్నా

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్

ప్రజల దృష్టి మళ్లించేందుకే: బీజేపీ

2



వయనాడ్‌లో వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న రాహుల్, ప్రియాంక

అమరావతి వైభవం!

ఐదేళ్లు ఆగిన మాస్టర్ ప్లాన్‌కు తిరిగి ప్రాణం

కృష్ణా నదిపై నాలుగు ఐకానిక్ బ్రిడ్జీల నిర్మాణం

కరకట్టపై సెంట్రల్ డివైడర్‌తో 4 లైన్ల రోడ్డు

ఇన్నర్, ఔటర్ రింగ్‌లు, ఈస్టన్, వెస్టన్ బైపాస్‌లు

రాజధానిలో నిర్మాణ పనులు ఇక పరుగులు

టాప్ 10 కాలేజీలు, ఆస్పత్రులు వచ్చేలా కృషి

సంపద కేంద్రంగా రాజధానిలో నిర్మాణాలు

అందుకు కలిసొచ్చే సంస్థలకే భూములు

గతంలో భూములు తీసుకున్న సంస్థలతో మాట్లాడతా.. యాక్టివ్‌గా ఉంటే మరో చాన్స్

సీఆర్డీయే పరిధి యథాతథం

రైతులకు కౌళ్లు, భూమిలేని కూలీలకు పింఛన్లు మరో ఐదేళ్ల పాటు పొడిగింపు

ఆఫీసులపై సంస్థలకు మరో రెండేళ్ల గడువు

సీఆర్డీయేతో భేటీలో చంద్రబాబు కీలక నిర్ణయం



సీఆర్‌డీఏ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్ తదితరులు

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి పనులు చకచకా సాగేందుకు సర్వం సిద్ధమవుతోంది. ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం రాజధాని పరిధిలో 'నవ నగరాల' నిర్మాణం జరగనుంది. సీఆర్డీయే పరిధిని యథాతథంగా కొనసాగించాలని కొత్త సర్కారు నిర్ణయించింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సీఆర్డీయే 36వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా 12 అంశాలపై అధికారులతో చంద్రబాబు

మిగతా 11వ పేజీలో...

"130 సంస్థలకు గతంలోనే అమరావతిలో స్థలాలు కేటాయించాం. ఆ సంస్థల పరిస్థితి ఏమిటనేది తెలుసుకోవాలి. దాని కోసం ఆ సంస్థల ప్రతినిధులతో నేను మాట్లాడతాను. వారిలో ఎవరు యాక్టివ్‌గా ఉన్నారు.. ఎవరు ఇన్ యాక్టివ్‌గా ఉన్నారనేది తెలుసుకుంటా. ఉత్సాహంగా ముందుకొచ్చే సంస్థలకు మరో చాన్స్ ఇస్తా. రాజధానిలో భూములు కేటాయించిన కేంద్ర సంస్థలకు తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు మరో రెండేళ్లపాటు గడువు పొడిగిస్తున్నాం. దేశంలోనే టాప్ 10లో ఉన్న కాలేజీలు, ఆస్పత్రులు రాజధానికి వచ్చేలా ప్రయత్నించాలి. బిట్స్ పిలాని లాంటి సంస్థలతో మాట్లాడాలి" - చంద్రబాబు

నిర్మాణాలు భేష్

టీడీపీ సర్కారు మెరుగ్గా చేసింది

ఐదేళ్ల తర్వాతా నాణ్యత బాగుంది

అయినా అన్నీ పరిశీలించాకే నివేదిక

ఐఐటీ హైదరాబాద్ బృందం వెల్లడి

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ పరిశీలన

నేడు చెన్నై ఐఐటీ నిపుణుల రాక

మద్యం స్కామ్‌పై సీఐడీ

పది రోజుల్లోనే అప్పగించేలా చర్యలు

అప్పటి ఫైళ్లన్నీ సీజ్ చేయండి

నాణ్యత లేని మద్యం కనిపించకూడదు

మద్యంపై అధిక ధరలతో దోపిడీ వద్దు

ఆదాయం కాదు.. పేదల ఆరోగ్యం ముఖ్యం

అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ

ఎక్సైజ్ శాఖపై చంద్రబాబు సమీక్ష

11

పీఎం కుసుమ్‌కు ఓకే

రాష్ట్రంలో విస్తృతంగా అమలుచేయాలని నిర్ణయం

సాగు విద్యుత్‌పై రైతుకు స్వేచ్ఛ.. ప్రతి 11 కేవీ ఫీడర్ పరిధిలో 2-5 మెగావాట్ల సోలార్ హబ్

కేంద్ర సబ్సిడీ 30%.. రైతుకు నేరుగా కరెంటు

మిగులు విద్యుత్ రూ.2.50 చొప్పున కొనుగోలు


సెంబ్‌కార్ప్ 500 మెగావాట్ల పీపీఏకు అనుమతి

11

మహిళా హాస్టల్స్ పెట్టండి

వాటిల్లో చిన్నారుల సంరక్షణ కేంద్రాలు ఉండాలి

అంగన్వాడీల్లో మౌలిక వసతులు కల్పించండి: సీఎం



పశ్చిమ కనుమల్లో మైనింగ్ బంద్

6 రాష్ట్రాల్లోని 56,800 కి.మీ.ల ప్రాంతం పర్యావరణపరంగా సున్నితమైనది

మైనింగ్, క్వారీయింగ్ నిషేధం.. ఇప్పటికే ఉన్న వాటిని దశలవారీగా నిలిపివేయాలి

కొత్తగా భారీ నిర్మాణాలు, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులూ చేపట్టొద్దు

కేంద్రం 5వ ముసాయిదా నోటిఫికేషన్.. సూచనలు, అభ్యంతరాలకు 60 రోజులు

2

టీడీపీ ఆఫీసుపై దాడిచేసిన..

మీ కార్యకర్తలపై ఏం చర్యలు తీసుకున్నారు?

ఓ పార్టీ శ్రేణులు వందలాదిగా వెళ్లి వేరే పార్టీ ఆఫీసుపై దాడిచేయడమా?

ప్రజాస్వామ్య దేశంలో దీనినెలా చూడాలి?

ముందస్తు బెయిల్ కోరిన వైసీపీ నేతలకు హైకోర్టు ప్రశ్నలు



అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలపై ఏం చర్యలు తీసుకున్నారంటూ.. ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వైసీపీ నేతలను హైకోర్టు ప్రశ్నించింది. ప్రజాస్వామ్య దేశంలో ఓ పార్టీకి చెందిన వందల మంది కార్యకర్తలు వెళ్లి మరో పార్టీ

మిగతా 12వ పేజీలో...

అప్పుల కుప్ప ఏపీ

జీఎస్‌డీపీలో 36 శాతం రుణాలే

20 శాతానికి కట్టడి చేయడం సవాలే



తాజా నివేదికలో ఎన్ఐపీఎఫ్‌పీ వెల్లడి

రెవెన్యూ వ్యయంలో ఆర్థిక సేవల వాటా తగ్గుముఖం

47% ఖర్చు సామాజిక సేవలపైనే

కీలక రంగాలపై వ్యయం 7 శాతమే

రెవెన్యూ వసూళ్లు కూడా తగ్గాయ్

నానాటికీ పెరుగుతున్న రెవెన్యూ లోటు

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారిందనేది అక్షరాలా నిజం! 2019లో అధికారం చేపట్టినప్పటి నుంచి 2024లో గద్దెదిగేదాకా... ఏటేటా అప్పుల కొండ పెరుగుతూనే ఉంది. చివరికి... జీఎస్‌డీపీలో అప్పుల వాటా 36 శాతానికి చేరింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) తన తాజా నివేదికలో ఈ వివరాలు వెల్లడించింది. రుణాలను 20 శాతంలోపు నియంత్రించడం రానున్న సంవత్సరాల్లో పెనుసవాలేనని 'స్టేట్ ఫోరమ్-2023' పేరిట విడుదల చేసిన నివేదికలో తెలిపింది. జగన్ ఏలుబడిలో 2019-20లో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో రుణాలు 24.48 శాతం! అవి... 2020-21లో 28.01 శాతానికి, 21-22లో

మిగతా 12వ పేజీలో...

'ఏడుపు' పెంచెన్!

పింఛన్ల పంపిణీ తట్టుకోలేని రోత పత్రిక

ఊరూరా ఇంటింటికీ తెచ్చి ఇవ్వలేదంటూ రాతలు

వాస్తవాలు పక్కన పెట్టి వక్రీకరణలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఒకే రోజు 64 లక్షల మంది పేదలకు సామాజిక పింఛన్లు ఇచ్చినా... 97.5 శాతం మందికి ఒకటో తేదీనే పంపిణీ చేసినా జగన్ రోత పత్రికకు 'ఏడుపే'! వలంటీర్లు లేకున్నా పింఛన్ల పంపిణీ సక్రమంగా సాగడాన్ని జీర్ణించుకోలేనంతగా 'ఏడుపు'! పింఛన్ల

మిగతా 12వ పేజీలో...



అల్లూరి జిల్లా పెద బయలు మండలం గిన్నెలకోటలో పింఛన్లు పంపిణీ చేసేందుకు తాడు సాయంతో గెడ్డ దాటుతున్న సిబ్బంది

జీతాలు, పింఛన్ల కింద.. ఒక్క రోజే 8 వేల కోట్లు

12



64 లక్షల మంది పేదలకు రూ.2,737 కోట్లు పంపిణీ

ఒకేరోజు 97.54% మందికి సామాజిక పింఛన్లు రికార్డు

అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 1నే వేతనాలు, పెన్షన్లు

ఉద్యోగులు, పెన్షనర్లకు 5,300 కోట్లు విడుదల:బాబు



'హ్యాట్రిక్' దిశగా మను భాకర్

25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఫైనల్‌కు

నేడే తుది సమరం

9

వర్గీకరణపై బీజేపీ, కాంగ్రెస్‌ల వ్యూహాత్మక మౌనం

జాతీయ స్థాయిలో నోరెత్తని రెండు పార్టీల నేతలు

రాష్ట్రాల స్థాయిలోనే స్పందించాలని నిర్ణయం

2



విశాఖ 'స్థానిక' ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా బొత్స

పోటీపై నేడు టీడీపీ కూటమి నిర్ణయం

11

నిధులివ్వకుండా ఉక్కును చంపేస్తారా?


వైజాగ్ స్టీల్‌పై మోదీ డబుల్ గేమ్

రూపాయి సాయం చేయకుండా వెంటిలేటర్‌పై పెట్టారు

అదానీ, అంబానీ, జిందాల్ వంటివాళ్లకు కట్టబెట్టేందుకు ముహూర్తం ఫిక్స్: షర్మిల

11





శ్రీశైలంలో 10 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

సాగర్‌కు భారీ వరద

నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లను తాకిన నీరు

శ్రీశైలం నుంచి దిగువకు 5.28 లక్షల క్యూసెక్కులు

ఏ క్షణమైనా సాగర్ గేట్లు ఎత్తే అవకాశం

3

ఉత్తరాదిలో వాన బీభత్సం


కేదార్‌నాథ్ మార్గంలో చిక్కుకుపోయిన యాత్రికులను కాపాడుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

- ఉత్తరాఖండ్‌లో 14 మంది మృతి.. కేదార్‌నాథ్ మార్గం ధ్వంసం

న్యూఢిల్లీ, డెహ్రాడూన్, ఆగస్టు 2: భారీ వర్షాలు ఉత్తరాది రాష్ట్రాల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు కేదార్‌నాథ్ యాత్రా మార్గంపై తీవ్రంగా ధ్వంసమైంది. పలుచోట్ల కొండచరియలు విరిగిపడడంతో ఘోరాపరావ్, లింకోలి, బడీ లింకోలి, భీంబలి ప్రాంతాల్లో బండరాళ్లు పడి ట్రెక్కింగ్ మార్గం మూసుకుపోయింది. దీంతో కేదార్‌నాథ్ యాత్రను నిలిపివేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలకు 14 మంది చనిపోయారని, పది మంది గాయపడ్డారని, ఓ ఇల్లు కూలిపోయిందని అధికారులు తెలిపారు. సుమారు 700 మందికిపైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయారని వెల్లడించారు. ఇప్పటివరకూ 737 మందిని హెలికాప్టర్ల ద్వారా రక్షించామని, సహాయక బృందాలు 2,670 మందిని సోన్‌ప్రయాగ్ ప్రాంతానికి తరలించాయని పేర్కొన్నారు. టిహ్రీ, రుద్రప్రయాగ్ జిల్లాల్లో భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం నేపథ్యంలో కేదార్‌నాథ్ యాత్రను రెండు రోజులపాటు నిలిపివేసినట్టు ఉత్తరాఖండ్ డీజీపీ అభినవ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం రుద్రప్రయాగ్ జిల్లాలోని మందాకిని, అలకనంద నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. మరోవైపు ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాలకు కూడా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. కాగా, శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఢిల్లీలోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఢిల్లీలో ఈ నెల 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది.

కోచింగ్ సెంటర్‌లో మరణాల కేసు సీబీఐకి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో ముగ్గురు అభ్యర్థులు మరణించిన ఘటనపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దర్యాప్తును పర్యవేక్షించడానికి ఓ అధికారిని నియమించాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు సూచించింది. కేసు దర్యాప్తును సక్రమంగా నిర్వహించని ఢిల్లీ పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరును కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. బేస్‌మెంట్‌లో వరదలకు కారణమయ్యాడంటూ ఎస్‌యూవీ డ్రైవర్ మనుజ్‌ను అరెస్టు చేయడాన్ని కూడా విమర్శించింది. 'ఇంకా నయం! బేస్‌మెంట్‌లోకి వెళ్లావంటూ వరద నీటిపై చలానా రాయలేదు' అని కోర్టు వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది.

లోకం తీరు



నాపై ఈడీ దాడులకు ప్రణాళిక!

- ఈడీలో పనిచేసే వారే చెప్పారు
- 'చక్రవ్యూహం' ప్రసంగమే కారణం
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్



న్యూఢిల్లీ, ఆగస్టు 2: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనపై దాడులు చేసేందుకు సిద్ధమవుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. లోక్‌సభలో 'చక్రవ్యూహం' అంటూ తాను చేసిన ప్రసంగం కేంద్ర ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదన్నారు. ఆ ప్రసంగం నేపథ్యంలో త్వరలోనే తనపై ఈడీ దాడులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. 'ఆ ఇద్దరిలో' ఒకరికి తన చక్రవ్యూహం ప్రసంగం నచ్చలేదని తెలుస్తోందని, అందువల్లే తనపై దాడులకు సిద్ధమవుతున్నట్లు ఈడీలో పనిచేస్తున్న కొంతమంది తెలిపారని రాహుల్ పేర్కొన్నారు. 'ఈ దాడుల కోసం ఎదురుచూస్తున్నా. చాయ్, బిస్కట్లు సిద్ధంగా ఉంచండి' అని ఈడీ డైరెక్టరేట్ ఖాతాను ట్యాగ్ చేస్తూ రాహుల్ గాంధీ శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చలో భాగంగా సోమవారం లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని 'పద్మవ్యూహం'లోకి నెట్టివేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాభారతంలోని కీలక ఘట్టమైన పద్మవ్యూహాన్ని, వీరమరణం పొందిన అభిమన్యుడిని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తదితరులపై విమర్శలు గుప్పించారు. అయితే, తనపై ఈడీ దాడులు జరగొచ్చన్న రాహుల్ గాంధీ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. వయనాడ్ ఎంపీగా అక్కడ జరిగిన విషాద ఘటనకు బాధ్యత వహించాల్సి వస్తుందనే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తింది. కట్టు కథలు అల్లి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారని ఆరోపించింది.

సభలో భారతం చెప్పడం ఫ్యాషనైంది: స్పీకర్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: లోక్‌సభలో మహాభారతం గురించి చెప్పడం ఫ్యాషన్‌గా మారిందని శుక్రవారం స్పీకర్ ఓం బిర్లా వ్యాఖ్యానించారు. కథలు చెప్పకుండా సూటిగా ప్రశ్నలు అడగాలని సభ్యులకు సూచించారు. ఒడిశాలోని బర్‌ఘర్‌కు చెందిన బీజేపీ సభ్యుడు ప్రదీప్ పురోహిత్ ఆ ప్రాంతంలోని ఆయుర్వేద కళాశాల గురించి ప్రశ్నించారు. ఇదే సందర్భంగా ఆ ప్రాంతంలో లభ్యమయ్యే వనమూలికల చరిత్రను చెప్పడం ప్రారంభించారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకొని 'ఆప్ మహాభారత్ మత్ సునావో, ఆప్ ప్రశ్న పూఛో' (మీరు మహాభారతాన్ని వినిపించొద్దు..ప్రశ్న అడగండి) అని అన్నారు. ఆజ్ కల్, మహాభారత్ సునానే కా కిస్సా జ్యాదా చలా హై యహా పర్ (ఈమధ్య కాలంలో ఇక్కడ మహాభారతాన్ని వినిపించడం ఎక్కువయింది) అని వ్యాఖ్యానించారు.

ప్రపంచంలోని 108 దేశాల్లో భారత విద్యార్థులు

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ఉన్నత విద్య కోసం ప్రపంచంలోని పలు దేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాదీ పెరుగుతోంది. 2024 సంవత్సరంలో 13,35,878 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి వివిధ దేశాలకు వెళ్లారని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. రాజ్యసభలో గురువారం ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలను తెలిపారు. 'యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్ సింగపూర్, రష్యా, ఇజ్రాయెల్, ఉక్రెయిన్ వంటి 108 దేశాల్లో మన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో అత్యధికంగా కెనడాలో 4,27,000 మంది చదువుతున్నారు. యూఎస్‌లో 3,37,630 మంది, చైనాలో 8,500 మంది, ఇజ్రాయెల్‌లో 900 మంది, ఉక్రెయిన్‌లో 2,510 మంది పాకిస్థాన్‌లో 14 మంది చదువుతున్నారు' అని కేంద్ర మంత్రి వివరించారు.

పోర్టులో 'భూ'చోళ్లపై ప్రభుత్వం ఆరా

- నివేదిక కోరిన మంత్రి జనార్దన్‌రెడ్డి

కాకినాడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ యాంకరేజ్ పోర్టుకు చెందిన విలువైన భూములు కొరగాని కంపెనీల చేతిలో చిక్కుకుపోయిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఏమాత్రం ఉత్పత్తి చేపట్టకపోయినా పదుల సంఖ్యలో ఎకరాల భూములను కొన్ని కంపెనీలు అప్పనంగా గుప్పెట్లో ఉంచుకుని వాటిని వినియోగించకపోవడం, అటు కోట్లలో లీజు డబ్బులు చెల్లించని వైనంపై ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలో పోర్టులో 'భూ'చోళ్లు అనే శీర్షికతో గురువారం వచ్చిన కథనంపై రాష్ట్ర ఆర్‌అండ్‌బీ, పెట్టుబడులు, ఓడరేవుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టిసారించారు. పోర్టు భూములు ఎన్ని కంపెనీల చేతుల్లో చిక్కుకున్నాయి? మొత్తం ఎన్నికోట్లు బాకీలు పేరుకుపోయాయి? అనే దానిపై కాకినాడ యాంకరేజ్ పోర్టు ఆఫీసర్ ధర్మశాస్త్రను ఆరా తీశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అనుచరుడి కంపెనీకి అప్పనంగా కట్టబెట్టిన ఐదెకరాలపైనా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. భూములు తీసుకున్న కంపెనీలు ఎందుకు పోర్టు ఆధారిత కార్యకలాపాలు చేపట్టడం లేదని, వీటి సమర్థ సద్వినియోగంపై దృష్టిసారించడం ఎలా అనేదానిపై పూర్తిస్థాయి నివేదిక అడిగారు. అటు ఏపీ మేరిటైం బోర్డు సీఈవో సైతం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై నివేదిక పంపాలని పోర్టు ఆఫీసర్‌ను ఆదేశించారు.

టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

- పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులు
- ఘటనలో సీఐ, ఎస్‌ఐకు గాయాలు
- కర్నూలు జిల్లా ఆస్పరి మార్కెట్‌లో ఘటన


గాయపడిన సీఐ హనుమంతప్ప

ఆదోని, ఆగస్టు 2: మార్కెట్‌లో జరిగిన గొడవతో వైసీపీ, టీడీపీ వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్న సంఘటన శుక్రవారం కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో చోటు చేసుకుంది. ఈ దాడిలో ఓ సీఐ, ఎస్‌ఐలు గాయపడ్డారు. ఆస్పరి మండలం బిల్లేకల్ కూరగాయల మార్కెట్‌ను గతంలో రూ.76 లక్షలకు వైసీపీకి చెందిన కాంట్రాక్టర్ గిత్త నల్లన్న దక్కించుకున్నాడు. ఈ మార్కెట్ నిర్వహణ హనుమంతురెడ్డి అనే వ్యక్తి చూస్తుంటాడు. రెండు రోజుల క్రితం ఈడిగ వీరేశ్ తన పొలంలో పండిన మిర్చి పంటను విక్రయానికి తీసుకెళ్లాడు. అయితే వాటికి లెక్కకట్టి డబ్బు అందజేయడంలో కాంట్రాక్టర్, నిర్వాహకులు నిర్లక్ష్యం వహించారు. టీడీపీ మద్దతుదారులకు ఒకలా, వైసీపీ మద్దతుదారులకు మరోలా ధర చెల్లిస్తున్నారంటూ రైతు వీరేశ్ నిలదీశాడు. వేలంపాట నిలిపివేయాలని డిమాండ్ చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాదనలు చోటు చేసుకున్నాయి. విషయం తెలుసుకొని వైసీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, టీడీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటేశు గ్రామ పెద్దలుగా మార్కెట్ యార్డ్‌కు వెళ్లారు. వారిని లెక్కచేయకుండా కాంట్రాక్టర్ గిత్త నల్లన్న, హనుమంతరెడ్డి పరుష పదజాలంతో దూషిస్తూ ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాలూ పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులకు దిగాయి. దాడిని ఆపేందుకు వెళ్లిన సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ శ్రీనివాసు తలకు గాయాలయ్యాయి. వీరితో పాటు టీడీపీకి చెందిన ఏడుగురికీ గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బిల్లేకల్ గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు.

పశ్చిమ కనుమల్లో మైనింగ్ బంద్!


శుక్రవారం వయనాడ్‌లో పర్యటిస్తున్న రాహుల్, ప్రియాంక

6 రాష్ట్రాల్లోని 56,800 కి.మీ.ల ప్రాంతం పర్యావరణపరంగా సున్నితమైనది

- మైనింగ్, క్వారీయింగ్, ఇసుక తవ్వకాలపై నిషేధం
- 5వ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 2: పశ్చిమ కనుమల్లోని 56,800 కి.మీ.ల ప్రాంతాన్ని 'పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతం'గా (ఈఎస్ఏ)గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం 5వ ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జూలై 31న విడుదలైన ఈ నోటిఫికేషన్‌పై ఏమైనా సూచనలు, అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా తెలియజేయాలని పేర్కొంది. కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి, వరద బీభత్సంలో 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో కేంద్రం ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా నోటిఫికేషన్ ప్రకారం పశ్చిమ కనుమలు విస్తరించిన ఆరు రాష్ట్రాల్లోని భూభాగాన్ని ఈఎస్ఏగా ప్రకటించారు. దీని కింద కర్ణాటకలో 20,668 చదరపు కి.మీ.లు, మహారాష్ట్రలో 17,340 చదరపు కి.మీ.లు, కేరళలో వయనాడ్ జిల్లాలోని 13 గ్రామాలతోపాటు మొత్తం 9,933 చదరపు కి.మీ.లు, తమిళనాడులో 6,914 చదరపు కి.మీ.లు, గోవాలో 1,461 చదరపు కి.మీ.లు, గుజరాత్‌లో 449 కి.మీ.ల ప్రాంతం ఉంది. ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం, ఈఎస్ఏగా పరిగణించే ప్రాంతంలో మైనింగ్, క్వారీయింగ్, ఇసుక తవ్వకాలపై పూర్తి నిషేధం ఉంటుంది. ఇప్పటికే మైనింగ్ జరుగుతుంటే లీజు గడువు పూర్తయిన తర్వాత లేదా తుది నోటిఫికేషన్ విడుదలైన ఐదేళ్లలోపు (ఏది ముందైతే అది) దానిని నిలిపివేయాలి. కొత్తగా బొగ్గు ఆధారిత (థర్మల్) విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయవద్దు. ఇప్పటికే ఉన్న వాటిని నడపవచ్చుగానీ, విస్తరించరాదు. భారీస్థాయి టౌన్‌షిప్‌లు, భవనాల నిర్మాణాలపై నిషేధం ఉంటుంది. కాగా, పెరుగుతున్న జనాభా, వాతావరణ మార్పులు, అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం పశ్చిమ కనుమలపై ఏ విధంగా ఉందన్నది అధ్యయనం చేయటానికి 2010లో ప్రముఖ పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ నేతృత్వంలో కేంద్రం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. పశ్చిమ కనుమల్లోని మొత్తం పర్వత ప్రాంతాన్ని ఈఎస్ఏగా ప్రకటించాలని ఈ కమిటీ 2011లో సిఫార్సు చేసింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, స్థానికుల నుంచి ఈ సిఫార్సులపై వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో 2013లో కేంద్రప్రభుత్వం ఇస్రో మాజీ ఛైర్మన్ కే కస్తూరిరంగన్ సారథ్యంలో మరో ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ పశ్చిమ కనుమల్లో 37 శాతం భూభాగం (59,940 కి.మీ.లు) పర్యావరణపరంగా సున్నితమైనదని గుర్తించింది. ఇప్పటి వరకూ ఈ కమిటీ నాలుగు ముసాయిదా నోటిఫికేషన్లు విడుదల చేయగా, తాజాగా ఐదవది విడుదలైంది.



కాంగ్రెస్ తరఫున 100 ఇళ్లు

వయనాడ్, ఆగస్టు 2: వయనాడ్‌లో సంభవించింది మహా విపత్తని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని ప్రత్యేకంగా పరిగణించాలని విపక్ష నేత రాహుల్‌గాంధీ సూచించారు. సోదరి ప్రియాంకతో కలిసి శుక్రవారం కూడా వయనాడ్‌లో పర్యటించిన ఆయన... స్థానిక అధికారులతో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వయనాడ్‌లో 100కు పైగా ఇళ్లను నిర్మిస్తామని వాగ్దానం చేశారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల్లో నివసించబోమని ప్రజలు చెబుతున్నారని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఇప్పటికే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

ఆ 45 మంది ఏమయ్యారు?

- హిమాచల్ మెరుపు వరదల్లో గల్లంతైనవారి ఆచూకీ కరువు..!

రుద్రప్రయాగ్, శిమ్లా, ఆగస్టు 2: కుంభవృష్టి కారణంగా సంభవించిన మెరుపు వరదల్లో గల్లంతైన హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు జిల్లాలకు చెందిన 45 మంది ఆచూకీ ఇంకా దొరకలేదు. శ్రీఖండ్ మహాదేవ్ మార్గంలో మేఘ విస్ఫోటనంతో సర్పరా, గాన్వి, కుర్పన్ ప్రాంతాలోనే 30 మంది నీటిలో కొట్టుకుపోయారు. వీరికోసం తీవ్ర స్థాయిలో గాలింపు కొనసాగుతోంది. శుక్రవారం మరో మూడు మృతదేహాలు లభ్యం కావడంతో వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 8కి చేరింది. కులులోని నిర్మండ్, సాయింజ్, మలానా, మండిలోని పధార్, శిమ్లాలోని రాంపూర్ బుధవారం అర్థరాత్రి ఆకస్మిక వర్షాలతో ప్రభావితమయ్యాయి. తొలుత ఐదుగురు చనిపోగా, ఇద్దరు పిల్లలు సహా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైనవారిలో 17 నుంచి 18 మంది మహిళలు, 8 నుంచి 9 మంది పిల్లలు ఉన్నట్లు హిమాచల్ సీఎం సుఖు తెలిపారు.

శాస్త్రవేత్తలపై ఆంక్షల ఉపసంహరణ

తిరువనంతపురం, ఆగస్టు 2: వయనాడ్‌పై విపత్తు విరుచుకుపడిన వేళ... శాస్త్రవేత్తలు, సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలపై రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం ఆంక్షలు విధించడంపై కేరళ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇటీవల కొండచరియలు విరిగిపడిన ఘటనలో తీవ్రంగా నష్టపోయిన మెప్పాటి పంచాయతీ పరిధిలో శాస్త్రవేత్తలు పర్యటించరాదని, ప్రమాదంపై ఎటువంటి అభిప్రాయాలు మీడియాతో వెల్లడించకూడదని రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం గురువారం ఆదేశించింది. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో, ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని సీఎం విజయన్ శుక్రవారం ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణ జరగదు!

- కోర్టు కొట్టేస్తుందని తెలిసీ బాబు చేశారు
- సీఎంగా ఉన్నప్పుడు అసెంబ్లీలో జగన్ ధ్వజం



అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరగదంటూ వైఎస్ జగన్ సీఎంగా ఉండగా శాసనసభలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిన నేపథ్యంలో నాడు జగన్ చెప్పిన మాటలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. 'ఎస్సీ వర్గీకరణకు రాజ్యాంగం అంగీకరించదు. చేసినా నిలబడదు. ఎవరైనా కోర్టుకు వెళ్తే కొట్టేస్తుంది. వర్గీకరణ చెల్లదని తెలిసీ చంద్రబాబు తెచ్చారు' అని అప్పట్లో జగన్ విమర్శించారు. మాల, మాదిగల మధ్య విభేదాలు తీసుకొచ్చి, ఓటు బ్యాంకుగా వాడుకునేందుకే బాబు వర్గీకరణ చేశారని అన్నారు. వర్గీకరణ చేయలేమని, రాజ్యాంగం దానిని ఒప్పుకోదని తెలిసినా చేశారని చెప్పారు.

వర్గీకరణపై బీజేపీ, కాంగ్రెస్‌ల వ్యూహాత్మక మౌనం!


- జాతీయ స్థాయిలో నోరెత్తని రెండు పార్టీల నేతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాలు, షెడ్యూలు తెగల్లోని ఉప కులాలను వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు వారికి అందజేయాలని సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై బీజేపీ, కాంగ్రెస్ వర్గాలు వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఈ అంశంపై ఈ రెండు పార్టీలు అధికారికంగా స్పందించకపోవడం గమనార్హం. రాష్ట్రాల స్థాయిలోనే సుప్రీం తీర్పుపై స్పందించాలని ఆయా పార్టీలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీ నాయకత్వం సుప్రీం తీర్పుపై అట్టహాసంగా స్పందించకూడదని నిర్ణయించింది. గురువారం తెలంగాణకు చెందిన బీజేపీ నేత ఒకరు వర్గీకరణపై తొలుత సానుకూలంగా స్పందిస్తూ.. ఇందుకు తమ పార్టీకే ఘనత దక్కుతుందని ప్రకటించారు. ఆయన మాట్లాడుతుండగానే కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ రావడంతో వర్గీకరణపై పెద్దగా ప్రతిస్పందించకూడదని నిర్ణయించుకున్నారు. 'తెలంగాణలో వర్గీకరణ మనవల్లే జరిగిందని ప్రజలందరికీ తెలుసు. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచే మొత్తం డాక్యుమెంట్లు సుప్రీంకోర్టుకు వెళ్లాయి. మనం పెద్దగా చెప్పకపోయినా తెలంగాణలో మనకు రాజకీయ ప్రయోజనాలు నెరవేరుతాయి. ఇతర రాష్ట్రాల్లో మనకు నష్టం జరగకుండా ఉండాలంటే ఆచితూచి స్పందించాలి' అని అమిత్ షా సలహా ఇచ్చినట్లు తెలిసింది. సుప్రీం తీర్పు తర్వాత ఓబీసీ ఉప కులాలకు వర్గీకరణ అంశం కూడా చర్చకు వస్తుందని బీజేపీ వర్గాలు భయపడుతున్నట్లు తెలిసింది.

నీట్ లీకేజీ పెద్ద ఎత్తున జరగలేదు

అందుకే ఆ పరీక్షను రద్దుకు ఆదేశించలేదు: సుప్రీం

- పరీక్షల నిర్వహణలో లోపాలను దిద్దుకోవాలని ఎన్‌టీఏకి సూచన
- సెప్టెంబరు 30కల్లా నివేదిక ఇవ్వాలని రాధాకృష్ణన్ కమిటీకి ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 2: నీట్ లీకేజీ పెద్ద ఎత్తున జరగనందునే ఆ పరీక్షను రద్దు చేయాలంటూ ఆదేశాలు జారీచేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు జూలై 23న తాము ఇచ్చిన తీర్పునకు సంబంధించి కారణాలను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వివరించింది. "హజారీబాఘ్, పట్నాలో మినహా నీట్ పరీక్ష పవిత్రతను దెబ్బతీసేలా విస్తృతస్థాయిలో లీకేజీ జరగలేదు" అని తేల్చిచెప్పింది. పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దుకోవాలని జాతీయ టెస్టింగ ఏజెన్సీకి (ఎన్‌టీఏ) సూచించింది. అలాగే.. ఎన్‌టీఏ పనితీరును సమీక్షించేందుకు, పరీక్షల సంస్కరణలకు సంబంధించిన సిఫారసుల నిమిత్తం ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఏర్పాటైన ప్యానెల్ పరిశీలించాల్సిన అంశాల పరిధిని పెంచుతూ కొన్ని సూచనలు చేసింది. పరీక్షాకేంద్రాల కేటాయింపు ప్రక్రియపై సమీక్ష, అభ్యర్థుల గుర్తింపుపత్రాల తనిఖీ, పరీక్షాకేంద్రాల్లో సీసీటీవీల పర్యవేక్షణ తదితర 8 అంశాలకు సంబంధించి సమగ్ర సమీక్ష జరిపి.. పరీక్షల వ్యవస్థలో లోపాలను సరిదిద్దే చర్యలను సూచిస్తూ సెప్టెంబరు 30నాటికి నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించింది. ఆ నివేదిక అమలుపై కేంద్ర విద్యాశాఖ అక్టోబరు 15 నాటికి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. నీట్-యూజీ లీకేజీ విస్తృత స్థాయిలో జరగలేదు కాబట్టే ఆ పరీక్ష రద్దుకు ఆదేశించలేదన్న సుప్రీం వ్యాఖ్య.. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి సరైనదేనని నిరూపించే విధంగా ఉందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ చేశారు. నీట్ లీకేజీ పెద్ద ఎత్తున జరిగిందంటూ కొన్నాళ్లుగా విస్తృతస్థాయిలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని సుప్రీం తీర్పు నిర్ద్వంద్వంగా కొట్టిపారేసిందని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అవకతవకలకూ ఆస్కారం లేని విధంగా.. పారదర్శకంగా.. ఒక్క తప్పు కూడా జరగకుండా పరీక్షలు నిర్వహించే విధానానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు.. నీట్ వ్యవస్థ రద్దు కోరుతూ డీఎంకే ఎంపీ ఎం.మొహమ్మద్ అబ్దుల్లా.. శుక్రవారం మధ్యాహ్నం రాజ్యసభలో ప్రైవేటు మెంబర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితా నుంచి తొలగించి.. రాష్ట్రాల జాబితాలో చేర్చేలా చట్టం తేవాలని అందులో కోరారు. వైద్యవిద్యలో ప్రవేశాలను రాష్ట్రప్రభుత్వాల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకునేలా పాతపద్ధతికి మళ్లీ అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. అయితే.. పార్లమెంటరీ విధానాలకు, సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్న ఆ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి విజ్ఞప్తి చేశారు. ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడిన కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా.. నీట్ ప్రవేశపెట్టడానికి ముందు వైద్య విద్య బహిరంగ వ్యాపారంలా ఉండేదని, పీజీ సీట్లను రూ.8 కోట్ల నుంచి రూ.13 కోట్లకు అమ్ముకునేవారని పేర్కొన్నారు.

ఎన్నికల బాండ్లపై సిట్ విచారణకు నో

ఎన్నికల బాండ్ల పథకంపై కోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి విచారణ జరపాలంటూ దాఖలైన పలు పిటిషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టేసింది. ఎన్నికల బాండ్ల పథకం వెనక కార్పొరేట్ కంపెనీలకు-రాజకీయ పార్టీలకు మధ్య క్విడ్ ప్రోకో నడుస్తోందని.. దీనిపై విస్తృత దర్యాప్తునకు ఆదేశించాలంటూ పలు ఎన్జీవో సంస్థలు వేసిన పిల్‌పై కోర్టు శుక్రవారం విచారించింది. సాధారణ చట్టం మేరకు చర్యలు తీసుకునే మార్గాలున్నప్పటికీ.. దీనిపై మాజీ న్యాయమూర్తితో విచారణకు ఆదేశించడం అనుచితమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు ఫిబ్రవరిలోనే రద్దు చేసిన సంగతి తెలిసిందే.

రాష్ట్రంలో 'ఎన్‌సీఈఆర్‌టీ' విద్యా సంస్థ!

- 2016లోనే ఏపీకి మంజూరు
- భూ సేకరణకు సహకరించని జగన్
- 10 కోట్ల సొమ్ము విడుదలలో నిర్లక్ష్యం
- ఇప్పుడు ఆ నిధుల విడుదలకు చర్యలు

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాంతీయ విద్యా సంస్థ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. 2016లోనే ఈ సంస్థ మంజూరైనా గత జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆదిలోనే ఆగిపోయిన సంస్థను ఇప్పుడు ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించాలని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ).. దేశంలో పలు చోట్ల ప్రాంతీయ విద్యా సంస్థలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మైసూరు సంస్థ పరిధిలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉంది. అలా కాకుండా దక్షిణాదికి ప్రత్యేకంగా సంస్థ ఉండాలనే లక్ష్యంతో అప్పట్లో కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్య నాయుడు చొరవ చూపారు. ఆయన చొరవతో ఏపీకి సంస్థ మంజూరైంది. ఏపీతో పాటు తమిళనాడు, తెలంగాణ దాని పరిధిలో ఉంటాయి. సంస్థ ఏర్పాటుకు నెల్లూరులోని వెంకటాయపాలెంలో శంకుస్థాపన చేశారు. దీనికి అవసరమైన భూమిని రైతుల నుంచి సేకరించాలని, రూ.10 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆ నిధులను కేటాయించింది. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ నిధులను విడుదల చేయలేదు. దీంతో ప్రాంతీయ విద్యా సంస్థ ఏర్పాటు అక్కడితోనే ఆగిపోయింది. ఆ సంస్థ అందుబాటులోకి వస్తే ఉపాధ్యాయ విద్యకు సంబంధించిన పలు కోర్సులు అందుబాటులోకి వస్తాయి. అలాగే సంస్థ నిర్మాణానికి రూ.500 కోట్లు కేంద్రం నుంచి మంజూరవుతాయి.

తక్షణం చర్యలు చేపట్టండి

ప్రాంతీయ విద్యా సంస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధి, ఏపీ ప్రాంతీయ విద్యా సంస్థ ఓఎస్‌డీ బుర్రా రమేశ్ కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ నేతృత్వంలో ఆయనతో పాటు ప్రొఫెసర్ విశ్వనాథప్ప, మన్నవ సుబ్బారావు శుక్రవారం సచివాలయంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను కలిసి ప్రాజెక్టు గురించి వివరించారు. ఈ సంస్థ ఏపీకి గర్వకారణంగా నిలుస్తుందని రమేశ్ తెలిపారు. సెప్టెంబరు నుంచి సంస్థను తాత్కాలికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు ఆయన తెలిపారు.

'యాక్సియోమ్ స్పేస్'తో ఇస్రో ఒప్పందం

- యాక్సియోమ్-4 మిషన్‌కు గగన్ యాత్రికులు
- ప్రధాన పైలట్‌గా గ్రూప్ కెప్టెన్ శుభాన్ను శుక్లా


శుభాన్షు


ప్రశాంత్

బెంగళూరు, ఆగస్టు 2: ఇస్రో, అమెరికాకు చెందిన యాక్సియోమ్ స్పేస్ ఇంక్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మానవసహిత యాత్ర లక్ష్యంతో యాక్సియోమ్-4 మిషన్‌ను చేపట్టిన ఈ సంస్థతో తమ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ ఒప్పందం చేసుకున్నట్టు ఇస్రో వెల్లడించింది. ఈ ఒప్పందంలో భాగంగా మిషన్‌కు అవసరమైన ఇద్దరు గగన్‌యాత్రికులను ప్రధాన, బ్యాకప్ పైలట్లుగా సిఫారసు చేసినట్టు తెలిపింది. గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా ఈ మిషన్‌కు ప్రధాన పైలట్‌గా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ బ్యాకప్ పైలట్‌గా వ్యవహరిస్తారని పేర్కొంది. 'ఈ మిషన్ కోసం కేటాయించిన క్రూ సిబ్బందిని ఐఎస్ఎస్‌కు పంపేందుకు మల్టీలేటరల్ క్రూ ఆపరేషన్స్ ప్యానెల్ (ఎంసీవోపీ) అనుమతిస్తుంది. ఈ నెల మొదటి వారంలో ఈ ఇద్దరు గగన్ యాత్రికులు మిషన్ కోసం అవసరమైన శిక్షణను ప్రారంభిస్తారు' అని ఇస్రో వెల్లడించింది. ఈ మిషన్‌లో భాగంగా గగన్‌యాత్రికులు ఐఎస్ఎస్‌లో పరిశోధనలు చేపట్టడంతోపాటు అంతరిక్ష కార్యకలాపాల్లో పాల్గొంటారని తెలిపింది. మిషన్‌కు ప్రధాన పైలట్‌గా ఎంపికైన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాకు 2 వేల గంటలు విమానం నడిపిన అనుభవం ఉంది.

కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మ

కర్ణాటక సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 'నోటీసులకు భయపడను.. తప్పు చేసి ఉంటే కదా వెనుకాడాల్సింది..? వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా' అని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) అవినీతి ఆరోపణలపై గవర్నర్ షోకాజ్ నోటీసులు జారీ చేసిన తర్వాత తొలిసారిగా సీఎం శుక్రవారం స్పందించారు. గవర్నర్ కేంద్రప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా మారారని విమర్శించారు. జేడీఎస్, బీజేపీ నాయకుల చేతిలోనూ ఆయన కీలుబొమ్మేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. 136 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ముఖ్యమంత్రిని అయ్యానని, ముడా వ్యవహారంలో తన భాగస్వామ్యం లేకున్నా ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

నిద్రలోనే తెల్లారిన బతుకులు

మట్టి మిద్దె కూలి నలుగురు దుర్మరణం



1. చిన్నవంగలిలో కూలిన మట్టిమిద్దె, 2. రోదిస్తున్న ప్రసన్న, 3. మృతి చెందిన పవిత్ర, గురులక్ష్మి, 4 గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ

- నంద్యాల జిల్లాలో ఘోర ప్రమాదం
- గాఢనిద్రలో ఉండగా ప్రమాదం
- దంపతులు, ఇద్దరు కుమార్తెలు మృతి
- అనాథగా మారిన ఓ కుమార్తె

చాగలమర్రి, ఆగస్టు 2: గాఢనిద్రలో ఉన్న వారికి అదే చివరి రోజైంది. నిద్రిస్తున్న సమయంలో మట్టి మిద్దె కూలడంతో దంపతులు సహా ఇద్దరు కుమార్తెలు దుర్మరణం పాలైన ఘటన నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన తల్లపురెడ్డి గురుశేఖర్ రెడ్డి (45), భార్య దస్తగిరమ్మ (38), పెద్ద కుమార్తె పవిత్ర (16), చిన్న కుమార్తె గురులక్ష్మి (10) మృతి చెందారు. అర్ధరాత్రి హాలులోని మిద్దె ఒక్కసారిగా కుప్పకూలిపోగా.. తెల్లవారుజామున గ్రామస్థులు గమనించి మట్టి కుప్పల నడుమ కూరుకుపోయిన మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. మట్టి మిద్దె కావడం, వర్షాలకు బాగా తడిచి దంతెలు దెబ్బతిని ఉండటంతో ఇంటి పైకప్పు కూలినట్టు సమాచారం. గురుశేఖర్ రెడ్డి, దస్తగిరమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉండగా రెండో కుమార్తె ప్రసన్న ప్రొద్దుటూరులోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. విషయం తెలుసుకుని గ్రామానికి చేరుకున్న ఆమె తల్లిదండ్రులు, అక్కా, చెల్లెళ్ల మృతదేహాలను చూసి రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కలచివేసింది. గురుశేఖర్‌రెడ్డికి గ్రామంలో సొంత ఇల్లు ఉన్నా ఏడాది కాలం నుంచి బంధువులకు చెందిన మట్టి మిద్దెలోనే భార్య పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థులను, బంధువులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చిన్నవంగలి ఘటనపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రసన్నకు అండగా ఉంటానని, ఆమె చదువుకు తాను సహకారం అందిస్తానని ఎంపీ శబరి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల వరకు పరిహారం అందిస్తామని ఎమ్మెల్యే అఖిలప్రియ వెల్లడించారు.



ఓ విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న విశ్వనాథన్, ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుధే, టీఆర్ పరశురామన్ తదితరులు

యువ గ్రాడ్యుయేట్ల ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి

- వీఐటీ స్నాతకోత్సవంలో ప్రొఫెసర్ సహస్రబుధే

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యువ గ్రాడ్యుయేట్ల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం (ఎన్ఈటీఎఫ్), నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుధే పిలుపునిచ్చారు. తమిళనాడు, వేలూరులోని 'వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (వీఐటీ)లో శుక్రవారం జరిగిన 39వ స్నాతకోత్సవానికి సహస్రబుధే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగ్రాడ్యుయేట్లు నిరంతరం అభ్యాసకులుగా ఉండాలని ఉద్బోధించారు. బహుముఖ ప్రజ్ఞావంతులుగా మారడం, నైపుణ్యాలను సంపాదించుకోవడం, సరైన వైఖరిని పెంపొందించుకోవడం యువ గ్రాడ్యుయేట్ల కెరీర్ అవకాశాలకు, అభివృద్ధికి సహాయపడుతుందని సూచించారు. మెకానికల్ లేదా సివిల్ ఇంజనీరింగ్ ప్రాథమిక నేపథ్యంగా ఉన్నవారు కంప్యూటర్ సైన్స్ లేదా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో కోర్సులను అభ్యసించవచ్చని, తద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చునని సూచన చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన అసోచాం కర్ణాటక స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ టీఆర్ పరశురామన్ మాట్లాడుతూ.. కష్టానికి ప్రత్యామ్నాయం లేదని, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. వీఐటీ చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. గ్రామీణ, పేద, మధ్యతరగతి పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహించాలని, ఉన్నతవిద్య, పరిశోధనలపై ఖర్చు పెంచాలని ప్రభుత్వాలకు సూచించారు. గ్రామీణ, పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడంలో, స్కాలర్‌షిప్‌లు అందించడంలో వీఐటీ పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం, సహాయ ఉపాధ్యక్షులు కాదంబరి ఎస్.విశ్వనాథన్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పార్థసారథి మల్లిక్ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా బిందు సేద్యం అమలు

- రిజిస్ట్రేషన్ ప్రారంభించాలని మంత్రి అచ్చెన్న ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్ని జిల్లాల్లోనూ ఉద్యాన రైతులకు రాయితీపై బిందు సేద్య పరికరాలు అందించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. దీని కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. రాయితీపై బిందు సేద్యం అమలుపై ఆయన సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాయితీపై బిందు సేద్యం అమలు చేయాలన్న సంకల్పంతో బకాయిల్లో రూ.175 కోట్లు విడుదల చేశామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్య గణన

15-59 ఏళ్ల మధ్య ఉన్న వారి వివరాల సేకరణ

- కేవలం చదువుకున్నవారే లక్ష్యం కాదు
- వ్యవసాయం నుంచి గృహిణుల వరకు
- ప్రతి వృత్తిదారుని నైపుణ్యాల అంచనా
- ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోని వారికి కూడా
- యాప్ రూపొందిస్తున్న నైపుణ్యాభివృద్ధి సంస్థ
- గణన అనంతరం పరిశ్రమలతో అనుసంధానం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నైపుణ్య గణన(స్కిల్ సెన్సెస్)ను వినూత్నంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం యువత, చదువుకున్నవారే లక్ష్యంగా కాకుండా రాష్ట్రంలోని ప్రజలందరి నైపుణ్యాలను గణించే దిశగా చర్యలు ప్రారంభించింది. ఇప్పటివరకు నైపుణ్యాల గణన అంటే కేవలం చదువులు పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు దీనికి భిన్నంగా రాష్ట్రంలోని 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న అందరి నైపుణ్యాలను లెక్కించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.5 కోట్ల మంది నైపుణ్యాలు, వారి నైపుణ్యాల మెరుగుదల ఆసక్తులను తెలుసుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ మేరకు ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నైపుణ్య గణన ఫైలుపై సీఎం చంద్రబాబు సంతకం చేశారు. దీంతో నైపుణ్య గణన అంశంపై నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు వేగంగా చర్యలు ప్రారంభించారు. రెండు నెలల్లోనే గణన పూర్తిచేయాలని భావిస్తున్నారు. ఆ తర్వాత నైపుణ్యాలను ఎలా మెరుగుపరచాలనే అంశంపై దృష్టి పెడతారు.

ప్రతి వృత్తిపైనా అంచనా

కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే యువతే కాకుండా వ్యవసాయం, వడ్రంగి, కుమ్మరి నుంచి గృహిణుల వరకు ప్రతి వృత్తినీ గణనలోకి తీసుకురానున్నారు. అలా చేస్తేనే రాష్ట్రంలో ఎంత మంది ప్రజలు ఏయే రంగాల్లో నైపుణ్యం కలిగి ఉన్నారనే దానిపై స్పష్టత వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఉదాహరణకు వ్యవసాయం చేసే వారైతే ఆధునిక వ్యవసాయ పద్ధతులు వారికి ఏ మేరకు తెలుసు? వాటిని మెరుగుపరుచుకునే ఆసక్తి ఉందా? కొత్త పద్ధతులపై వారి ఆసక్తులు ఏంటి? అనే అంశాలపై వివరాలు సేకరిస్తారు. గృహిణులైతే.. వారు ఏం చదువుకున్నారు? గతంలో ఎలాంటి పోటీ పరీక్షలు రాశారు? వారికి ఎలాంటి ఆసక్తులున్నాయి? అనే అంశాలను తెలుసుకుంటారు. ఇలా ప్రతి రంగంలోనూ ప్రజల నైపుణ్యాలు, వాటి మెరుగుదలకు ఉన్న ఆసక్తిని తెలుసుకోనున్నారు. ఇలా ప్రతి వృత్తి నైపుణ్యాన్నీ అంచనా వేయడం ద్వారా వారి భవిష్యత్తును మెరుగుపరిచే ప్రణాళికలు రూపొందించడం సులభతరం అవుతుందని అధికారులు అంటున్నారు. అలాగే ప్రతి వృత్తిలోనూ నైపుణ్యాల స్థాయిని కూడా అంచనా వేయనున్నారు. ఒకే వృత్తిలో అందరూ ఒకే స్థాయి నైపుణ్యాలు కలిగి ఉండే అవకాశం లేనందున, వారి స్థాయిలను కూడా కేటగిరీల వారీగా వర్గీకరించనున్నారు. తద్వారా భవిష్యత్తులో ఎవరు ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పోటీపడగలరు అనేది అంచనా వేయడం సులభమవుతుందని భావిస్తున్నారు.

ఎక్కడున్నా గణనలోకి

రాష్ట్ర ప్రజలు ఎక్కడున్నా వారి నైపుణ్యాలను అంచనా వేస్తారు. సంబంధిత యాప్‌లో ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యి ప్రజలు వ్యక్తిగతంగా వారి నైపుణ్య వివరాలను అప్‌లోడ్ చేయొచ్చు. ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో ఉండేవారి వివరాలను ఈ రూపంలో లెక్కిస్తారు. రాష్ట్రంలో ఉన్నవారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నైపుణ్యాలు నమోదుచేస్తారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న వివరాల తరహాలో హడావుడిగా కాకుండా ఒక్కొక్కరు 20 మంది వివరాలను మాత్రమే తీసుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. తద్వారా సమాచారంలో నాణ్యత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

పరిశ్రమలతో అనుసంధానం

నైపుణ్య గణన అనంతరం ప్రభుత్వం మరో రెండు కార్యక్రమాలు చేపట్టనుంది. ఒకటి ప్రజల నైపుణ్యాలను మెరుగుపర్చడం, రెండోది పరిశ్రమల అవసరాలను ఈ నైపుణ్యాలతో అనుసంధానం చేయడం. అంటే రాష్ట్రంలోని ప్రజల్లో పలు రకాల నైపుణ్యాలు ఉన్నప్పటికీ వాటి గురించి పరిశ్రమలకు తెలియడం లేదు. రాష్ట్రంలో ఫలానా నైపుణ్యాలు కలిగిన వారు ఇంతమంది ఉన్నారనే లెక్కలను అందుబాటులో ఉంచితే, సంబంధిత పరిశ్రమలు వారిని ఉద్యోగాల్లోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఇలా వృత్తులు, వాటిలో ప్రజల నైపుణ్యాలను పరిశ్రమలకు అందుబాటులో ఉంచడం ద్వారా పరిశ్రమలు, నిరుద్యోగుల మధ్య గ్యాప్‌ను తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ఆసక్తి ఉన్నప్పటికీ వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం లేని వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చే అంశాన్ని మరో అంశంగా తీసుకుంది.

పోలవరం పూర్తయితే ఆరు రాష్ట్రాలకు లబ్ధి

- లోక్‌సభలో కేంద్రానికి ఎంపీ పుట్టా వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆరు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. 10.70 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతుందని, 540 గ్రామాలలో 28 లక్షల మందికి తాగునీరు లభిస్తుందని చెప్పారు. విశాఖపట్నంలో తాగు, పారిశ్రామిక అవసరాలకు 23 టీఎంసీలను అందించవచ్చన్నారు. జలవిద్యుత్కేంద్రం ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. శుక్రవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులకు పునరావాస, మౌలిక సదుపాయాల కల్పనకు కావలసిన అనుమతులకు సంబంధించిన చర్యలను వేగవంతం చేయాలని కోరారు.

సాగర్‌కు భారీ వరద!

- నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లను తాకిన నీటి మట్టం
- శ్రీశైలం నుంచి దిగువకు 5.28 లక్షల క్యూసెక్కులు
- ఏ క్షణమైనా సాగర్ గేట్లు ఎత్తే అవకాశం
- శ్రీశైలానికి 4,42,977 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 883.30 అడుగులకు చేరిన నీటిమట్టం
- పది గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



శ్రీశైలం డ్యామ్

అమరావతి, (ఆంధ్రజ్యోతి), శ్రీశైలం, ఆగస్టు 2: కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలాన్ని దాదాపు పూర్తిగా నింపిన కృష్ణమ్మ.. నాగార్జునసాగర్ దిశగా పరుగులు పెట్టడంతో సాగర్‌కు కూడా జలకళ వచ్చింది. ఎగువ నుంచి వచ్చిన వరద సాగర్ క్రస్ట్ గేట్లను తాకింది. దీంతో మరో మూడు రోజుల్లో ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసే అవకాశం కనిపిస్తోంది. అయితే ఏ క్షణమైనా సాగర్ గేట్లు తెరిచే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించినట్టు సమాచారం. కాగా, ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శుక్రవారం శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ 10 క్రస్టుగేట్లను 20 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 3,21,633 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 1,67,728 క్యూసెక్కులు మొత్తం 4,89,361 వరద ప్రవాహం వస్తోంది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 4,42,977 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.30 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 206.0996 టీఎంసీలుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 23,904 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,857 క్యూసెక్కులు, డ్యామ్ 10 క్రస్టుగేట్ల ద్వారా 4,66,650 క్యూసెక్కులు మొత్తం 5,28,411 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ గరిష్ఠ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, ప్రస్తుత నిల్వ 196.97 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 3,36,543 క్యూసెక్కుల వరద వస్తుంటే.. దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టులోకి 23,272 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రైతులకు త్వరగా నీళ్లందేలా చర్యలు: నిమ్మల

నాగార్జునసాగర్ కాలువలకు కృష్ణాడెల్టా కాలువలకు ఖరీఫ్ పంట సాగుకు అవసరమైన నీరు అందించాలని అధికారులను జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. సాగర్ కింద ఉన్న కృష్ణాడెల్టా కాలువలపై ఆధారపడిన రైతులు నార్లు వేసుకునేందుకు త్వరగా నీళ్లందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తగ్గుతున్న గోదావరి వరద

- ధవళేశ్వరం వద్ద 10.70 అడుగులకు నీటిమట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- బ్యారేజీ నుంచి 8,55,368 క్యూసెక్కులు దిగువకు

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), పోలవరం, ఆగస్టు 2: రెండు వారాలపాటు పెరుగుతూ తగ్గుతూ.. మళ్లీ పెరుగుతూ దోబూచులాడిన గోదావరి వరద రెండు రోజుల నుంచి నెమ్మదిగా తగ్గుతోంది. దీంతో ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు తగ్గింది. బ్యారేజీ నుంచి 8,50,203 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇప్పటివరకూ బ్యారేజి నుంచి 1,480 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి పోయింది. ఎగువన భద్రాచలం వద్ద కూడా నీటిమట్టం సాయంత్రం 6 గంటలకు 34.30 అడుగులకు తగ్గింది. ఆదివారం నాటికి సాధారణ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో ఇంతవరకూ నష్టాన్ని ప్రాథమికంగానే అంచనా వేశారు. నష్టాన్ని అంచనా వేసేందుకు బృందాలను ఏర్పాటు చేశారు.


పోలవరం వద్ద తగ్గుముఖం

ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని పోలవరం ప్రాజెక్టు శుక్రవారం నాటికి వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 8,33,097 క్యూసెక్కుల వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 31.880 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.320 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

జార్ఖండ్ పరిసరాల్లో వాయుగుండం

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ పరిసరాల్లో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి శుక్రవారం సాయంత్రానికి జార్ఖండ్ ఉత్తర ప్రాంతంలో వాయుగుండంగా బలపడింది. దీని ప్రభావంతో శుక్రవారం నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా వాయుగుండం ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండదని వాతావరణశాఖ పేర్కొంది. కాగా, రుతుపవనాల ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో శుక్రవారం అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీగా రామకృష్ణారెడ్డి



అమరావతి, విజయవాడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీగా ఎన్.పి.రామకృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎండీగా ఉన్న జయ మన్మథరావును ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీగా రామకృష్ణారెడ్డి మూడేళ్లపాటు కొనసాగుతారు. గతంలోనూ టీడీపీ హయాంలో ఆయన ఎండీగా విధులు నిర్వహించారు. విజయవాడ మీడియం మెట్రోకు డీపీఆర్ రూపకల్పనతోపాటు విజయవాడ-అమరావతిలను అనుసంధానం చేసేలా లైట్ మెట్రో డీపీఆర్, విశాఖలో పీపీపీ విధానంలో మెట్రో డీపీఆర్, గుంటూరు-విజయవాడ హైస్పీడ్ రైల్ కారిడార్ డీపీఆర్ల రూపకల్పనకు రామకృష్ణారెడ్డి విశేష కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుది డీపీఆర్‌లు రావటం.. వాటిని తొక్కిపట్టడం జరిగింది. దీంతో తీవ్ర నిరుత్సాహానికి గురైన రామకృష్ణారెడ్డి ఎండీ బాధ్యతల నుంచి వైదొలిగారు. టీడీపీ ప్రభుత్వం తిరిగి రావటంతో.. కొద్ది రోజుల కిందట రామకృష్ణారెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడారు. ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా కోరారు. వయస్సు రీత్యా ముందు రామకృష్ణారెడ్డి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అనుభవం రీత్యా మీ సేవలు తప్పనిసరి అని చంద్రబాబు గట్టిగా కోరటంతో ఆయన కాదనలేకపోయారు.

దివ్యానుభూతినిచ్చేలా తిరుమల యాత్ర

- గత నెలలో హుండీ ఆదాయం రూ.125.35 కోట్లు: టీటీడీ ఈవో

తిరుమల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భక్తులకు తిరుమల యాత్ర ఒక దివ్యానుభూతిని ఇచ్చేలా కృషి చేస్తున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఉదయం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీవారి దర్శనం, వసతి సౌకర్యాలు మరింత మెరుగ్గా కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. గత నెలలో 22.13 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.125.35 కోట్ల కానుకలు వచ్చాయన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వివాదంలో మదురో హ్యాట్రిక్

దక్షిణ అమెరికా దేశం వెనెజువెలాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో నికోలస్ మదురో మూడోసారి అధ్యక్షుడిగా గెలిచారు. ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని, మదురో గుప్పిట్లో ఉన్న ఎన్నికల సంఘం యాభైఒక్కశాతం ఓట్లు వచ్చాయంటూ తప్పుడు లెక్కలు రాసి విజేతగా ప్రకటించిందని ఆయన ప్రత్యర్థులు ఆగ్రహాన్ని ప్రకటించారు. బరిలో ఎనిమిదిమంది అభ్యర్థులున్నా, పోటీ ప్రధానంగా మదురో—విపక్ష అభ్యర్థి ఎడ్మండ్ గొంజాలెస్ మధ్య సాగింది. గొంజాలెస్‌ను విజేతగా ప్రకటించనంతవరకూ దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలు, విధ్వంసాలు ఆగవని విపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్యన అమెరికా గురువారం గొంజాలెస్‌ను విజేతగా గుర్తిస్తున్నట్టు ప్రకటించింది. అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ ప్రకటన ద్వారా మదురోమీదా, అక్కడి ఎన్నికల సంఘం మీదా నైతికమైన ఒత్తిడి తెచ్చారనీ, విపక్షానికి బలం చేకూర్చారని కొందరు వాదిస్తుంటే, వెనెజువెలా ఎన్నికల్లో వేలుపెట్టడం కంటే, అల్లకల్లోలంగా ఉన్న అమెరికా ముందు తన ఇల్లుచక్కబెట్టుకోవడం మంచిదని మదురో గట్టిగా ఓ హెచ్చరిక చేశారు.

మదురోకు 51శాతం, గోంజాలెస్‌కు 44శాతం ఓట్లు పోలైనట్టు ఎన్నికల సంఘం చేసిన ప్రకటనలో కుట్ర ఉన్నదని అందరూ నమ్ముతున్నారు. బూత్‌స్థాయి ఓటింగ్ డేటాతో ప్రతీ వివరమూ బహిర్గతం చేయాలని విపక్షనేతలు డిమాండ్ చేస్తుంటే, దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని రంగంలోకి దించి తన ఎన్నికకు ఆమోదముద్రవేయించుకోవాలని మదురో చూస్తున్నారు. విపక్ష అభ్యర్థిని విజేతగా అమెరికా ప్రకటించడానికి కొద్దిగంటల ముందు మదురో ట్విటర్ వేదికగా ఓ ఆసక్తికరమైన ప్రకటన చేశారు. ఈ అనవసరపు బెదిరింపులు ఆపి, వెనెజువెలా సార్వభౌమత్వాన్ని అమెరికా గౌరవించినపక్షంలో దానితో చర్చలకు తాను సిద్ధమన్నారు. దేశంలో ఎన్నికలు జరిగితే ఆంక్షలు ఎత్తివేస్తానని గత ఏడాది అమెరికా హామీ ఇచ్చిన మేరకు దాని ప్రాతిపదికగా ఈ చర్చలు జరగాలన్నారు. ఖతార్ వేదికగా జరిగిన ఈ చర్చల అనంతరం, గణనీయమైన చమురు నిల్వలున్న వెనెజువెలా తిరిగి ప్రపంచ చమురు వాణిజ్యంలోకి అడుగుపెడుతుందని అధికులు విశ్వసించారు. 2017, 2019లలో అమెరికా ఆంక్షలు విధించడానికి ముందువరకూ భారత్ దిగుమతి చేసుకొనే మొత్తం చమురులో వెనెజువెలా వాటాయే గణనీయంగా ఉండేది. కానీ, ఆ తరువాత ఆంక్షల కారణంగా చమురు దిగుమతులు నిలిచిపోయాయి. అధ్యక్ష ఎన్నికలు సక్రమంగా, సవ్యంగా జరుగుతాయన్న మదురో హామీ మేరకు, విపక్షాలతో కుదిరిన సయోధ్య నేపథ్యంలో గత ఏడాది అమెరికా కొన్ని నియమనిబంధనలను సడలించింది. ఉక్రెయిన్ యుద్ధం కూడా ఈ నిర్ణయానికి దోహదం చేసింది. దీనితో భారీ ముడిచమురు దిగుమతులతో, యూరప్‌కు శుద్ధి చేసిన చమురు ఎగుమతులతో భారత్ గణనీయంగా లబ్ధిపొందింది. గత ఏడాది వెనెజువెలానుంచి భారత్ దిగుమతి చేసుకున్న ముడిచమురులో 90శాతం వాటా రిలయెన్స్‌దేనని అంటారు. చవుకగా కొని, గుజరాత్‌లో శుద్ధిచేసి, లాభం ఉన్నచోటకు ఎగుమతిచేయడమనే ప్రక్రియ సవ్యంగా జరుగుతున్న తరుణంలో మళ్ళీ మొన్న ఏప్రిల్‌లో ఆంక్షలు వచ్చిపడ్డాయి. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తానన్న ఒప్పందానికి అనుగుణంగా మదురో చర్యలు లేవంటూ అమెరికా ఈ నిర్ణయం తీసుకోవడంతో, వెనెజువెలానుంచి మళ్ళీ భారత్‌కు చమురు దిగుమతులు నిలిచిపోయాయి. అమెరికా ట్రెజరీ విభాగానికి రిలయెన్స్ దరఖాస్తు చేసుకుందనీ, ఇటీవలే దిగుమతులకు అనుమతులు సైతం లభించాయని వార్తలు వచ్చాయి. అధ్యక్ష ఎన్నికల ఫలితాల చుట్టూ ప్రస్తుతం సాగుతున్న వివాదం మన ముడిచమురు దిగుమతులకు ఆటంకం కలిగించకపోవచ్చును కానీ, ఈ సంక్షోభం సాధ్యమైనంత వేగంగా పరిష్కారం కావాల్సిన అవసరం ఉంది. రష్యా చైనా మదురో పక్షాన నిలుస్తూ, పలు లాటిన్ అమెరికన్ దేశాలు చెరోవైపూ చీలిపోయిన ఈ సందిగ్ధస్థితి సడలాలంటే మదురో ప్రజాస్వామ్యయుతంగా నడుచుకోవాలి. తన మిత్రదేశాలైన మెక్సికో, బ్రెజిల్, కొలంబియా సైతం ఎన్నికల సంఘం పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరుతున్న విషయాన్ని ఆయన విస్మరించకూడదు.

గుప్పెడు ఉద్యోగాలకు వేనవేల అభ్యర్థులు!



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

జూలై 23, 2024న గౌరవనీయ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024—25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ సమర్పించారు. మరుసటి రోజు పార్లమెంటు ఉభయ సభలలో బడ్జెట్‌పై చర్చ జరిగింది. ఆ చర్చకు జూలై 30న లోక్‌సభలోను, జూలై 31న రాజ్యసభలోను ఆర్థిక మంత్రి సమాధానమిచ్చారు.

ఆర్థిక మంత్రి వాదన స్థూలంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంది: (1) ప్రతి మంత్రిత్వ శాఖ వ్యయాల కింద ప్రభుత్వం నిధులను మరింత మిక్కుటంగా ఖర్చు పెడుతోంది. వ్యయ పరిమాణం సుపరిపాలనకు కొలమానం అని సీతారామన్ ఉద్ఘాటించారు. పర్యవసానంగా అన్ని వర్గాల ప్రజలు 'అభివృద్ధి', 'సంక్షేమం'తో విశేషంగా లబ్ధి పొందుతున్నారు. తన వాదనను బలపరచుకోవడానికి ఆర్థిక మంత్రి కొన్ని అంకెలను వెల్లడించారు : 2013—14 (యూపీఏ ప్రభుత్వ చివరి సంవత్సరం)లో ఎంత ఖర్చు పెట్టింది; 2019—20, 2023—24 (ఎన్డీఏ రెండో ప్రభుత్వ మొదటి, చివరి సంవత్సరాలు)లో ఎంత ఖర్చు పెట్టిందీ, 2024—25 ఆర్థిక సంవత్సరంలో ఎంత ఖర్చు పెట్టనున్నదీ ఆమె తెలిపారు. ఆ అంకెలు, సంవత్సరం సంవత్సరానికీ ప్రభుత్వం చేస్తున్న వ్యయం ఎంతగా పెరిగిపోతున్నదో వివరించాయి. ఉదాహరణకు వ్యవసాయ రంగంలో చేసిన వ్యయాన్ని చూద్దాం. యూపీఏ ప్రభుత్వ చివరి సంవత్సరంలో వ్యవసాయరంగానికి రూ.0.30 లక్షల కోట్లు కేటాయించగా, ఆ కేటాయింపులు రూ.1.52 లక్షల కోట్లు అని ఆమె పేర్కొన్నారు. ఈ మొత్తం, గత ఆర్థిక సంవత్సరం (2023—24) కేటాయింపుల కంటే రూ.8000 కోట్లు ఎక్కువ అని ఆర్థిక మంత్రి అన్నారు. 'వ్యవసాయ రంగానికి కేటాయింపులు మేము ఏటికేడాది పెంచుతూ పోయామే కాని ఎన్నడూ తగ్గించలేదని' నిర్మలా సీతారామన్ అన్నారు. అయితే గమనార్హమైన విషయమేమిటంటే ఆ అంకెలు ప్రస్తుత ధరలలో ఉన్నాయి కాని స్థిరమైన ధరలలో లేవు. మొత్తం వ్యయంలో లేదా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఆ వ్యయ పెరుగుదల ఎన్నో వంతుగా ఉన్నదనేదే చాలా ముఖ్యం. ఈ ఉపయుక్త విషయాలను ఆర్థిక మంత్రి వెల్లడించనే లేదు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే 2023—24 ఆర్థిక సంవత్సరంలో వివిధ మంత్రిత్వ శాఖలు కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు పెట్టలేదు. ఎందుకు ఖర్చు పెట్టలేదో ఆర్థిక మంత్రి వివరించలేదు.

(2) నిరుద్యోగిత సమస్య లేనే లేదు. 'సక్షామ్, స్వతంత్ర, సమర్థ్' (అర్హత, స్వతంత్రత, సామర్థ్యం) అనేది తమ ప్రభుత్వ విధానమని ఆర్థిక మంత్రి చెప్పారు. దేశంలో నిరుద్యోగిత 3.2 శాతానికి తగ్గిపోయినట్టు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించిందని ఆమె పేర్కొన్నారు. 2014—2023 సంవత్సరాల మధ్య దేశంలో 125 మిలియన్ ఉద్యోగాలను సృష్టించినట్టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధక విభాగం నివేదిక వెల్లడించిందని ఆర్థిక మంత్రి తెలిపారు. అవి రెండూ ప్రభుత్వ నివేదికలే. సిఎమ్ఐఇ డేటా ఆ నివేదికల వివరాలకు విరుద్ధంగా ఉన్నది. దేశంలో నిరుద్యోగిత ప్రస్తుతం 9.2 శాతంగా ఉన్నదని ఆ ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థ పేర్కొంది. భారత్‌లో నిరుద్యోగులుగా ఉన్న వారిలో 83 శాతం మంది యువజనులేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) వెల్లడించింది. మరి కేవలం కొన్ని వందల లేదా కొన్ని వేల ఉద్యోగాలకు లక్షలాది అభ్యర్థులు ఎందుకు పోటీపడుతున్నారు? ఈ ప్రశ్నకు ఆర్థిక మంత్రి సమాధానమివ్వలేదు. ఈ ఉదంతాలను చూడండి. బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌కు పరీక్ష నిర్వహించారు. 60,244 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఆ పరీక్షకు (16 లక్షల మంది మహిళలతో సహా) 48 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ భర్తీ చేయనున్న 7500 ప్రభుత్వోద్యోగాలకు 24,74,030 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగిత నిజంగా తగ్గిపోతే భర్తీ చేయాల్సిన ఉద్యోగాల సంఖ్యకు, దరఖాస్తుదారుల/అభ్యర్థుల సంఖ్యకు మధ్య అంత పెద్ద తేడా ఎలా ఉన్నది? ఆ తేడా పోలీసు ఉద్యోగాల విషయంలో 1:80గా, క్లర్కుల విషయంలో 1:329గా ఎందుకు ఉన్నది! పోలీసు శాఖలో అతి తక్కువ స్థాయి ఉద్యోగానికి ఇంజనీర్లు, మేనేజ్ మెంట్ గ్రాడ్యుయేట్లు, లాయర్లు, పోస్ట్‌—గ్రాడ్యుయేట్లు సైతం ఎందుకు దరఖాస్తు చేశారు? నిరుద్యోగిత ఎంత తీవ్రంగా ఉన్నదో తెలుసుకోవాలంటే ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రులు పట్టణాలు, నగరాల వీధులలో తిరగాలి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన సంచారాన్ని మదురై (ఆమె జన్మ స్థలం)లో ప్రారంభించి విల్లుపురం (ఆమె పాఠశాల విద్యాభ్యాసం జరిగిన పట్టణం)కు వెళ్లి, ఆ తరువాత తిరుచిరాపల్లి (కళాశాల చదువుకు ఆమె వెళ్లిన నగరం)లో ముగించాలి.

(3) యూపీఏ ప్రభుత్వాల హయాంలో కంటే మా ప్రభుత్వ హయాంలో ద్రవ్యోల్బణం రేటు మెరుగ్గా ఉన్నదని ఆర్థిక మంత్రి అన్నారు. నిర్మలా సీతారామన్ ఇంకా ఇలా అన్నారు: 'హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలలో చదువుకున్న నాయకులు యూపీఏ ప్రభుత్వాల హయాంలో ఆర్థిక మంత్రిత్వ శాఖను నిర్వహించారు. 2009—13 సంవత్సరాల మధ్య ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయికి పెరగడానికి దారితీసిన ఉద్దీపన పథకాలను ఎప్పుడు, ఎలా ఉపసంహరించాలో వారికి తెలియలేదు'. ఆర్థిక మంత్రి అభియోగం సాంకేతికంగా సరైనదే. అయితే అది ఔచిత్యం లోపించిన ఆరోపణ. ఎందుకని? ఇప్పుడు దేశ ప్రజలు యూపీఏ ప్రభుత్వ పాలనలో నివశించడం లేదు. నరేంద్ర మోదీ రెండో ప్రభుత్వ పాలనలో నివశిస్తున్నారు. టొమాటో, ఉల్లిపాయలు, పొటాటో ధరలు ఏటేటా వరుసగా 30 శాతం, 46 శాతం, 59 శాతం చొప్పున పెరుగుతున్న కాలంలో నివశిస్తున్నారు. వేతన ప్రేరిత ద్రవ్యోల్బణం (వేజ్ పుష్ ఇన్‌ఫ్లేషన్) 3.4 శాతం, వినియోగ దారు ధరల ద్రవ్యోల్బణం (కన్స్యూమర్ ప్రైస్ ఇన్‌ఫ్లేషన్) 5.1 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 9.4 శాతంగా ఉన్న కాలంలో నివశిస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా సకల కార్మికుల వేతనాల పెరుగుదల స్తంభించిన కాలంలో వారు నివశిస్తున్నారు. గత వేసవిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు యూపీఏ ప్రభుత్వ కాలంలోని ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా కాకుండా, నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో ద్రవ్యోల్బణ పెరుగుదలకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ద్రవ్యోల్బణ భారాన్ని తగ్గించేందుకు, పూర్వ నిర్ధారిత ధరల (అడ్మినిస్టర్డ్ ప్రైసెస్) తగ్గింపునకు, పన్నులు, సెస్‌ల తగ్గింపునకు, కనీస వేతనాల పెరుగుదలకు ఆర్థిక మంత్రి ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదు. ద్రవ్యోల్బణంపై ప్రధాన ఆర్థిక సలహాదారు అభిప్రాయాన్ని ఆమె ఉటంకించారు. అది: 'భారతదేశ ద్రవ్యోల్బణం తక్కువస్థాయిలో స్థిరంగా కొనసాగుతూ నాలుగు శాతం నిర్దేశిత లక్ష్యం దిశగా సాగుతోంది'. ఈ ఉటంకింపుతో ద్రవ్యోల్బణంపై చర్చకు ఆమె తన సమాధానాన్ని ముగించారు. ఇంతకూ ఒక ప్రాసంగిక ప్రశ్నకు ఆర్థిక మంత్రి సమాధానమివ్వనే లేదు. ఇదీ ఆ ప్రశ్న: ద్రవ్యోల్బణం నియంత్రణ అంత మెరుగ్గా ఉంటే, రిజర్వ్ బ్యాంక్ గత 13 నెలలుగా బ్యాంక్ రేటును 6.5 శాతంగా మాత్రమే ఎందుకు ఉంచుతోంది? 2024లో సైతం దానిని తగ్గించే అవకాశాలు ఎందుకు కన్పించడం లేదు?

2024—25 కేంద్ర బడ్జెట్‌పై ప్రజలు పెదవి విరిచారు. సగటు పౌరులు దానిపట్ల ఉదాసీనంగా ఉన్నారు. మోదీ ప్రభుత్వాన్ని సమర్థించే వారు సైతం సమాజంలోని వివిధ వర్గాలకు అది సమకూర్చే శ్రేయస్సుపై సంశయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అది చేసే దోహదమేమిటో వారికి అర్థం కావడం లేదు. ఎవరూ ఉత్సాహంగా లేరు. ఒక్క ఆర్థిక మంత్రి మాత్రమే తన బడ్జెట్ విషయంలో అమితోత్సాహంగా ఉన్నారు. సామాన్యుల ఉదాసీనతను ఆమె గ్రహించడం లేదు. సరే, నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినప్పుడు చాలా మందితో పాటు నాకూ కలిగిన సంశయాలు, సంకోచాలు బడ్జెట్‌పై చర్చకు ఆమె సమాధానం ముగించిన తరువాత కూడా అదే విధంగా ఉండిపోయాయి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)



akbar

బడ్జెట్‌పై చర్చకు తన సమాధానంలో దేశంలో నిరుద్యోగిత సమస్య లేదు అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు. మరి కేవలం కొన్ని వందల లేదా కొన్ని వేల ఉద్యోగాలకు లక్షలాది అభ్యర్థులు ఎందుకు పోటీపడుతున్నారు? ఉత్తరప్రదేశ్ లో 60,244 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన పరీక్షకు (16 లక్షల మంది మహిళలతో సహా) 48 లక్షల మంది అభ్యర్థులు హాజరవ్వగా 7500 క్లరికల్ ఉద్యోగాలకు 24,74,030 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగిత నిజంగా తగ్గిపోతే భర్తీ చేయాల్సిన ఉద్యోగాల సంఖ్యకు, దరఖాస్తుదారుల/ అభ్యర్థుల సంఖ్య కు మధ్య అంత పెద్ద తేడా ఎలా ఉన్నది?

ఆంధ్ర మాణిక్యం 'మండలి'

ఆయన గాంధేయ సిద్ధాంతాలను త్రికరణశుద్ధిగా జీవితాంతం ఆచరించిన నిస్వార్థ రాజకీయ నాయకుడు. గుండెల నిండా మాతృభాషాభిమానం నింపుకున్న అమృత హృదయుడు. అభాగ్యజీవులకు ఆపన్న హస్తం అందించిన సేవానిరతుడు. మంత్రిగా పనిచేస్తూ, ప్రజలతో మమేకమై ఆర్టీసీ బస్సులలో తిరిగిన నిరాడంబర వ్యక్తి. పూల దండలను సైతం అంగీకరించని నిగర్వి. ఒక వ్యక్తిలో ఇన్ని సుగుణాలు ఉన్నాయని చెబితే అందరికీ వెంటనే గుర్తుకు వచ్చే పేరు మండలి వెంకటకృష్ణారావు.

ఆయన ఒక వ్యక్తి కాదు— ఒక సంస్థ. సంస్థ అనడం కూడా తక్కువే. విభిన్న ధ్యేయాలు గల కొన్ని మహాసంస్థల సమాహారం మండలి వెంకటకృష్ణారావు. సంఘ సేవకుడుగా, జాతీయ, అంతర్జాతీయ సేవా సంస్థల కార్యకలాపాలకు ఆయనొక వేదిక. ఇతర రాష్ట్రాలలోనూ, ఇతర దేశాలలోనూ నివసిస్తున్న తెలుగు వారికి ఆత్మబంధువు. సాంఘిక సంక్షేమ మంత్రిగా, మత్స్యకారులకు, బడుగుబలహీనవర్గాల వారికి ఆయన చేసిన సేవ చిరస్మరణీయం. విద్యాసాంస్కృతిక శాఖల మంత్రిగా కవులకు, కళాకారులకు, సాహితీవేత్తలకు మిత్రుడు. అధికారులకు ఆత్మీయుడు. రాజకీయాలలో ధీరోదాత్తుడు. దివిసీమ తుఫాను, ఉప్పెన విపత్తులో సర్వస్వం కోల్పోయిన దీనజనులకు పట్టుకొమ్మ. మూర్తీభవించిన తెలుగుతనం.

ముఖ్యమంత్రిగా పి.వి. నరసింహారావు ప్రారంభించిన తెలుగు పునరుజ్జీవ కార్యక్రమాలను విద్యాసాంస్కృతిక మంత్రిగా ఆయన కొనసాగించారు. పి.వి. స్థాపించిన తెలుగు అకాడమీకి ఛైర్మన్‌గా.. డిగ్రీ, పి.జి. స్థాయిలలో తెలుగు మాధ్యమంలో పాఠ్యపుస్తకాల ప్రచురణకు అవిశ్రాంతంగా కృషి చేసి, విజయం సాధించారు. పి.వి స్థాపించిన ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు కొనసాగింపుగా నాగార్జునసాగర్ వద్ద గురుకుల జూనియర్ కళాశాలను విద్యా మంత్రిగా మండలి వెంకటకృష్ణారావు నెలకొల్పారు. ఈ కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు తదనంతర కాలంలో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ప్రతిష్ఠాత్మక ఉద్యోగాలకు కూడా ఎంపికైనారు.



సంఘ సేవకుడుగా జాతీయ, అంతర్జాతీయ సేవా సంస్థల కార్యకలాపాలకు మండలి వెంకటకృష్ణారావు వేదిక. ఇతర రాష్ట్రాలలోనూ, ఇతర దేశాలలోనూ నివసిస్తున్న తెలుగు వారికి ఆత్మబంధువు. సాంఘిక సంక్షేమ మంత్రిగా, మత్స్యకారులకు, బడుగు బలహీనవర్గాల వారికి ఆయన చేసిన సేవ చిరస్మరణీయం.

1975 ఏప్రిల్ 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వారం రోజుల పాటు హైదరాబాద్ నగరంలో లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలను 'న భూతో న భవిష్యతి' అన్న విధంగా నిర్వహించి, దేశ విదేశాలలో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల ప్రతినిధులను ఒకే వేదిక పైకి తెచ్చారు.

మహాసభలలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం ప్రకారం ఇతర రాష్ట్రాల్లోనూ, ఇతర దేశాల్లోనూ ఉంటున్న తెలుగువారికి భాషాసాంస్కృతిక పరమైన సహాయం అందించడానికి, తెలుగు భాష అధ్యయనానికి, తెలుగులో పరిశోధనలకు జాతీయ, అంతర్జాతీయ విద్వాంసులకు అవకాశం కల్పించడానికి తెలుగు భాష, సంస్కృతులకు అంతర్జాతీయ ఖ్యాతి లభింపజేయడానికి అంతర్జాతీయ తెలుగు సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థను 1975 సెప్టెంబర్ 8న అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ చేత ప్రారంభింపజేశారు.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన తరతరాల తెలుగు జాతి మ్యూజియంకు సందర్శకుల నుంచి వచ్చిన స్పందనను చూసి అనాదిగా గల తెలుగువారి చరిత్ర, భాష, సాహిత్యం, లిపి, కళలు, ఆచారాలు, వేషధారణ, పనిముట్లు మొదలైన సాంస్కృతిక విశేషాలను పరిణామక్రమంలో ఒక చోట సమీకరించి పరిరక్షించడానికి, ఘనమైన తెలుగు జాతి మహోన్నత కీర్తి, ప్రతిష్ఠల గురించి ఇతరులకు సరైన అవగాహన, గౌరవం కలిగే విధంగానూ, భావితరాలకు స్ఫూర్తిదాయకంగానూ, పరిశోధకులకు కొంగు బంగారంగానూ వుండే విధంగా 'తరతరాల తెలుగు జాతి' మ్యూజియం ఏర్పాటు చేయాలని మండలి సంకల్పించారు. ఇందుకుగాను హైదరాబాద్ లోని పబ్లిక్ గార్డెన్స్ లో 'సరూబాగ్' అనే ప్రదేశంలో మూడెకరాల స్థలాన్ని సేకరించారు. ఆనాటికి పబ్లిక్ గార్డెన్స్‌లో ఏ రకమైన కట్టడాలు చేపట్టరాదనే నిబంధన ఉండేది. మ్యూజియం నిర్మాణానికిగాను ఈ నిబంధనను ప్రత్యేక పరిస్థితిగా సడలింపజేశారు. హైదరాబాద్ నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్త టోకర్ సి. లాల్‌జీ కపాడియా అధ్యక్షతన ఒక సిటిజన్స్ కమిటీ ఏర్పాటై మ్యూజియం నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల నిధిని సమకూర్చారు. ఈ మొత్తానికి ప్రభుత్వ ధనాన్ని మ్యాచింగ్ గ్రాంట్ గా జతచేసి, రూ.20.00 లక్షలతో భవన నిర్మాణానికి పథక రచన చేశారు కృష్ణారావు. ఈ భవనానికి 1975 సెప్టెంబర్ 13 తేదీన అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ శంకుస్థాపన చేశారు.

మండలి వెంకటకృష్ణారావు ఆశయాలను ఆయన తనయుడు డా. మండలి బుద్ధప్రసాద్ కొనసాగిస్తుండడం హర్షదాయకం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమైన అంతర్జాతీయ తెలుగు సంస్థ, 'మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం'గా కొనసాగుతున్నది. ఈ కేంద్రం ద్వారా మండలి వెంకటకృష్ణారావు జయంతి రోజు అయిన ఆగస్టు నాలుగున ప్రతి సంవత్సరం ఇతర రాష్ట్రాలలోనూ, ఇతర దేశాలలోనూ తెలుగు భాష, సంస్కృతుల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న తెలుగు సంస్థల ప్రతినిధుల నుంచి ఒకరిని ఎంపిక చేసి, 'మండలి వెంకటకృష్ణారావు సాంస్కృతిక పురస్కారం'తో గౌరవిస్తున్నారు బుద్ధప్రసాద్. అంతేకాక, మండలి వెంకటకృష్ణారావు స్మృత్యర్థం 'మండలి ఫౌండేషన్' సంస్థను బుద్ధప్రసాద్ స్థాపించారు. ఈ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం మండలి వెంకటకృష్ణారావు జయంతి సందర్భంగా దేశానికి ప్రతిష్ఠాత్మకమైన సేవలనందించి, తెలుగు జాతి రత్నంగా కీర్తి గడించిన తెలుగు ప్రముఖుల నుంచి ఒకరిని ఎంపిక చేసి 'తెలుగు వైభవ పురస్కారం' ప్రదానం చేస్తున్నారు.

ఈ సంవత్సరం ఈ పురస్కారానికి ప్రసిద్ధ రక్షణ వ్యవహారాల శాస్త్రవేత్త డా. జి. సతీష్ రెడ్డిని ఎంపిక చేశారు. ఈ అవార్డును ఆయన ఈ నెల నాలుగున అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో జరిగే మండలి వెంకటకృష్ణారావు 99వ జయంతి ఉత్సవాలలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ గారి చేతుల మీదుగా అందుకోబోతున్నారు.

• డా. గంధం సుబ్బారావు
డిప్యూటీ రిజిస్ట్రార్ (రిటైర్డ్), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
(రేపు మండలి వెంకటకృష్ణారావు 99వ జయంతి)

దేవుడు మెచ్చే కార్యం అవయవదానం

అనారోగ్యంతో ఉన్నపుడుగానీ ఆరోగ్యం విలువ అర్థం కాదు. ఆధునిక ఆహారపు అలవాట్లూ, జీవనవిధానమూ మానవశరీరంలో కలిగిస్తున్న విధ్వంసం భయపెట్టే స్థాయిలో ఉంది. కొవిడ్ తర్వాత చిన్న వయసువారు సైతం గుండెపోటుకు గురవడం, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు వంటి ప్రధాన అవయవాలు దెబ్బతినడం.. వైద్యశాస్త్ర వర్గాలను సైతం కలవర పెడుతున్నాయి. అవయవాల మార్పిడి అవసరం రానురానూ పెరుగుతోంది. ఆధునిక వైద్యశాస్త్ర పరిజ్ఞానం వల్ల అవయవ మార్పిడి సులభతరం అవుతూ వస్తోంది. దేశంలో అవయవ మార్పిడి చేసే వైద్యనిపుణులు పెరిగారు. ఆసుపత్రులు పెరిగాయి. మార్పిడికి అవసరమైన అవయవాల లభ్యత మాత్రం పెరగలేదు. అవయవాల అమరికకై ఎదురు చూస్తున్నవారి సంఖ్య లక్షల్లో ఉండగా, దాతలు వేలల్లోనే ఉన్నారు. రకరకాల కారణాలతో చనిపోతున్నవారి నుంచి అవయవాలు సేకరించగలిగితే వేలాదిమందికి తిరిగి ప్రాణం పోయవచ్చు.



అవయవదానం పట్ల తగిన అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం. వివిధ ప్రమాదాల్లో చనిపోతున్నవారి నుంచి, బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి సేకరించే అవయవాలు అనేక ప్రాణాలను నిలుపగలవు. కానీ, కుల, మత పరమైన నమ్మకాలు, విశ్వాసాలు అవయవదానానికి అడ్డుగా మారుతున్నాయి. అవయవదానం ద్వారా చనిపోయినా జీవించవచ్చనే అభిప్రాయాన్ని ప్రజల్లో నాటుకునేలా చేయాల్సిన అవసరం చాలా ఉంది.

అవయవదానంపై విశేష పరిశోధనలకు కృషి చేసినందుకు రొనాల్డ్ లీ హెర్రిక్‌కి 1990లో నోబెల్ బహుమతి ప్రకటించారు. ఆ స్ఫూర్తిని గుర్తు చేయడానికే ప్రపంచ అవయవదాన దినోత్సవంగా ఆగస్టు 3న జరుపుకుంటున్నారు. మనదేశంలో తొలి గుండె మార్పిడి జరిగిన 1994 ఆగస్టు 3ను జాతీయ అవయవదాన దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ అయ్యింది.

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ అవయవదాన ఒప్పంద పత్రాలు ఇవ్వవచ్చు. భవిష్యత్తులో ఏ కారణం చేత అయినా మరణం సంభవిస్తే, తమ శరీరంలో కళ్లు సహా ఉపయోగపడే అవయవాలను సేకరించి అవసరమైనవారికి వినియోగించవచ్చు అనే ప్రమాణ పత్రం అది. 1997లోనే నేను ఈ పవిత్ర కార్యక్రమం కుటుంబ సహకారంతో పూర్తి చేసాను. 27 ఏళ్ల తర్వాత కూడా ఇప్పటికీ అవయవదానంపై సమాజంలో పెద్దగా చైతన్యం పెరగకపోవడం ఆందోళనపరుస్తోంది. వయసురీత్యానో, ఆరోగ్య సమస్యలతోనో, ఎదురుచూడని ప్రమాదాలలోనో చనిపోయిన వారు మొత్తం శరీరాన్నీ, లేదా మొత్తం అవయవాలనూ దానం చేయవచ్చు. చనిపోయిన తర్వాత కూడా, మరికొంతమందిలో, కొన్నేళ్లపాటు బ్రతికుంటారు. అవయవ దానానికి వయసుతో నిమిత్తం లేదు. గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమగ్రంధి (పేంక్రియాస్) వంటి అవయవాలు దెబ్బతిన్నవారు మరణానికి చేరువ అవుతూ, శారీరకంగా, ఆర్థికంగా చితికిపోతూ ఉంటారు. ఇటువంటి స్థితిలో ఉన్నవారికి అవయవ మార్పిడి పునర్జన్మను ఇస్తుంది. మరీ పసివయసు పిల్లలు అవయవాల సమస్యతో కళ్ల ముందే కృశించిపోతూ ఉంటే తల్లిదండ్రులు అనుభవించే నరకం చెప్పనలవిగానిది. ఈ నరకబాధ నుంచి విముక్తి కలిగించగలగడం కన్నా పుణ్యం ఏముంటుంది? ఏ దేవుడైనా మెచ్చే కార్యమే ఇది.

అవయవదాన చైతన్య కార్యక్రమం పెద్ద ఎత్తున జరగాలి. నేషనల్ ఆర్గాన్, టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎన్.ఒ.టి.టి.ఒ.), మోహన్ ఫౌండేషన్, నర్మద కిడ్నీ ఫౌండేషన్ వంటి సంస్థలకు అవయవదాన ఒప్పంద విల్లు పత్రాలను ఇవ్వవచ్చు. సమీపంలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించినా ఇందుకు సంబంధించిన వివరాలు తెలుస్తాయి. కేన్సర్, ఎయిడ్స్, కుటుంబ నియంత్రణ వంటి కార్యక్రమాలకు ఇచ్చినంత ప్రాధాన్యాన్ని ప్రభుత్వం అవయవదాన కార్యక్రమానికి కూడా ఇవ్వాలి. ప్రచారం ఉధృతంగా సాగాలి. ప్రాథమిక స్థాయిలోనే అవయవదానం ప్రాధాన్యాన్ని, అవసరాన్ని పిల్లలకు కలిగేలా పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. ఇదో మానవీయ కార్యమనే నమ్మకం కలిగించాలి. వ్యాపార ప్రకటనల్లో దర్శనమిచ్చే క్రికెటర్లు, నటులు, ప్రముఖులు, స్వచ్ఛందంగా అవయవదానపు ప్రకటనల్లో కనిపించాలి. ప్రభుత్వ ఉద్యోగులు, జీతభత్యాలను అందుకుంటున్న రాజకీయ నాయకులు అవయదానాలకు ముందుకు రావాలి. తాము అవయవదానానికి సిద్ధపడి ఒప్పంద పత్రాలు ఇచ్చామని ప్రకటించాలి. ఇందువల్ల సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తారు.

– డాక్టర్ కెజె రావు
సామాజిక కార్యకర్త
(నేడు జాతీయ అవయవదాన దినోత్సవం)

కన్వర్‌యాత్ర: 'సుప్రీం' జోక్యం సమ్మతం కాదు


హిందువులు అత్యంత పవిత్రంగా నిర్వహించే కావడి (కన్వర్) యాత్రపై జరుగుతున్న వివాదం రాజకీయ దుమారాన్ని దాటి సుప్రీంకోర్టు తలుపు తట్టింది. భక్తుల విశ్వాసాలు, సంప్రదాయాలతో పనిలేదన్నట్లు, కేవలం రాజకీయాలను దృష్టిలో ఉంచుకొని తీర్పు చెబితే చాలు అనే ధోరణిలో సుప్రీం కోర్టు కూడా వ్యవహరించడం సమ్మతం కాదు. ఓ న్యాయమూర్తి మాట్లాడుతూ 'నేను కేరళలో ఓ ముస్లిం నిర్వహించే రెస్టారెంట్‌కు వెళ్లాను. అక్కడి భోజనం నాకు నచ్చింది' అని తీర్పు చెప్పారు. అయితే, ఇక్కడ ముస్లిం రెస్టారెంట్‌లో సాధారణ ప్రజలు భోజనాలు చేయడం వేరు, పరమ పవిత్రంగా దీక్షలో ఉంటూ, పూజలు చేస్తూ, ప్రసాదాలు స్వీకరించడం వేరు అనే విషయం సుప్రీంకోర్టు గ్రహించకపోవడం గమనార్హం.

నియమనిష్ఠలతో ఉంటూ, పద్ధతుల ఆధారంగా భోజనాలు చేయడం, ప్రసాదం స్వీకరించడం కావడి భక్తుల ఆచారం. రుచికరమైన భోజనాలు చేయాలి, కడుపు నిండా తిని బ్రేవ్ అని, బయటకు రావడం కాదు. కాబట్టి, అసలు విషయం వదిలి ఏవేవో మాట్లాడటం సమంజసం కాదు.

నీ పేరు చెప్పేందుకు నీకున్న అభ్యంతరం ఏంటని ప్రశ్నిస్తే, మైనార్టీలపై దాడులకు దిగుతున్నారన్న అసంబద్ధ వాదనతో ఎదురుదాడి చేయడం దుర్మార్గం. హిందువులకు శ్రావణమాసం పరమ పవిత్రమైనది. నీసు (మాంసాహారం) ముట్టుకోకుండా నిష్ఠతో పూజలు చేయడం, ఉపవాస దీక్షతో భగవంతుడిని కొలవడం అనాదిగా వస్తున్న ఆచారం. ప్రపంచంలోని హిందువులందరూ ఒక్కో తీరుగా భగవంతుడిని కొలుస్తారు. అయితే నేడు ఆ ఆచార వ్యవహారాలపైనే దాడులు చేసేందుకు రాజకీయ నాయకులు, మానవ హక్కుల రూపంలో ఉన్న హిందూ వ్యతిరేకులు కట్టకట్టుకుని హిందూ ధర్మంపై దౌర్జన్యం చేస్తున్నారు. ఏడాదికోసారి ప్రతి శ్రావణ మాసంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, నిష్ఠతో శివుడిని కొలిచేందుకు కావడి యాత్ర తీస్తుంటే, వారి దీక్షకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారు. పవిత్రమైన భోజనం, పరిశుద్ధ ఆహారం పూజలో భాగమని.. మాంసాహార ప్రియులు వండే ఆహారంతో పూజ ఫలం చెడుతుందని భక్తులు మొత్తుకుంటుంటే ఏమాత్రం పట్టించుకోకపోవడం హిందువుల మనోభావాలకు గొడ్డలిపెట్టు. హోటల్ పేరు ఏదైనా, వంట చేసేవాడు, వడ్డించేవాడు ఎవరైనా సరే వారు పెట్టింది తినాలి అంటూ ఓ వైపు కోర్టులు గద్దిస్తుంటే, మరోవైపు రాజకీయ నాయకులు కావడి యాత్ర భక్తులపై గాండ్రింపులకు దిగుతున్నారు. ఇది చాలదు అన్నట్లు.. సోనుసూద్ అనే నటుడి మాటలు మరీ వెటకారంగా ఉన్నాయి. 'శబరి ఎంగిలి రాముడు తినలేదా..? ముస్లింల ఎంగిలి మీరు తింటే తప్పేంటీ..?' అని పుండుపై కారం చల్లుతున్నాడు. పరోక్షంగా ముస్లింల ఎంగిలి తినాలి అని హెచ్చరిస్తున్నాడు. హిందువులు ఏం తినాలి, ఎలా పూజించాలి, ఎవరి వద్ద వస్తువులు కొనాలి వంటివి కూడా రాజకీయ నాయకులు, కోర్టులు నిర్ణయించడం అసంబద్ధం. హిందువుల హక్కులు, స్వేచ్ఛను హరించే ఈ తీర్పు ఏమాత్రం సమ్మతం కాదు.

"అసలు విషయం ఇక్కడ హిందూ ముస్లిం కాదు, మా పవిత్రత. శుభ్రమైన శాకాహార భోజనం కావాలి. భోజనం అనే కన్నా ప్రసాదం అంటే ఇంకా బాగుంటుంది. దీక్షలో ఉన్నప్పుడు నిష్ఠతో తయారుచేసిన ఆహారాన్ని ప్రసాదంగా భుజించడం హిందువుల సంప్రదాయం" అని కావడి యాత్రికుల వాదన. కానీ అవన్నీ ఏమీ లేవు, మీరు ఇక్కడే భోజనం చేయండి.. అదంతా బాగుంది అంటూ హిందువులను భయభ్రాంతులకు గురి చేయడం ఆశ్చర్యకరం.

ఏడాదిక్రితం ఉగాది సమయంలో శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అసలు ఘర్షణ ఎందుకంటే, హిందువులు కానివారు శ్రీశైలంలో వ్యాపారం చేస్తున్నారు. రూ.20 వాటర్ బాటిల్‌ను రూ.25కు అమ్ముతున్నారు. అదేంటీ..? 20 రూపాయలే కదా..అని భక్తులు అడిగితే.. ఇది ఇంతే, అంటూ గద్దించారు. విసుగు చెందిన భక్తులు వేరే దుకాణానికి వెళ్లారు. దీంతో వ్యాపారులు గొడవకు దిగారు. "కొంటె మా దగ్గరే కొనాలి. చెప్పినంత చెల్లించాలి" అంటూ హుకుం జారీ చేశారు. భక్తులు వినలేదు. ఈ కారణంగా హైందవేతర వ్యాపారులంతా కలిసి భక్తులపై దాడి చేశారు, భయాందోళనలు సృష్టించి భక్తుల వాహనాలను ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర ప్రజలు ఇంకా మరువనే లేదు. పైగా దాడి ఘటన సమర్థించుకుంటూ, దాడికి గురైనవారు కర్నాటక భక్తులు అంటూ ప్రాంతాల వారీగా విభజన తీసుకువచ్చారు. కర్నాటక అయినా, ఆంధ్ర అయినా, తెలంగాణ అయినా, ఉత్తరప్రదేశ్ అయినా భక్తులు భక్తులే. ఈరోజు సుప్రీంకోర్టును ఆశ్రయించిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా, విద్యావేత్త అపూర్వానంద్, కాలమిస్ట్ ఆకార్ పటేల్, పౌరహక్కుల రక్షణ సంఘాలు, సంస్థలు ఆ రోజు ఎందుకు స్పందించలేదో తెలియజేయాలని హిందూ సమాజం డిమాండ్ చేస్తోంది. హిందువులు కలియుగ దైవంగా భావించి ఆరాధించే తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రంలో అన్యమతస్తుల ప్రచారం, ఆలయ పవిత్రతను దెబ్బతీసే కుట్రలపై స్పందించేందుకు పెద్దలకు సమయం ఉండదు. ఏడుకొండలను మూడు కొండలుగా విభజన చేస్తాననే ప్రకటనపై నోరు మెదపరు. అసలు శ్రీశైలంతో పాటు అనేక హిందూ పుణ్యక్షేత్రాలలో ఇతరుల దుకాణాలకు అనుమతులు ఎవరు ఇచ్చారో జవాబు దొరకదు.



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 250 కిలోమీటర్ల మేర సాగే కన్వర్ యాత్రలో కోట్లాది భక్తులు పాల్గొంటారు. గత ఏడాది మాంసాహారం విక్రయించే కొందరు వ్యాపారులు కావడి యాత్ర నిర్వహించే మార్గాల్లో గందరగోళం సృష్టించారు. అందుకే ముందు జాగ్రత్తగా ప్రభుత్వం వ్యాపారుల నేమ్ బోర్డు తప్పనిసరి చేసింది. భక్తులకు స్వచ్ఛమైన శాకాహారం ఎక్కడ లభిస్తుందో సూచించేలా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు ఉత్తర్వులు తీసుకురావడం ప్రతి హిందువు స్వాగతిస్తున్నాడు. కన్వర్ యాత్ర దారిలో నేమ్ బోర్డు తగిలించాలన్న ఉత్తర్వులు మతపరమైనవి కావు, ఈ విషయంలో ఎవరూ భుజాలు తడుముకోవాల్సిన పనిలేదు.

కన్వర్ యాత్రలో భాగంగా శివనామ స్మరణ చేస్తూ, సాత్విక ఆహారం భుజించి యాత్రలో పాల్గొనడం ఆనవాయితీ. ఏడాదంతా తమ కుటుంబానికి శుభాలు కలగాలని నిష్ఠతో కావడి మోస్తూ.. గంగాజలాన్ని తీసుకువచ్చి శివలింగాలకు అభిషేకం చేయడం సంప్రదాయం. శ్రీరాముడు, రావణాసురుడు, పరశురాముడు కూడా కావడి యాత్ర నిర్వహించారు. ఈ పవిత్రమైన మాసంలో గంగాజలంతో అభిషేకం చేస్తే శివుడు ప్రసన్నుడై, కోరికలు ఫలించి, శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. కానీ వారి విశ్వాసాలకు భంగం కలిగించేలా కోర్టులు, రాజకీయనేతలు తలో రీతిలో హిందూ విశ్వాసులపై దాడికి దిగడం క్షమార్హం కాదు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 250 కిలోమీటర్ల మేర సాగే యాత్రలో దాదాపు 5 కోట్ల మంది భక్తులు పాల్గొంటారు. గతేడాది మాంసాహారం విక్రయించే కొందరు వ్యాపారులు కావడి యాత్ర నిర్వహించే మార్గాల్లో కావాలని గందరగోళం సృష్టించారు. భక్తుల విశ్వాసాలకు విఘాతం కలిగించి యాత్రను అపవిత్రం చేసే విధంగా వ్యవహరించారు. పూజను, యాత్ర పవిత్రతను దెబ్బతీసే కుట్రలు చేశారు. అందుకే ముందు జాగ్రత్తగా ప్రభుత్వం వ్యాపారుల నేమ్ బోర్డు తప్పనిసరి చేసింది. భక్తులకు స్వచ్ఛమైన శాకాహారం ఎక్కడ లభిస్తుందో సూచించేలా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు ఉత్తర్వులు తీసుకురావడం ప్రతి హిందువు స్వాగతిస్తున్నాడు. కన్వర్ యాత్ర దారిలో నేమ్ బోర్డు తగిలించాలన్న ఉత్తర్వులు మతపరమైనవి కావు, ఈ విషయంలో ఎవరు భుజాలు తడుముకోవాల్సిన పనిలేదు. తన పేరు తాను చెప్పుకోవడానికి గర్వపడాలి కాని, దాచి దాచిపెట్టాల్సిన అవసరం లేదు.

▪ పగుడాకుల బాలస్వామి
ప్రచార ప్రసార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్ రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



లైట్ మెట్రోపై మళ్లీ ఆశలు



మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీగా రామకృష్ణారెడ్డి నియామకం

* విజయవాడ-అమరావతి లైట్ మెట్రో ప్రాజెక్టు కదిలే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీగా రామకృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించటంతో విజయవాడ లైట్ మెట్రోరైల్ ప్రాజెక్టుపై ఆశలు కలుగుతున్నాయి. విజయవాడ-అమరావతిని అనుసంధానించేలా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎండీగా ఉన్న రామకృష్ణారెడ్డి నేతృత్వంలోనే డీపీఆర్‌కు రూపకల్పన చేశారు. ఎన్నికల అనంతరం తుది డీపీఆర్ వచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని తొక్కిపెట్టింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మెట్రోపై ఆశలు నెలకొన్నాయి. ఇదే తరుణంలో రామకృష్ణారెడ్డిని తిరిగి నియమించటంతో విజయవాడ-అమరావతి లైట్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అడుగులు ముందుకు పడనున్నాయి.

వైసీపీ హయాంలో వెనక్కి..

విజయవాడ లైట్ మెట్రోరైల్ ప్రాజెక్టుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే డీపీఆర్ తయారీకి గ్లోబల్ టెండర్లను పిలిచారు. శిస్ట్రా అనే సంస్థ దక్కించుకుంది. దాదాపు రూ.25 వేల కోట్లతో ఈ డీపీఆర్‌ను సిద్ధం చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ప్రాజెక్టు అంచనాలు తగ్గించాలని ఆదేశించారు. దీనిని రూ.15 వేల కోట్లకు తగ్గించినా తొక్కిపెట్టారు. తుది డీపీఆర్‌లో మొత్తం నాలుగు కారిడార్లను ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ కారిడార్లపై మళ్లీ ఆశలు నెలకొన్నాయి. అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. రామకృష్ణారెడ్డి ఎండీగా బాధ్యతలు చేపట్టాక.. విజయవాడ-అమరావతి లైట్ మెట్రోరైల్ ప్రాజెక్టును కదిలించే అవకాశం కనిపిస్తోంది.

కొత్తగా..


53 మంది ఇన్‌స్పెక్టర్ల మార్పు

కమిషనరేట్‌లో భారీగా బదిలీలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పోలీసు కమిషనరేట్‌లో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. ఒకేసారి 53 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఇక్కడికి వచ్చిన వారిని తిరిగి ఏలూరు రేంజ్‌కు పంపారు. కొన్నేళ్లుగా కమిషనరేట్ పరిధిలోనే విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌స్పెక్టర్లను ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. కొంతమందిని వీఆర్‌కు పంపారు. పోస్టింగ్‌ల కోసం సిఫార్సులు తీసుకున్న చాలామంది ఇన్‌స్పెక్టర్లను పక్కన పెట్టారు. వారికి వేర్వేరు స్థానాలు కేటాయించారు.

- తరువాయి 6లో

సోమేశ్వరుడి సొమ్ము స్వాహా



దేవుడి సొమ్మును దేవదాయ శాఖ అధికారులే దోచేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన కార్యనిర్వాహక అధికారులే ఈ దోపిడీలో కీలక పాత్రధారులవుతున్నారు. ఉయ్యూరులోని శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో చోటుచేసుకున్న స్వాహాపర్వమే ఇందుకు నిదర్శనం. సోమేశ్వరుడికి చెందిన సుమారు రూ.4 కోట్లను దేవదాయ శాఖ అధికారులు మింగేశారు.

ఉయ్యూరు సోమేశ్వర ఆలయంలో రూ.4 కోట్లు హాంఫట్

- ఆలయానికి 26 ఎకరాల పొలం.. హైవే నిర్మాణంలో పోయిన 6 ఎకరాలు
- నష్టపరిహారంగా రూ.8 కోట్లు.. ఎఫ్‌డీ చేసిన అధికారులు
- ఐదేళ్లుగా వడ్డీ రూపంలో వచ్చిన మొత్తం స్వాహా
- ఆలయానికి వచ్చే ఆదాయంలోనూ చేతివాటం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానానికి సుమారు 26 ఎకరాల పొలం ఉంది. ఈ భూమిలోని ఆరు ఎకరాలు విజయవాడ-మచిలీపట్నం హైవే నిర్మాణంలో పోయింది. నష్టపరిహారంగా దేవస్థానానికి రూ.8.36 కోట్లు అందాయి. 2018లో ఈ మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దానిపై అప్పట్లో ఏడాదికి రూ.55 లక్షల పైబడి వడ్డీ వచ్చేది. దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీలో 2/3వ వంతు మొత్తాన్ని మళ్లీ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలి. మిగిలిన 1/3వ వంతు మొత్తాన్ని దేవస్థానం ఖర్చుల నిమిత్తం వినియోగించుకునే వెసులుబాటు ఉంది. అంటే.. వడ్డీగా వచ్చిన మొత్తంలో రూ.36.60 లక్షలను ఏటా మళ్లీ డిపాజిట్ చేయాలి. ఇలా వచ్చిన వడ్డీ మొత్తాన్ని 2018 నుంచి 2019 వరకు దేవస్థానం సిబ్బందే బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో భద్రపరిచారు. దీంతో 2019 నాటికి సుమారు రూ.10 కోట్ల వరకు దేవస్థానానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో నిల్వ ఏర్పడింది. ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించిన ఈవో సురేశ్.. వడ్డీ మొత్తాన్ని పక్కదారి పట్టించేశారు. ఏడాదికి రూ.70 లక్షల పైచిలుకు వడ్డీ రూపంలో వస్తున్నా, అందులో రూ.57 లక్షలను ఎఫ్‌డీల రూపంలో మళ్లీ బ్యాంకులో వేయాల్సి ఉన్నా, ఐదేళ్లుగా ఆ విధానం అమలు కావట్లేదు. దీంతో దేవస్థానానికి చెందాల్సిన రూ.2.85 కోట్లు పక్కదారి పట్టాయి. మిగిలిన రూ.1.15 కోట్లను ఆలయ ఖర్చుల కోసం వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ఆ మొత్తాన్ని కూడా దొంగ లెక్కలతో దోచేశారు.

ఆలయ ఆదాయం కూడా..

ఉయ్యూరు పట్టణంలో సోమేశ్వరస్వామి ఆలయానికి 9 దుకాణాల సముదాయం ఉంది. వీటి నుంచి ఏడాదికి రూ.లక్షన్నర వరకు ఆదాయం వస్తుంది. ఆలయానికి మిగిలిన 20 ఎకరాల్లో 10 ఎకరాలకు సంబంధించిన లీజును అర్చకుల జీతభత్యాలకు వినియోగిస్తుండగా, మిగిలిన 10 ఎకరాల నుంచి ఏడాదికి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. వీటన్నింటినీ ఆలయ ఖర్చులకు లెక్కలు కట్టేశారు. వాస్తవానికి ఆలయంలో జరిగే ఏ చిన్న పనైనా దాతలు ముందుకొచ్చి చేయిస్తుంటారు. చివరికి ఏటా జరిగే ఉత్సవాలు సైతం దాతల ఖర్చులతోనే చేస్తుంటారు. ఈ పనులను సైతం ఆలయం సొమ్ముతో చేసినట్లు చూపి నిధులు స్వాహా చేయడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అండతో..

ఉయ్యూరు సోమేశ్వరస్వామి ఆలయ ఈవో సురేశ్ గతంలో కొండాలమ్మ ఆలయంలో ఈవోగా విధులు నిర్వహించారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆశీసులతో చాలాకాలం అక్కడే ఆయన విధులు నిర్వహించారు. ఆ సమయంలోనూ ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. హుండీల లెక్కింపు సమయంలో అటెండర్లు, అర్చకుల సాయంతో డబ్బు పక్కదారి పట్టించేవారన్న ఆరోపణలు ఉన్నాయి.
కొడాలి నాని ఆశీసులు ఉండటంతో అధికారులెవరూ ఈయనపై చర్యలు తీసుకునే సాహసం చేసేవారు కాదు. సోమేశ్వర ఆలయంలో జరిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. వాటిపై వడ్డీల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది

వంశీ ఎక్కడ?



గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేస్తారా? లేదా? అనే అంశంపై టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ 71వ నిందితుడిగా ఉండటంతో ఆయన్ను అరెస్టు చేశారని శుక్రవారం ప్రచారం జరిగింది. వంశీ ప్రధాన అనుచరులు యూసఫ్ పఠాన్, సర్నాల రమేశ్‌ను మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ గంగాధర్ స్పష్టం చేశారు. ఈ కేసులో విచారణ కొనసాగుతోందని, ఇప్పటి వరకు 19 మందిని అరెస్టు చేశామని యూసఫ్ పఠాన్‌ను శనివారం కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. తాజా పరిణామాలతో వంశీ ఎక్కడ ఉన్నాడన్న అంశం సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

అమెరికాకి వెళ్లిపోయాడా?

దేశంలోనే ఉన్నాడా?

- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో 71వ నిందితుడిగా వంశీ
- ఈ కేసులో అరెస్టు చేశారంటూ ప్రచారం.. అరెస్టును ఖండించిన ఎస్పీ
- వంశీ అనుచరులను అదుపులోకి తీసుకున్నట్టు ప్రకటన

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై 2023, ఫిబ్రవరి 20న అప్పటి ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. సుమారు 5 గంటలపాటు యథేచ్ఛగా విధ్వంసం సృష్టించారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు కేసులు పెట్టినా పోలీసులు విచారణను అటకెక్కించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ కేసు ఊపిరిపోసుకుంది. అప్పట్లో విధ్వంసం సృష్టించిన వారిలో 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురికి బెయిల్ కూడా వచ్చింది. ఈ కేసులో 71వ నిందితుడిగా వంశీ పేరు ఉంది. ఈ నేపథ్యంలో వంశీని అరెస్టు చేస్తారా లేదా అన్న అంశంపై టీడీపీ శ్రేణుల్లో విస్తృత చర్చ నడుస్తోంది. అసలు వంశీ దేశంలో ఉన్నారా లేక అమెరికా వెళ్లిపోయారా అన్న అంశంపై స్పష్టత కొరవడింది.

వంశీ అరెస్టుపై వదంతులు

వంశీ అరెస్టుపై అనేక వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే శుక్రవారం మధ్యాహ్నం వంశీ సతీమణి గన్నవరం వచ్చారు. వంశీ ఉపయోగించే వాహనశ్రేణిలోనే ఆమె తన బంధువుల ఇంటికి వెళ్లారు. వంశీ వచ్చారన్న సందేహంతో పోలీసులు ఆ వాహనాలను తనిఖీ చేశారు. దీంతో వంశీని అరెస్టు చేశారన్న వార్త ప్రచారంలోకి వచ్చింది. అయితే వంశీ అసలు ఎక్కడ ఉన్నారన్న దానిపై ఆయన అనుచరులే భిన్న కథనాలను ప్రచారం చేస్తున్నారు. వంశీ అమెరికా వెళ్లిపోయారని ఆయన సన్నిహితుల్లో కొందరు ప్రచారం చేస్తుండగా, వంశీ ఇటీవల అమెరికా నుంచి తిరిగి వచ్చారని ప్రస్తుతం రాజస్థాన్ లేదా బెంగళూరులో ఉంటున్నారని ఆయన అనుచరుల్లోనే మరో వర్గం చెబుతోంది. దీనిపై పోలీసుల్లోనూ స్పష్టత లేదు.

వైసీపీతో అంటకాగిన వారికే అందలం..!

వివాదాస్పదంగా తహసీల్దార్ల బదిలీలు

- విజయవాడ రూరల్, మైలవరం మండలాల కేటాయింపుపై ఆరోపణలు
- వైసీపీ అరాచకాలను ఎదురొడ్డిన వారికి స్థానచలనం
- ఏడాది సర్వీసును కూడా పట్టించుకోని పరిస్థితి
- జిల్లావ్యాప్తంగా 21 మంది తహసీల్దార్లకు పోస్టింగ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బదిలీపై సొంత జిల్లాకు వచ్చిన తహసీల్దార్లకు శుక్రవారం మండలాలు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అంటకాగిన తహసీల్దార్లకు ప్రధానమైన ఫోకల్ పోస్టులు ఇవ్వటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ రూరల్, మైలవరం మండలాలకు కేటాయించిన తహసీల్దార్లు గత ప్రభుత్వానికి అంటకాగి పనిచేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలను తూచా తప్పకుండా పాటించారన్న ఆరోపణలు ఉన్నాయి.

కొత్త తహసీల్దార్లకు కేటాయించిన మండలాలు	
షేక్ ఇంతియాజ్ పాషా	విజయవాడ వెస్ట్
బి.హేమకుమారి	విజయవాడ ఆర్డీవో ఆఫీసు
సీహెచ్ దుర్గాప్రసాద్	ఎన్టీఆర్ కలెక్టరేట్
ఎం.పాల్	చందర్లపాడు
ఎన్.సురేష్‌బాబు	నందిగామ
జి.బాలకృష్ణారెడ్డి	మైలవరం
సీహెచ్ వెంకటేశ్వర్లు	జి.కొండూరు
ఎస్.నరసింహారావు	వత్సవాయి
జె.సుశీలాదేవి	రెడ్డిగూడెం
బి.అసయ్య	ఏ.కొండూరు
ఎం.సూర్యారావు	విజయవాడ సెంట్రల్
కె.లక్ష్మీ కల్యాణి	విస్సన్నపేట
ఎస్.శ్రీనివాసరెడ్డి	ఎన్టీఆర్ కలెక్టరేట్ ఏవో
వి.రాజకుమారి	గంపలగూడెం
కె.లక్ష్మీ	తిరువూరు
ఎం.వెంకటరామయ్య	జగ్గయ్యపేట
ఆర్‌వీవీ రోహిణి	విజయవాడ ఈస్ట్
ఏ.శాంతిలక్ష్మి	పెనుగంచిప్రోలు
పి.జాహ్నవి	కంచికచర్ల
బి.సుగుణ	విజయవాడ రూరల్
సీహెచ్ శిరీషాదేవి	విజయవాడ నార్త్ (ఎఫ్‌ఏసీ)

- విజయవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా సుగుణను పంపించారు. ఇందుకోసం ఆమె సీసీఎల్ఏ, జిల్లా యంత్రాంగ స్థాయిలో బలమైన లాబీయింగ్ చేశారని సమాచారం. సుగుణకు పోస్టింగ్ కోసం ఒక జేఏసీ కూడా కృషి చేయటం గమనార్హం. ఆమె గత ప్రభుత్వ హయాంలో ఆర్అండ్ఆర్ విభాగంలో పనిచేశారు. కాగా, ఈమె కోసం ప్రస్తుతం విజయవాడ రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జాహ్నవిని మరోచోటకు బదిలీ చేశారు. జాహ్నవికి ఒక్క సంవత్సరం మాత్రమే సర్వీసు ఉండటంతో ఎన్నికల ముందు ఇతర జిల్లాకు బదిలీ చేయలేదు. అతి తక్కువ సర్వీసు దృష్ట్యా జాహ్నవిని కదిలించొద్దని ఇటీవల కొందరు రెవెన్యూ సంఘ నేతలు జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే, గతంలో విజయవాడ రూరల్ మండలంలో వైసీపీ నేతల అక్రమ క్వారీయింగ్‌ను జాహ్నవి అడ్డుకున్నారు. దీనికి బహుమానంగా ఆమెను అప్పటి వైసీపీ మైనింగ్ మాఫియా బదిలీ చేయించింది. సర్వీసు కొద్దినెలలే ఉన్నప్పటికీ జాహ్నవిని బదిలీ చేశారు. ఆ తర్వాత ఎన్నికల సమయంలో మళ్లీ విజయవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా నియమించారు. ఇప్పుడు ఆమెను పక్కకు తప్పించి సుగుణకు పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

- వైసీపీ ప్రభుత్వ హయాంలో గంపలగూడెంలో ఏకపక్షంగా పనిచేసిన జి.బాలకృష్ణారెడ్డిని మైలవరం మండల తహసీల్దార్‌గా నియమించారు. బాలకృష్ణారెడ్డి వివాదాస్పదుడు. గంపలగూడెం మండల పరిధిలో నకిలీ పొసెషన్ పట్టాలకు సంబంధించిన కేసు విచారణ విషయంలో నిర్లక్ష్యం వహించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నాడు. కట్టలేరు నదీ పరివాహక ప్రాంతంలో వైసీపీ నేతలు అక్రమంగా ఇసుకను తన్నుకుపోతున్నా, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు చెరువులను చెరపట్టిన వైసీపీ నేతలపై సానుభూతి చూపించారన్న విమర్శలు వచ్చాయి. వైసీపీకి అంటకాగి పనిచేసిన తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి మైలవరం మండలంలో పోస్టింగ్ కల్పించటం గమనార్హం.



పింగళి వెంకయ్య ముని మనుమరాలికి సన్మానం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగువారి కీర్తిపతాక, త్రివర్ణ పతాక రూపకర్త స్వర్గీయ పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన ముని మనుమరాలు మనిపల్లి చాయాదేవిని టీడీపీ నేతలు శుక్రవారం సన్మానించారు. గొల్లపూడిలోని ఆమె నివాసానికి వెళ్లిన మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఇతర టీడీపీ నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు. మహిళా నాయకురాలు నర్రా క్రాంతి, నర్రా వాసు, షేక్ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు. - గొల్లపూడి

వైభవంగా పంద్రాగస్టు వేడుకలు

- ఐజీఎం స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష 6లో

ఇసుక ఎక్కడెక్కడ..?

- చంద్రర్లపాడు మండలంలో కృష్ణానదిలో మూడు ప్రదేశాల గుర్తింపు
- 7.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్టు అంచనా
- పర్యావరణ అనుమతుల కోసం మైనింగ్ లేఖ



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కృష్ణానదిలో ఇసుక లభ్యత ఎక్కడ ఉందన్న దానిపై సర్వే పూర్తయింది. భూగర్భ గనుల శాఖ, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంయుక్తంగా చేసిన సర్వేలో చందర్లపాడు మండలంలో మూడు ప్రదేశాలను గుర్తించారు. ప్రభుత్వం ఇసుకకు సంబంధించి ఒక విధానాన్ని ప్రకటించడానికి ముందే ఉచిత ఇసుకను అమలు చేసింది. భవన నిర్మాణదారులు, డెవలపర్స్ భారీగా కొనుగోలు చేస్తుండటంతో స్టాక్ యార్డుల్లో ఉన్న ఇసుక తగ్గుముఖం పడుతోంది. జిల్లాలోని ఎనిమిది స్టాక్ పాయింట్లలో 3లక్షల69వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండేది. ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించాక ఈ పాయింట్లలో ప్రస్తుతం 88 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ఇసుక రాబోయే రోజుల్లో మరింత తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయి.

మూడు ప్రదేశాలు.. 7.6 లక్షల క్యూబిక్ మీటర్లు

భూగర్భ గనుల శాఖ, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జగ్గయ్యపేట నుంచి కృష్ణానదిలో సర్వే చేశారు. చందర్లపాడు మండలంలో ఉన్న కాసరబాద్, కాసరబాద్-4, పొక్కునూరు-5 ప్రాంతాల్లో 7.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత ఉన్నట్టు అంచనా వేశారు. ఇక్కడ యంత్రాలతో తవ్వకాలకు అవకాశం ఉండదని నిర్ధారించారు. అయితే, ఇలా చేయడం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని భావించారు. ఇక్కడ నీటి లభ్యతతో పాటు ఇసుక లభ్యత కూడా ఉంటుందని గుర్తించారు. నదిలో ఇసుకను కూలీలతో తవ్వించి బోట్ల ద్వారా ఒడ్డుకు తరలిస్తారు. అక్కడి నుంచి ఎక్స్‌కవేటర్లతో లారీల్లో పోస్తారు. ఇలా చేయడానికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి నిపుణుల బృందం వచ్చి ఈ మూడు ప్రాంతాలను పరిశీలిస్తుంది. అనుమతుల కోసం భూగర్భ గనుల శాఖ అధికారులు కేంద్ర పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి జగ్గయ్యపేట వరకు మొత్తం 15 రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ 15 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ రీచ్‌లకు పర్యావరణ శాఖ, సీఎఫ్‌వో (కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్స్), సీఎఫ్ఈ (కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతులు ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా గుర్తించిన ప్రదేశాల్లో ఇసుకను తవ్వడానికి ఈ అనుమతులు రావాల్సి ఉంది.

దుర్గమ్మకు రామయ్య సారె

వన్‌టౌన్, ఆగస్టు 2 : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున ఈవో ఎల్.రమాదేవి సారె సమర్పించారు. భద్రాద్రి దేవస్థానం ఈవో, అధికారులు రామయ్య సారెతో వెళ్లగా, వారికి దుర్గగుడి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భద్రాద్రి దేవస్థానం తరఫున ఈవో సారెను సమర్పించారు. అనంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.





ప్రకాశ్‌నగర్‌లో ఫ్రైడే డ్రైడే

భారతీనగర్, ఆగస్టు 2: నాల్గో డివిజన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వీఎంసీ అధికారుల సమక్షంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రధాన, అంతర్గత రోడ్లల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆరోగ్యశాఖ సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

శివాలయంలో ప్రత్యేక పూజలు

భారతీనగర్, ఆగస్టు 2: గురునానక్ కాలనీలోని శివాలయంలో శుక్రవారం మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చింది టీడీపీనే: గద్దె

గుణదల, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు పూర్తి మద్దతును ప్రకటించింది టీడీపీయేనని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. స్థానిక 5వ డివిజన్ పరిధిలోని ఆర్సీఎం చర్చివద్ద ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు బడుగువర్గాల నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్దె రామ్మోహన్ విచ్చేశారు. ముందుగా ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పోరాటాలు చేసిన యోధుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం గద్దె మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు పాటుపడిన అందరినీ స్మరించుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణ మాదిగ 35 ఏళ్ల పోరాటాన్ని కొనసాగించడం సామాన్యమైన విషయం కాదన్నారు. 1995లో వర్గీకరణ ఉద్యమం ప్రారంభమైనప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా తాను ఎమ్మెల్యేగా ఉన్నామని తెలిపారు. ఈ అంశంపై తుది తీర్పు వచ్చిన సమయంలో కూడా చంద్రబాబు అధికారంలో ఉన్నారని చెప్పారు. నందిపాటి దేవానంద్, సొంగా సంజయ్ వర్మ, మామిడి రాంబాబు, దోమకొండ రవికుమార్, దేవరపల్లి ఆంజనేయ, దోమకొండ రత్నాకర్, ఏసుపోగు మోజెస్, మాచర్ల ఆనంద్, బూరగడ్డ ప్రసాద్, సిద్దెల వివేక్, మల్లెల రామకృష్ణ, పుట్ల రమణ, లవంగి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రిటైనింగ్ వాల్ వెంబడి రోడ్డు నిర్మిస్తాం: ఎమ్మెల్యే గద్దె

లబ్బీపేట, ఆగస్టు 2: కృష్ణా కరకట్ట రిటైనింగ్ వాల్ వెంబడి రోడ్డు నిర్మించి స్థానికంగా ఉన్న డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ శివశంకర్ రోడ్డు రిటైనింగ్ వాల్ వెంబడి సైడ్ కాలువలు, డ్రెయినేజీ సమస్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం 18 మ్యాన్‌హోల్స్ సంప్‌లు ఎత్తు పెంచేందుకు రూ.19.52 లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు నిర్మాణం చేయకుండా ఇసుకతో పూడ్చి వేయడంతో డ్రెయినేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. దీని వలన స్థానికులు అవస్థలు పడుతున్నారని, ఈ అంశాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జనసేన అధ్యక్షులు గాదిరెడ్డి అమ్ములు, చిప్పాడ నాగేశ్వరరావు, ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా పంద్రాగస్టు వేడుకలు

» ఐజీఎం స్టేడియంలో ఏర్పాట్లపై

అధికారులతో కలెక్టర్ సమీక్ష

కృష్ణలంక, ఆగస్టు 2 : రాష్ట్రస్థాయి 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లపై కలెక్టర్ శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 78వ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు వేడుకలో పాల్గొంటారన్నారు. సుమారు ఆరు వేలమందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారని, వారికి అవసరమైన అల్పాహారం, తాగునీరు అందించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ అధికారులు జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేయడంతో పాటు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో, ఫైర్, ఏపీఎస్ ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, సివిల్ సప్లై తదితర అధికారుల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సాధారణ పరిపాలన శాఖ వీఐపీలకు వీవీఐపీలకు ప్రొటోకాల్ ప్రకారం కేటాయించిన గ్యాలరీల వారీగా పాస్‌లను మంజూరు చేయాలన్నారు. ఏర్పాట్లలో ఎటువంటి సమస్యలు ఎదురైనా తక్షణం తన దృష్టికి తీసుకురావాలన్నారు.

రిహార్సల్స్ నాటికి పూర్తిస్థాయి ఏర్పాట్లతో ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, ఆర్డీవో భవానీశంకర్, డీసీపీలు గౌతమిశాలి, ఏబీటీఎస్ ఉదయరాణి, కె.చక్రవర్తి, ఏసీపీ కె.దామోదరరావు, సమాచారశాఖ రీజనల్ ఇంజినీర్ సీవీ కృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యు.వెంకట సుబ్బారావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వీకే విజయశ్రీ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సృజన

5వ పేజీ తరువాయి

53 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఇన్‌స్పెక్టర్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్టేషన్
1. వై.రవికుమార్	వీఆర్	ట్రాఫిక్ 5
2. ఎం.కృపానందం	ట్రాఫిక్ 5	ఏలూరు రేంజ్
3. యు.రామారావు	పీసీఆర్	ట్రాఫిక్ 4
4. జి.దుర్గాప్రసాద్	ట్రాఫిక్ 4	ఏలూరు రేంజ్
5. వి.పవన్ కిషోర్	వీఆర్	పటమట
6. డీకేఎన్ మోహన్‌రెడ్డి	పటమట	ఏలూరు రేంజ్
7. చలుమూరి ప్రకాశ్	వీఆర్	మాచవరం
8. బి.గుణరాము	మాచవరం	వీఆర్
9. పి.కృష్ణమోహన్	వీఆర్	నున్న
10. ఎస్.దుర్గాప్రసాద్	నున్న	ట్రాఫిక్ 2
11. ఎల్.గౌరీనాయుడు	కమిషనరేట్ అటాచ్‌మెంట్	సోషల్‌మీడియా సెల్
12. సీహెచ్‌నాగశ్రీనివాస్	సోషల్‌మీడియా సెల్	సైబర్ క్రైం
13. కె.శివాజీ	సైబర్ క్రైం	అజిత్‌సింగ్ నగర్
14. జి.గురుప్రకాశ్	అజిత్‌సింగ్ నగర్	వన్‌టౌన్
15. డి.దుర్గాశేఖర్‌రెడ్డి	వన్‌టౌన్	ఏలూరు రేంజ్
16. ఎం.సత్యనారాయణ	ఇబ్రహీంపట్నం	గవర్నరుపేట
17. డీవీ రమణ	గవర్నరుపేట	ఏలూరు రేంజ్
18. కె.ఉమామహేశ్వరరావు	భవానీపురం అటాచ్‌మెంట్	భవానీపురం
19. టీవీ రవికుమార్	వీఆర్	టాస్క్‌ఫోర్స్
20. ఎస్ఎస్ఎస్‌వీ నాగరాజు	టాస్క్‌ఫోర్స్	వీఆర్
21. పి.సత్యానందం	వీఆర్	స్పెషల్‌బ్రాంచ్
22. రావి సురేష్‌రెడ్డి	స్పెషల్‌బ్రాంచ్	ఏలూరు రేంజ్
23. కేవీ కృష్ణకుమార్	వీఆర్	సీసీఆర్‌బీ
24. పి.సత్యశ్రీనివాస్	సీఎంఎస్	వీఆర్ అటాచ్డ్ సీఎంఎస్
25. ఎ.చంద్రశేఖర్	వీఆర్	టాస్క్‌ఫోర్స్
26. ఎస్.మురళీకృష్ణ	టాస్క్‌ఫోర్స్	సీసీఎస్
27. బి.బాలమురళీకృష్ణ	వీఆర్	ట్రాఫిక్ 5
28. నున్న రాజు	ట్రాఫిక్ 5	ఏలూరు రేంజ్
29. ఐడీ సువర్ణరాజు	వీఆర్	ట్రాఫిక్ 3
30. ఆర్.విజయ్‌కుమార్	ట్రాఫిక్ 3	ఏలూరు రేంజ్
31. ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ	పీసీఆర్	సీసీఎస్
32. ఎస్.పరమేశ్వర్	సీసీఎస్	ఏలూరు రేంజ్
33. వి.కోటేశ్వరరావు	ట్రాఫిక్ 4	స్పెషల్ బ్రాంచ్
34. డి.కాశీవిశ్వనాథ్	స్పెషల్‌బ్రాంచ్	ఏలూరు రేంజ్
35. కె.కిషోర్‌బాబు	మైలవరం	ట్రాఫిక్ 3
36. ఎస్కే అహ్మద్ అలీ	ట్రాఫిక్ 3	సీసీఎస్
37. ఎ.శ్రీనివాసరావు	సీసీఎస్	ఏలూరు రేంజ్
38. కె.వాసవి	వీఆర్	మహిళా పీఎస్
39. ఎండీ అహ్మదున్నీసా	మహిళా పీఎస్	వీఆర్
40. అబ్దుల్ సలాం	వీఆర్	సీసీఎస్
41. కె.సతీష్	వీఆర్	సీసీఎస్
42. పి.శ్రీనివాసరావు	వీఆర్	సీసీఎస్
43. బి.సత్యనారాయణ	వీఆర్	పీసీఆర్
44. వి.జానకిరామయ్య	వీఆర్	సైబర్ క్రైం
45. పీఎం రామకృష్ణ	వీఆర్	స్పెషల్‌బ్రాంచ్
46. తిప్పా గణేష్	కొత్తపేట	ఏలూరు రేంజ్
47. ఎస్కే అబ్దుల్‌నబీ	తిరువూరు	ఏలూరు రేంజ్
48. బి.వెంకటేశ్వరరావు	ట్రాఫిక్ 1	ఏలూరు రేంజ్
49. సహేరా ఉన్నీసా బేగం	కమిషనరేట్ అటాచ్‌మెంట్	ఏలూరు రేంజ్
50. వై.రాంబాబు	సీసీఎస్	ఏలూరు రేంజ్
51. జి.శంకర్‌నాయక్	సీసీఎస్	వీఆర్
52. టి.చంద్రశేఖర్	సీసీఎస్	వీఆర్
53. ఐవీ నాగేంద్రకుమార్	స్పెషల్‌బ్రాంచ్	వీఆర్

కోనేరు చారిటబుల్ ట్రస్ట్‌కు రూ. లక్ష విరాళం

పటమట: అశ్వినీ నర్సింగ్ హోం వ్యవస్థాపకుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ జ్ఞాపకార్థం ఆయన భార్య డాక్టర్ దుర్గారాణి, కుమారులు వినయ్ (కాలిఫోర్నియా), శ్రీకాంత్(ఇంగ్లాండ్)లు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ విద్యానిధికి రూ.లక్ష విరాళం అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు.


విజేత
Fresh Healthy Living
VIJETHA
CELEBRATING 25 YEARS OF VIJETHA
*CURRENCY NAGAR, VIJAYAWADA-520008. PH:7416660615
*ASHOK NAGAR, VIJAYAWADA - 520 007, PH:.73306 66684
*'Y' JUNCTION, GOLLAPUDI, VIJAYAWADA - 521 225 PH:.63017 52671
*6TH LINE BRINDAVAN GARDENS, GUNTUR - 522 007, PH.91007 87928
Rakhi's PRICE RANGE ₹20-99
DRUM STICK ₹9 Vijetha Price PER PC
DOSAKAYA ₹34 Vijetha Price PER KG
COCONUT ₹25 Vijetha Price PER PC
KADDU (BOTTLE GOURD) / KHEERA ₹39 Vijetha Price PER KG
BEET ROOT / CABBAGE ₹39 Vijetha Price PER KG
ONION RED ₹39 Vijetha Price PER KG
TOMATO LOCAL ₹39 Vijetha Price PER KG
BENDI ₹42 Vijetha Price PER KG
TURAI (RIDGE GOURD) ₹45 Vijetha Price PER KG
DONDA ₹48 Vijetha Price PER KG
POTATO ₹49 Vijetha Price PER KG
BANANA RAW ₹59 Vijetha Price PER KG
CAPSICUM ₹65 Vijetha Price PER KG
KIRAN MELON ₹19 Vijetha Price PER KG
ORANGE IMPORTED ₹35 Vijetha Price PER PC
KIWI FRUIT REGULAR ₹36 Vijetha Price PER PC
BANANA FRUIT ₹38 Vijetha Price PER KG
DRAGON FRUIT ₹39 Vijetha Price PER PC
KHARBUJA (MUSK MELON) ₹39 Vijetha Price PER KG
PAPAYA ₹52 Vijetha Price PER KG
JAMAKAYA (GUAVA) ₹139 Vijetha Price PER KG
POMEGRANATE ₹199 Vijetha Price PER KG
APPLE ROYAL GALA ₹279 Vijetha Price PER KG
VIJETHA WHOLE WHEAT ATTA 5KG BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 420
AASHIRVAAD NATURE SUPER FOOD ORGANIC ATTA 5KG ₹229 Vijetha Price MRP ₹ 380
HERITAGE GHEE COW 1000ML POUCH ₹599 Vijetha Price Get Container worth ₹160 FREE MRP ₹ 685
DAAWAT HERITAGE BASMATI RICE PLATINUM 1KG ₹99 Vijetha Price MRP ₹ 269
ORIGINAL KIMIA DATES / ELEPHANT DATES KIMJO 400G BOX BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 310/320
RAAGA SUNFLOWER OIL 1LTR POUCH ₹109 Vijetha Price MRP ₹ 145
TATA CHAKRA GOLD CARE 250 GM BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 240
SUNFEAST YIPPEE NOODLES MAGIC MASALA 420G ₹30 OFF ON MRP Vijetha Offer MRP ₹ 84
PARLE RUSK BREAD TOAST 1KG BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 200
SUNFEAST DARK FANTASY CHOCO FILLS 600G / YUMFILLS WHOOPIE PIE 253G- BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 350/170
JERSEY DOODH PEDA 190G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 180
AMBICA APPALAM NO-5 BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 107
NUTELLA FERRERO COCOA SPREAD 350G ₹40 OFF ON MRP Vijetha Offer MRP ₹ 399
THREE MANGO PICKLE 300G BOTTLE (ENTIRE RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 110
BINGO NO RULZ MASALA CURLZ 80G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 50
SAFFOLA MEALMAKER SOYA CHUNKS 400G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 150
HERITAGE MILK SHAKES 180ML TETRA (VANILLA/STRAWBERRY/CHOCOLATE) BADAM CHARGER WITH REAL BITS 180ML BOT BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 40
SLICE MANGO DRINK 1.75LT ₹59 Vijetha Price MRP ₹ 99
MINUTE MAID PET PULPY ORANGE 1LT ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 90
JERSEY FLAVOURED BADAM MILK 185ML PET BOTTLE BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 40
BNATURAL JUICE 1LT (SELECTED RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 140
HEINEKEN 0*0 NON ALCOHOL BEER 330ML CAN BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 80
DABUR RED TOOTHPASTE 300G ₹30 OFF ON MRP Vijetha Offer MRP ₹ 206
PARACHUTE ADVANCED GOLD COCONUT HAIR OIL 500ML BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 265
PEARS SOAP PURE & GENTLE 125G*4PC SET ₹75 OFF ON MRP Vijetha Offer MRP ₹ 372
DOVE BEAUTY BATHING BAR CREAM 4*125G+1FREE SET ₹85 OFF ON MRP Vijetha Offer MRP ₹ 463
BRUT DEODORANT / POLICE DEO SPRAY 200ML (ENTIRE RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 399/499
VIM SOAP ANTI SMELL WITH PUDINA 200G*5PC SET ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 130
SURF EXCEL MATIC LIQUID FRONT LOAD 2LTR POUCH ₹40 OFF ON MRP Vijetha Offer MRP ₹ 480
COMFORT FABRIC CONDITIONER 2LTR POUCH (MORNING / PINK FRESH) ₹65 OFF ON MRP Vijetha Offer MRP ₹ 480
OFFERS VALID ON 3rd & 4th AUGUST 2024 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS
Vijetha Supermarkets Pvt. Ltd.
TELANGANA • ANDHRA PRADESH
vijethasupermarkets VijethaSuperMarketsPvtLtd
*Note: All VISA Master Cards, sodexo Cards & Paytm Accepted
Customer Care: 040 - 2303 4165/4185 (10 AM - 5 PM) Email: customercare@vijetha.in
SINCE 1999 In Customer Service
SCAN FOR STORE LOCATION
*T&C Apply.

యూఓహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఆరేళ్ల మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, నాలుగేళ్ల బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి. సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 440 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ:** మేథమెటికల్ సైన్స్ 40, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 20, బయాలజీ 60, అప్లయిడ్ జియాలజీ 18, సైకాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- **ఇంటిగ్రేటెడ్ ఎంఏ:** తెలుగు 19, హిందీ 20, లాంగ్వేజ్ సైన్సెస్ 19, ఉర్దూ 14, ఎకనామిక్స్ 17, హిస్టరీ 35, పొలిటికల్ సైన్స్ 25, సోషియాలజీ 25, ఆంత్రోపాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీలో 28 సీట్లు ఉన్నాయి.
- బీఎస్ ఆనర్స్/రీసెర్చ్: కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటిగ్రేటెడ్ ఎంఏలో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు మాత్రం ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి. లేదంటే ఓరియంటల్ ఎగ్జామినేషన్(తెలుగు/హిందీ/ఉర్దూ) ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు స్పెషలైజేషన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు పదోతరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా తెలుగు చదివుండాలి. బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌నకు కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థులందరికీ ఇంటర్ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 22
- **ఫిజికల్ రిపోర్టింగ్, అడ్మిషన్ కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 30, 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/z94oKavలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimed-skills.in

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ, ఎంసీఏ

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)-స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఐసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో తొమ్మిది సీట్లు ఉన్నాయి. ఎంసీఏ ప్రోగ్రామ్‌ను కాకినాడలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూసీఈకే)లో, ఎంబీఏ ప్రోగ్రామ్‌ను జేఎన్‌టీయూకేకు చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్)లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం డిగ్రీ/ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. రెండు ప్రోగ్రామ్‌లకూ ఐసెట్ 2024 అర్హత తప్పనిసరి. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ప్రభుత్వ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్)... వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్-గీఐఐ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు దశల ఎంపిక విధానం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

896 ఖాళీలు

1. ఐటీ ఆఫీసర్(స్కేల్-1): 170 పోస్టులు
2. అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్-1): 346
3. రాజ్‌భాష అధికారి(స్కేల్-1): 25
4. లా ఆఫీసర్ స్కేల్-1): 125
5. హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1): 25
6. మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్-1): 205

అర్హతలు: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్). డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/డెయిరీ సైన్స్/ఫిషరీ సైన్స్/పిసికల్చర్/అగ్రి.మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/కో- ఆపరేషన్ అండ్ బ్యాంకింగ్/ఆగ్రో ఫారెస్ట్రీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/ఫుడ్ సైన్స్/అగ్రికల్చర్ టెక్నాలజీ బిజినెస్ మేనేజ్‌మెంట్/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/సెరికల్చర్/ఫిషరీస్ ఇంజనీరింగ్). పీజీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్). పీజీ(హిందీ/సంస్కృతం). డిగ్రీ(ఎల్ఎల్‌బీ), పీజీ డిప్లొమా(పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/హెచ్ఆర్/హెచ్ఆర్‌డీ/సోషల్ వర్క్/లేబర్ లా). ఎంఎంఎస్(మార్కెటింగ్)/ఎంబీఏ(మార్కెటింగ్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/పీజీపీఎం/పీజీడీఎం.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://www.ibps.in/

నవ్య | చిత్రజ్యోతి

చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సర్!



హీరోయిన్ కీర్తిసురేశ్ వివాదంలో చిక్కుకున్నారు. తను నటించిన 'రఘు తాత' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. దక్షిణాదిన బెస్ట్ డాన్సర్స్ గురించి ప్రస్తావన తెచ్చిన యాంకర్ 'మీ దృష్టిలో బెస్ట్ డాన్సర్ ఎవరు?' అని కీర్తిని అడిగారు. చిరంజీవి, తమిళ హీరో విజయ్ పేర్లు సూచించి, ఆ ఇద్దరిలో ఎవరి డాన్స్ అంటే మీకిష్టం అని అడిగారు. కీర్తిసురేశ్ విజయ్ పేరును ఎంచుకున్నారు. దీనిపై కీర్తిని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఏ విధంగా చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సరో చెప్పాలని ఆమెను ప్రశ్నిస్తున్నారు. నానీ కన్నా ధనుష్, ధనుష్ కన్నా అల్లు అర్జున్ బాగా డాన్స్ చేస్తారని ఆమె చెప్పారు. అలాగే అల్లు అర్జున్ కన్నా చిరంజీవి డాన్స్‌ను ఎక్కువ ఇష్టపడతాను అని కీర్తి తెలిపారు.



విభిన్నమైన లుక్‌లో విజయ్



'రౌడీ' అంటూ అభిమానులు ఆప్యాయంగా పిలుచుకునే హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 12వ చిత్రం శరవేగంతో తయారవుతోంది. 'మళ్లీ రావా','జెర్సీ' చిత్రాల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాలో విభిన్న గెటప్‌లో కనిపిస్తున్న విజయ్ దేవరకొండ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కోసం ఇటీవల శ్రీలంకలోని అందమైన ప్రదేశాల్లో జరిగిన షూటింగ్‌తో అరవై శాతం చిత్రం పూర్తయింది. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ నెల్లోనే ఆవిష్కరిస్తామనీ, వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.

దేవరతో స్టెప్పులేసిన జాన్వీ

జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న 'దేవర' చిత్రం కోసం ఇటీవల చిత్రీకరించిన మెలోడీ సాంగ్‌ను ఈ నెల 5న విడుదల చేయనున్నారు. జాన్వీతో ఎన్టీఆర్ రొమాంటిక్ మోడ్‌లో ఉన్న పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో జాన్వీ అందాలు కనువిందు చేస్తున్నాయి. 'పఠాన్', వార్, ఫైటర్ చిత్రాలలో వైరల్ స్టెప్స్‌కు పేరు పొందిన బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిన్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించడం విశేషం. ఎన్టీఆర్ అసాధారణమైన స్టెప్స్‌తో ఈ సాంగ్ అందరినీ అలరిస్తుందని దర్శకుడు కొరటాల శివ చెప్పారు. సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'దేవర పార్ట్ 1' ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ చెప్పారు. కల్యాణ్‌రామ్ చిత్ర సమర్పకుడు.

కొత్తగా..

వేణు ఊడుగుల నిర్మాణంలో... తరుణ్ భాస్కర్ హీరోగా



నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకుడు వేణు ఊడుగుల, బూసం జగన్‌మోహన్‌రెడ్డితో కలసి నిర్మిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం, అక్టోబర్ 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు.

నిర్మాణరంగంలోకి ముత్యాల సుబ్బయ్య



కుటుంబ ఇతివృత్తాలతో అద్భుత చిత్రాలను అందించి, అగ్ర హీరోలందరితోనూ పని చేసిన సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. తన సమర్పణలో తనయుడు ముత్యాల అనంతకిశోర్ నిర్మాతగా ఓ సినిమా నిర్మించనున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఓ వైవిధ్య భరితమైన కథాంశంతో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. ఈ నెల 9న అన్నపూర్ణ స్టూడియోలో చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుందని నిర్మాత ముత్యాల అనంతకిశోర్ చెప్పారు.

డేట్ మారింది



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కావాలి. అయితే కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడిందనీ, ఈ నెల తొమ్మిదిన రిలీజ్ చేస్తున్నామనీ నిర్మాతలు కమల్ బోరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా చెప్పారు. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సిరి సాయిసినిమాస్ సంస్థ విడుదల చేస్తోంది.

బ్రిట్నీ స్పియర్స్ బయోపిక్



హాలీవుడ్ నటి, పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ జీవిత గాథ త్వరలోనే వెండితెరపైకి రానుంది. నిర్మాణసంస్థ యూనివర్సల్ పిక్చర్స్ బ్రిట్నీ స్పియర్స్ సోషల్ మీడియా ద్వారా శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. 'నాకు ఇష్టమైన చిత్రాలను నిర్మించిన మార్క్ ప్లాట్‌తో ఒక సీక్రెట్ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నాను. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది' అని బ్రిట్నీ పేర్కొన్నారు. బ్రిట్నీ స్వీయ రచన 'ది ఉమెన్ ఇన్ మీ' ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. జోన్ ఎం. చూ దర్శకత్వంలో మార్క్ ప్లాట్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బ్రిట్నీ బాల్యం నుంచి స్టార్‌గా ఎదిగేవరకూ ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన తీరును ఆవిష్కరించనున్నారు.

ఇదేం షూటింగ్ కాదు

● హీరో విశాల్‌కు హైకోర్టు మందలింపు



హీరో విశాల్‌ను మద్రాస్ హైకోర్టు మందలించింది. అడిగిన దానికి సరిగ్గా సమాధానం ఇవ్వాలని, ఏదో ఒకటి చెప్పడానికి ఇదేమీ షూటింగ్ కాదంటూ కటువుగా వ్యాఖ్యానించింది. లైకా ప్రొడక్షన్స్ నుంచి హీరో విశాల్ తీసుకున్న రూ.21.29 కోట్ల రుణం కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో కొంతకాలంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ గురువారం న్యాయమూర్తి పీటీ ఆషా సమక్షంలో జరిగింది. ఈ విచారణకు విశాల్ నేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ తరపు న్యాయవాది కొన్ని పత్రాలు చూపించి, అవి విశాల్ సంతకం చేసినవేనని పేర్కొన్నారు. ఇందుకు విశాల్ సమాధానమిస్తూ.. ఆ ఒప్పందం గురించి తనకేమీ తెలియదని, తన వద్ద కేవలం తెల్లకాగితంపై సంతకం తీసుకున్నారని చెప్పారు. దీంతో ఆగ్రహించిన న్యాయమూర్తి... 'మీరు చేసిన సంతకాన్ని ఎలా కాదని చెబుతారు? చాలా తెలివిగా సమాధానం చెబుతున్నట్టు అనుకోవద్దు. ఇది షూటింగ్ కాదు. జాగ్రత్తగా సమాధానాలు చెప్పండి' అని మందలించారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

పారిస్ ఒలింపిక్స్
(జూలై 26 - ఆగస్టు 11)

సేన్ సంచలనం

సెమీస్‌లో లక్ష్య



స్టార్ షట్లర్ లక్ష్యసేన్ పారిస్‌లో రికార్డుస్థాయి ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. సహచరులంతా విఫలమైన చోట.. 22 ఏళ్ల సేన్ మాత్రం సెమీఫైనల్లో ప్రవేశించి బ్యాడ్మింటన్‌లో భారత పతక ఆశలను నిలబెట్టాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అన్‌సీడెడ్ లక్ష్యసేన్ 19-21, 21-15, 21-12 తేడాతో చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 11వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్‌పై సంచలన విజయం సాధించాడు. 75 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌లో హోరాహోరీ పోటీ ఇచ్చినా ఫలితం అనుకూలంగా రాలేదు. అయితే మిగిలిన రెండు గేమ్‌ల్లో మాత్రం చెన్‌కు చెమటలు పట్టించాడు. కీలక సమయాల్లో ఒత్తిడికి లోనుకాకుండా సేన్ ప్రత్యర్థిని కట్టడి చేయగలిగాడు. ఈ విజయంతో ఒలింపిక్స్‌లో సెమీఫైనల్ చేరిన తొలి భారత పురుష సింగిల్స్ షట్లర్‌గా సేన్ రికార్డుకెక్కాడు. ఇప్పటిదాకా భారత్ నుంచి పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, కిడాంబి శ్రీకాంత్ ఒలింపిక్స్‌లో క్వార్టర్స్‌దాకా చేరగలిగారు. ఇక, మహిళల సింగిల్స్‌లో మాత్రం సైనా నెహ్వాల్, పీవీ సింధు ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన సంగతి తెలిసిందే.

ఫైనల్లో అల్కారజ్

ఒలింపిక్స్ టెన్నిస్‌లో ఫైనల్ చేరిన అతి పిన్న వయస్కుడిగా 21 ఏళ్ల స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కారజ్ చరిత్ర సృష్టించాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిళ్లు నెగ్గి ఊపుమీదున్న అల్కారజ్ విశ్వక్రీడల్లో పసిడి అందుకునేందుకు అడుగుదూరంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన ఏకపక్ష సింగిల్స్ సెమీస్ పోరులో 6-1, 6-1తో ఫెలిక్స్ అగర్ అలియాస్సిమ్ (కెనడా)ను చిత్తుగా ఓడించి, స్వర్ణానికి అడుగు దూరంలో నిలిచాడు. ఆదివారం జరిగే ఫైనల్లో టాప్ సీడ్.. సెర్బియా దిగ్గజం జొకోవిచ్ లేదా ఇటలీ ప్లేయర్ లొరెంజో ముసెట్టితో అమీతుమీ తేల్చుకోనున్నాడు.



స్వియాటెక్‌కు కాంస్యం

మహిళల సింగిల్స్ కాంస్య పతక పోరులో పోలెండ్ భామ ఇగా స్వియటెక్ విజేతగా నిలిచింది. పోలెండ్ ఒలింపిక్స్ టెన్నిస్ చరిత్రలో ఇదే తొలి పతకం కావడం విశేషం. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో స్వియటెక్ 6-2, 6-1తో అన్నా కరోలినా ష్మిడ్లోవా (స్లొవేకియా)పై నెగ్గి పతకం సొంతం చేసుకుంది. ఇక, శనివారం జరగనున్న మహిళల సింగిల్స్ ఫైనల్లో జెంగ్ క్విన్‌వెన్ (చైనా)తో డొనా వెకిక్ (క్రొయేషియా) తలపడనుంది.

క్యూ కడుతున్న ఆఫర్లు

ఒలింపిక్స్‌లో పతకం కొడితే క్రీడాకారులకు పేరు ప్రతిష్ఠలతో పాటు డబ్బు కూడా భారీస్థాయిలో వచ్చిపడుతుంది. ప్రైజ్‌మనీ రూపంలో కాదు గానీ.. పతక వీరులకు కోట్లు కుమ్మరించేందుకు వాణిజ్య సంస్థలు సిద్ధంగా ఉంటాయి. ఇప్పుడు షూటర్ మను భాకర్ పరిస్థితి కూడా ఇదే. ఏకంగా రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన ఈ 22 ఏళ్ల షూటర్ కోసం పలు స్పాన్సరర్లు క్యూ కడుతున్నారు. తమ సంస్థకు ప్రచారకర్తగా ఉండాలంటూ ఇప్పటికే దాదాపు 40కిపైగా బ్రాండ్‌లు భాకర్‌ను సంప్రదించాయి. ఈ విషయాన్ని మను భాకర్ ఎండార్స్‌మెంట్లను పర్యవేక్షించే ఐఓఎస్ స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సీఈవో, ఎండీ నీరవ్ తోమర్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఒక్కో ఎండార్స్‌మెంట్‌కు రూ. 20 నుంచి 25 లక్షలు వసూలు చేసిన భాకర్‌కు ఇప్పుడు అంతకు ఆరురెట్లు అదనంగా అంటే దాదాపు ఒకటిన్నర కోటి నుంచి రూ. 2 కోట్లు ఇచ్చేందుకు సంస్థలు పోటీపడుతున్నాయని తోమర్ తెలిపారు.



రోయింగ్ బ్రదర్స్ స్వర్ణ చరిత్ర

క్రొయేషియా రోయింగ్ క్రీడాకారులు.. అన్నదమ్ములైన మార్టిన్ సింకోవిక్-వాలెంట్ సింకోవిక్ ఒలింపిక్ క్రీడల్లో వరుసగా మూడో స్వర్ణం సాధించారు. లండన్‌లో కాంస్య పతకం నెగ్గిన ఈ సోదరులు, ఆ తర్వాత జరిగిన రియో, టోక్యో, ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకాలు సాధించి చరిత్ర లిఖించారు. రోయింగ్ పెయిర్ ఈవెంట్‌లో చివరి 200 మీటర్ల వరకు బ్రిటన్ ద్వయం ఆలివర్ వైన్ గ్రిఫిత్-థామస్ జార్జ్ నుంచి సింకోవిక్ బ్రదర్స్‌కు గట్టి పోటీ ఎదురైంది. ఆఖరి రెండు నిమిషాల్లో తమ పూర్తి శక్తి సామర్థ్యాలను కూడదీసుకొని పోరాడిన సింకోవిక్ జోడీ స్వర్ణం ఎగరేసుకుపోగా, గ్రిఫిత్-థామస్ ద్వయం రజతంతో సరిపెట్టుకుంది.



కుప్పకూలిన స్విమ్మర్

ఒలింపిక్స్‌లో శుక్రవారం జరిగిన పోటీల్లో ఓ స్విమ్మర్ పూల్ దగ్గరే కుప్పకూలడం సంచలనం కలిగించింది. స్లోవేకియా స్విమ్మర్, 21 ఏళ్ల తమార పాటొకా 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్ హీట్స్‌లో బరిలోకి దిగింది. అయితే, లక్ష్యాన్ని చేరుకొని పూల్ నుంచి బయటకు వచ్చిన తమార ఆస్తమా కారణంగా ఉన్నట్టుండి అక్కడే కుప్పకూలిపోయింది. అప్రమత్తమైన వైద్య సిబ్బంది వెంటనే ఆమెకు ప్రాథమిక చికిత్స చేసి స్ట్రెచర్‌పై తీసుకెళ్లారు. అయితే ప్రస్తుతం ఆ స్విమ్మర్ పరిస్థితి నిలకడగానే ఉందని నిర్వాహకులు వెల్లడించారు. తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ తమార..హీట్స్‌లో 14.20 సెకన్ల టైమింగ్‌తో ఏడోస్థానానికి పరిమితమైంది.

అదే గెలుపు.. అదే రగడ



లింగ వివాదంతో విమర్శలు ఎదుర్కొంటున్న తైవాన్ బాక్సర్ లిన్ యు టింగ్ మహిళల 57 కిలోల విభాగంలో క్వార్టర్స్ చేరింది. శుక్రవారం ముగిసిన ప్రీక్వార్టర్స్ బౌట్‌లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ సిటోరా తుర్దిబెకోవాపై లిన్ 5-0తో గెలిచింది. బౌట్ అనంతరం సిటోరా మీడియాతో మాట్లాడకుండా ఏడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఆదివారం జరగనున్న క్వార్టర్స్‌లో నెగ్గితే 28 ఏళ్ల లిన్‌కు పతకం ఖాయమవుతుంది. ఇక, లింగ వివాదం ఎదుర్కొంటున్న అల్జీరియా బాక్సర్ ఇమేని ఖెలీఫ్ (66 కిలోల విభాగం) కూడా క్వార్టర్స్ చేరడం తెలిసిందే. ఇమేని, లిన్‌లో పురుష హార్మోన్లు ఎక్కువ ఉన్నట్టు గతేడాది ఢిల్లీలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ లింగ నిర్ధారణ పరీక్షలో తేలింది. దీంతో వీరిపై నిషేధం విధించారు. అయితే, వీరు పెట్టుకున్న అర్జీని పరిశీలించి ఐఓసీ ఒలింపిక్స్‌లో ఆడేందుకు అనుమతి ఇచ్చింది.

ఒక్కరోజులోనే ఎంత తేడా.. పతక రేసులో ఉన్న పలువురు అథ్లెట్లు గురువారం తీవ్రంగా నిరాశపర్చగా, 24 గంటలు గడవక ముందే ఇతర విభాగాల్లో భారత్ మెరుగైన ప్రదర్శన కొనసాగించింది. రెండు కాంస్యాలతో జోరు మీదున్న యువ షూటర్ మను భాకర్ తాజాగా 25మీ. పిస్టల్ ఈవెంట్‌లోనూ శనివారం పతకం కోసం బరిలోకి దిగనుంది. అంతేకాదు.. ఒకే ఒలింపిక్స్‌లో మూడు ఈవెంట్లలోనూ ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించింది. అటు ఈ మెగా ఈవెంట్‌లో 52 ఏళ్ల తర్వాత భారత హాకీ జట్టు ఆసీస్‌పై గెలవగా, లక్ష్యసేన్ బ్యాడ్మింటన్‌లో సెమీస్‌కు చేరి సంచలనం సృష్టించాడు. మిక్స్‌డ్ డబుల్స్ ఆర్చరీలో మన జోడీ మెడల్ కోల్పోయినా.. సెమీస్‌కు చేరి రికార్డు నెలకొల్పింది.

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
చైనా	13	8	8	29
ఆస్ట్రేలియా	10	6	5	21
అమెరికా	9	18	15	42
ఫ్రాన్స్	9	11	12	32
బ్రిటన్	9	9	8	26
జపాన్	8	3	6	17
కొరియా	7	5	4	16
ఇటలీ	5	8	4	17
నెదర్లాండ్స్	4	2	2	8
కెనడా	3	2	6	11
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

అదిగదిగో.. హ్యాట్రిక్



మూడో పతక రేసులో మను భాకర్
25మీ. పిస్టల్‌లో ఫైనల్‌కు.. నేడే తుదిపోరు

ఇషా సింగ్ అవుట్
ఆసీస్‌పై భారత హాకీ జట్టు విజయం



ఇషా సింగ్

పారిస్: యువ షూటర్ మను భాకర్ హ్యాట్రిక్ మెడల్‌పై గురిపెట్టింది. శుక్రవారం తాను పాల్గొన్న మూడో ఈవెంట్ అయిన 25మీ. పిస్టల్ క్వాలిఫికేషన్‌లో 590 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటికే ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు ఖాతాలో వేసుకున్న తొలి భారత అథ్లెట్‌గా చరిత్రకెక్కిన ఈ 22 ఏళ్ల యువ షూటర్ ఆ ఘనతను మరింత ఎత్తుకు తీసుకెళ్లాలనుకుంటోంది. శనివారం జరిగే ఫైనల్లో తను ఇదే ప్రదర్శన కనబరిస్తే స్వర్ణమో, రజతమో ఖాయం కానుంది. అదే జరిగితే హ్యాట్రిక్ మెడల్స్‌తో భారత ఒలింపిక్ చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పినట్టవుతుంది. 592 పాయింట్లతో హంగేరీ షూటర్ వెరోనికా మేజర్ తొలి స్థానంలో నిలిచింది. ఇది ఒలింపిక్ రికార్డు. మొదట ప్రిసిషన్ రౌండ్‌లో మను 97, 98, 99 స్కోరుతో 294 పాయింట్లు సాధించి టాప్-3లో నిలిచింది. ఆ తర్వాత ర్యాపిడ్‌లో తొలి సిరీస్‌లో ఏకంగా 100 స్కోరు చేయగా.. అనంతరం 98, 98తో 296 పాయింట్లు దక్కించుకుని ద్వితీయ స్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ షూటర్ ఇషా సింగ్ పేలవ ఆటతీరుతో 581 పాయింట్లతో 18వ స్థానంతో ఇంటిముఖం పట్టింది.

షాట్‌గన్‌లో నిరాశ: భారత షాట్‌గన్ షూటర్ల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. పురుషుల స్కీట్ తొలి రోజు క్వాలిఫికేషన్‌లో అనంత్ జీత్ సింగ్ నరుక 68 పాయింట్లతో 26వ స్థానంలో నిలిచాడు. ఆరుగురు షూటర్లు ఫైనల్‌కు చేరేందుకు నేడు మరో రెండు క్వాలిఫికేషన్ రౌండ్లు ఆడాల్సి ఉంది.

23వ స్థానంలో పన్వర్

పురుషుల సింగిల్ స్కల్స్‌లో భారత రోవర్ బల్‌రాజ్ పన్వర్ తన ప్రస్థానాన్ని 23వ స్థానంతో ముగించాడు. ఇంతకుముందే పతక రౌండ్ నుంచి అవుటైన తను ఫైనల్ 'డి'కి చేరాడు. 19-24 వర్గీకరణ మ్యాచ్ అయిన ఈ పోటీలో తను 7:02.37 టైమింగ్‌తో ఐదో స్థానంలో నిలవగలిగాడు.

వెనుకంజలో శుభాంకర్

పురుషుల వ్యక్తిగత విభాగంలో గోల్ఫర్ శుభాంకర్ శర్మ రెండో రౌండ్‌లో 25వ స్థానంలో కొనసాగుతున్నాడు. శని, ఆదివారాల్లో మరో రెండు రౌండ్లు జరగాల్సి ఉన్నాయి.



తులికా మన్ తొలి రౌండ్‌లోనే..

భారత్ నుంచి గేమ్స్‌లో పాల్గొంటున్న ఏకైక జుడోక తులికా మన్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. మహిళల +78కేజీ విభాగంలో క్యూబాకు చెందిన ఇడాలిస్ ఆర్టిజ్ చేతిలో తను 0-10 తేడాతో చిత్తుగా ఓడింది. కేవలం 28 సెకన్లలోనే ఈ మ్యాచ్ ముగియడం గమనార్హం.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



హర్మన్‌ప్రీత్

కెప్టెన్ హర్మన్‌ప్రీత్ అద్భుత ప్రదర్శనతో భారత హాకీ జట్టు తమ చివరి పూల్ 'బి' మ్యాచ్‌లో అదరగొట్టింది. 1972 ఒలింపిక్స్ తర్వాత.. అంటే 52 ఏళ్ల అనంతరం తొలిసారిగా ఆస్ట్రేలియాపై 3-2తో గెలిచింది. టోక్యో గేమ్స్‌లో రజతం సాధించిన ఆసీస్‌పై ఆరంభం నుంచే అటాకింగ్ గేమ్‌తో భారత్ ఆధిక్యం చూపించింది. అభిషేక్ (12వ నిమిషంలో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (13వ, 33వ) భారత్‌కు గోల్స్ అందించారు. బెల్జియం టేబుల్ టాపర్‌గా ఉండగా, 9 పాయింట్లతో ఉన్న భారత్ రెండో స్థానంతో గ్రూప్ దశను ముగించే చాన్స్ ఉంది. ఈ పూల్ నుంచి ఇప్పటికే భారత్, బెల్జియం, ఆస్ట్రేలియా క్వార్టర్స్‌కు చేరుకున్నాయి. క్వార్టర్స్‌లో భారత్‌కు జర్మనీ లేదా బ్రిటన్ ఎదురయ్యే అవకాశం ఉంది.

అథ్లెటిక్స్‌లో తొలిరోజు అంతంతే..

5వేల మీటర్ల రేసులో ఫైనల్ చేరని పారుల్, అంకిత



ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో మొదటిరోజు భారత్‌కు నిరాశే ఎదురైంది. మహిళల 5వేల మీటర్ల రేసులో బరిలోకి దిగిన పారుల్ చౌదరి, అంకిత ధ్యాని ఫైనల్ రౌండ్‌కు చేరడంలో విఫలమయ్యారు. శుక్రవారం జరిగిన తన హీట్-2లో పారుల్ 15 నిమిషాల 10.68 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని 14వ స్థానానికి పరిమితమైంది. ఓవరాల్‌గా 24వ స్థానంలో నిలిచింది. పారుల్ గతంలో నెలకొల్పిన జాతీయ రికార్డు 15 నిమిషాల 10.35 సెకన్ల టైమింగ్‌ను కూడా అందుకోలేక పోవడం గమనార్హం. ఇక, హీట్-1లో పోటీపడ్డ అంకిత 16 నిమిషాల 19.38 సెకన్ల టైమింగ్‌తో ఆఖరిదైన 20వ స్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా 40వ స్థానంతో సరిపెట్టుకుంది.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: మహిళల స్కీట్ క్వాలిఫికేషన్ (తొలి రోజు): రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (మ. 12.30); మహిళల 25 మీటర్ల పిస్టల్ మెడల్ రౌండ్ : మను భాకర్ (మ. 1 గం.)

ఆర్చరీ: మహిళల వ్యక్తిగత విభాగం (1/8 ఎలిమినేషన్స్): దీపికా కుమారి X మిచెల్లె క్రొపెన్ (జర్మనీ) (మ. 1.50 గం.), భజన్ కౌర్ - దయానంద చౌరునీసా (ఇండోనేసియా) (మ. 2.05)

సెయిలింగ్: పురుషుల డింగీ రేసు 5, 6 : విష్ణు శరవణన్ (మ. 3.45); మహిళల డింగీ రేసు 5, 6 - నేత్ర కుమనన్ (సా. 5.55)

బాక్సింగ్: పురుషుల వెల్టర్ వెయిట్ క్వార్టర్‌ఫైనల్స్ : నిషాంత్ దేవ్ Xమార్కో వెర్డె (మెక్సికో) (రా. 12.18).



ఊరించి.. ఉసూరుమనిపించి

ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో తొలిసారి సెమీస్‌కు చేరిన భారత జోడీగా ధీరజ్-అంకిత భకత్ రికార్డు నెలకొల్పింది. అంతేకాకుండా పతకంపైనా ఆశలు రేపినా సఫలం కాలేకపోయారు. శుక్రవారం మొదట క్వార్టర్స్‌లో భారత జోడీ 5-3 తేడాతో కనాలెస్-గొంజాలెజ్ (స్పెయిన్)ను ఓడించి సెమీస్‌లో అడుగుపెట్టింది. సెమీస్‌లో కొరియాను ఎదుర్కొన్న భారత ఆర్చర్లు ప్రభావం చూపలేక 2-6తో ఓటమిపాలై కాంస్య పతక పోరుకు సిద్ధమయ్యారు. ఇందులో యూఎస్ఏకు చెందిన బ్రాడీ ఎలిసన్-క్యాసీ కాఫ్‌హోల్డ్ పూర్తి ఆధిపత్యం చూపారు. తొలి రెండు సెట్లను అంకిత 7తో ఆరంభించడం దెబ్బతీసింది. తెలుగు కుర్రాడు ధీరజ్ మాత్రం 10 పాయింట్లు సాధిస్తూ ఆధిక్యంలో ఉంచేందుకు ప్రయత్నించాడు. అటు బ్రాడీ స్టన్నింగ్ షాట్లతో రెండో సెట్‌ను 4-0తో ముగించాడు. అయితే కీలక మూడో సెట్‌లో అంకిత 10తో ఆరంభించగా నాలుగు బాణాలు కూడా యెల్లో జోన్‌లోనే దిగాయి. దీంతో భారత్ 2-4తో పోటీలో నిలిచింది. కానీ నాలుగో సెట్‌ను అంకిత 8తో ఆరంభించగా, అటు యూఎస్ 10తో ముందుకెళ్లడంతో భారత్ కోలుకోలేక పోయింది. చివరకు 2-6తో ఓడి ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది.

రెండు బంతుల్లో మారిన ఫలితం



రోహిత్ (58)

భారత్-శ్రీలంక తొలి వన్డే టై

కొలంబో: మూడు టీ20ల సిరీస్‌లో క్లీన్‌స్వీప్ అయిన శ్రీలంక..భారత్‌తో తొలి వన్డేలో పుంజుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగిన మొదటి వన్డేను ఆతిథ్య జట్టు టై చేసింది. మొదట శ్రీలంక 50 ఓవర్లలో 230/8 స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వెల్లలగే (67 నాటౌట్), నిస్సాంక (56) హాఫ్ సెంచరీలు సాధించారు. అక్షర్, అర్ష్‌దీప్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో భారత్ 47.5 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. రోహిత్ (58) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, అక్షర్ (33), కేఎల్ రాహుల్ (31), శివమ్ దూబే (25) రాణించారు. అసలంక, హసరంగ మూడేసి, వెల్లలగే రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.



వెల్లలగే (56)

ఆఖర్లో తారుమారు..: వాస్తవంగా..మ్యాచ్‌లో భారత్ విజయం అంచులదాకా వచ్చింది. 47 ఓవర్లు ముగిసే సరికి మనోళ్ల స్కోరు 226/8. నెగ్గేందుకు మరో ఐదు పరుగులు చేస్తే చాలు. అప్పటికి శివమ్ దూబే క్రీజులో ఉన్నాడు. అతడికి జతగా అర్ష్‌దీప్ వచ్చాడు. విజయంపై భారత్ ధీమాగానే ఉన్నా..స్పిన్నర్ అసలంక రెండు బంతుల్లో ఫలితాన్ని మార్చేశాడు. అసలంక వేసిన 48వ ఓవర్ మూడో బంతికి దూబే ఫోర్ కొట్టాడు. ఒక పరుగు చేస్తే భారత్‌దే విజయం. అయితే నాలుగో బంతికి దూబేను ఎల్బీడబ్ల్యూగా అసలంక బలిగొన్నాడు. ఇక ఒక పరుగే కదా..అర్ష్‌దీప్ లాగించేస్తాడనే ధీమా. అయితే అతడినీ అసలంక ఎల్బీ చేయడంతో మ్యాచ్ టై అయ్యింది. అంతకుముందు రోహిత్, గిల్ తొలి వికెట్‌కు 75 రన్స్‌తో మెరుపు ఆరంభం ఇచ్చారు. ఈదశలో లంక స్పిన్నర్లు విజృంభించడంతో భారత్ వడివడిగా వికెట్లు కోల్పోయింది. కానీ కేఎల్ రాహుల్, అక్షర్ ఓపిగ్గా ఆడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. వీరిద్దరు త్వరత్వరగా నిష్క్రమించగా మ్యాచ్‌పై శ్రీలంక పట్టు బిగించింది. కాగా..టీమిండియా మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ మృతికి సంతాపంగా భారత ఆటగాళ్లు నల్ల ఆర్మ్ బ్యాండ్లు ధరించి బరిలో దిగారు.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 50 ఓవర్లలో 230/8 (వెల్లలగే 67 నాటౌట్, నిస్సాంక 56, హసరంగ 24, అక్షర్ 2/33, అర్ష్‌దీప్ 2/47)

భారత్: 47.5 ఓవర్లలో 230 ఆలౌట్ (రోహిత్ 58, అక్షర్ 33, రాహుల్ 31, అసలంక 3/30, హసరంగ 3/58, వెల్లలగే 2/39).

కరీబియన్ లీగ్‌లో ప్రణవి చంద్ర



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెటర్ ప్రణవి చంద్రకు ప్రఖ్యాత మహిళల కరీబియన్ టీ20 లీగ్‌లో ఆడే అవకాశం లభించింది. భారత్ నుంచి ప్రణవితో పాటు, జెమీమా రోడ్రిగ్స్, శిఖా పాండే ఈ లీగ్‌లో ఆడనున్నారు. ఈనెల 18 నుంచి 29 వరకు ట్రినిడాడ్ అండ్ టొబాగో ఈ లీగ్ జరగనుంది. ఇక, ఈ లీగ్‌లో ఆడుతున్న తొలి తెలుగు మహిళా క్రికెటర్ ప్రణవి చంద్రనే కావడం విశేషం.

కరంభకం అనే పెరుగు జావ

సుశీతం క్రియతే భక్తం దధ్యాఢ్యం దుగ్ధకావధి!
నాతిద్రవం నాతి సాంద్రం మిశ్రితం తత్కరంభకమ్!

ఋగ్వేదంలో దానా, కరంభ, అపూపాలనే వంటకాల గురించి ఉంది. యవధాన్యాన్ని (బార్లీ) నేతితో వేగించి, పలుచని జావ కాస్తే 'యవాగూ' అని, అన్నంలాగా వండితే దాన్ని 'దానా' అనీ, విసిరిన పిండి(సక్తు)ని వెన్నతో తడిపి రొట్టె కాలిస్తే 'అపూప' అనీ, ఆ పిండిని ఉడికించి పెరుగు కలిపితే దాన్ని 'కరంభకం' అనీ అన్నారు. శుభకార్యాలకూ, అశుభకార్యాలకు కూడా కరంభకాన్ని తప్పనిసరిగా వండుతారు. ఏదైనా ధాన్యాన్ని నేతితో వేగించి విసిరిన పిండిని 'సక్తు' (సత్తు-పేలాల పిండి) అంటారు. దీన్నే తెలుగులో 'సొజ్జ చేయటం' అంటారు. సొజ్జప్పాలు అంటే నేతితో వేగించిన ధాన్యపు పిండితో చేసిన రొట్టెలు. కానీ, వాటిని మైదాపిండి, బొంబాయిరవ్వలతో వండటం చేత సొజ్జ (ధాన్యాన్ని వేగించటం) అనేది అప్రధానం అయ్యింది. ఋగ్వేద కాలంలో యవ పిండి (బార్లీ), గోధుమపిండితో ఎక్కువగా కరంభకాన్ని వండేవాళ్లు. 'అన్నసూక్తం'లో 'కరంభ ఓషధీ భవ' అని దీన్ని ఔషధ గుణాలు కలిగినదిగా పేర్కొన్నారు.

క్షేమశర్మ 'భక్ష్యా' అనటంవల్ల దీన్ని పానీయంలా కాకుండా, పాయసంలా తినే విధంగా తయారు చేసుకోవాలని సూచించినట్టు అర్థం చేసుకోవాలి. బియ్యం, రాగులు లేదా సజ్జల పిండిని ఉడికించి అందులో పెరుగు, కొద్దిగా వెన్న కలిపి, జీడిపప్పులూ వగైరా చేర్చి కర్డ్ రైస్ లేదా దధ్యోజనం పద్ధతిలో తయారు చేస్తున్నారు. యవ (బార్లీ) జావలో సగ్గుబియ్యం ఉడికించి కలుపుకోవచ్చు కూడా. జీడిపప్పులు, యాలకులు వగైరా కలిపితే పాయసం కన్నా కమ్మగా ఉంటుంది. పాలు కలిపి చేసినదాన్ని పాయసం అంటున్నాం. పెరుగు కలిపి తయారు చేసిన జావలాంటిది కాబట్టి దీన్ని పెరుగుజావ అందాం. కొత్తిమీర, క్యారెట్టు, లాంటివాటితో అలంకరించు కుని చెంచాతో తీసుకుని తినవచ్చు.

విసిరిన పిండిని ఉడికించి పెరుగు కలిపినది 'కరంభకం'. కరంబనం, కరంబితం అనే పదాలు దీన్నిబట్టే సంస్కృతంలో ఏర్పడ్డాయి. పాలకోవాను 'కరంభ' అనటం కూడా ఉంది. కుండను సంస్కృతంలో కరంభ అంటారు. భారతంలో కరంభ అనే వ్యక్తి నామాలు, గోత్రనామాలు కూడా కనిపిస్తాయి. ఇలా ఋగ్వేద కరంభ పదం... మహాభారత రచనా కాలానికి అనేక మార్పులు పొందింది.

ధాన్యపు పిండిని ఉడికించి పెరుగు కలిపి తయారు చేస్తారని సంస్కృత నిఘంటువులు పేర్కొన్నాయి. బ్రౌను నిఘంటువు కూడా 'పెరుగుతో తడిపిన పేలపిండి' అనే అర్థాన్ని ఇచ్చింది. వేగించిన ధాన్యపు పిండితోనే కరంభకం తయారు చేయాలని స్పష్టం అవుతోంది. 15వ శతాబ్దం నాటి క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో 'కరభంకం' అనే కర్డ్ రైస్ ఎలా తయారు చేయాలో వివరంగా చెప్పాడు.

మొదటగా మీరు ఎంచుకున్న ధాన్యాన్ని కొద్దిసేపు నానబెట్టి, కడిగి ఆరబెట్టాలి. బాండీలో కొద్దిగా నెయ్యి వేసి ఈ ధాన్యాన్ని చక్కని పరిమళం వచ్చేదాకా సన్న సెగన వేగించాలి. ఆ ధాన్యాన్ని విసిరి లేదా మిక్సీ పట్టుకుని ఒక కప్పు పిండికి ఒక కప్పు నీరు కలిపి ముద్దగా ఉడికించాలి. ఉడకటం పూర్తికాబోయే ముందు కొద్దిగా నెయ్యి గానీ వెన్న గానీ కలిపి పొయ్యి మీంచి దించేయాలి.

ఇలా వండిన పిండిని చిన్న బేసిన్లోకి తీడి పూర్తిగా చల్లారనివ్వాలి. 'సుశీతం' అనే పదం ద్వారా ఈ విషయాన్ని క్షేమశర్మ నొక్కి చెప్పాడు. ఇది కరంభకానికే కాదు, కర్డ్ రైస్‌కూ వర్తిస్తుంది. చల్లారిన అన్నంలో పెరుగు కలుపుతారు కాబట్టే అది చద్దన్నం. అమ్మవారికి బోనాలు లేదా చలిది నివేదన పెట్టటం తెలుగువారి ఆచారం. చద్ది అన్నం అంటే పెరుగన్నమే గానీ నిన్నటి అన్నం అని కాదు.

కరంభకం కోసం ఉడికించిన పిండి పూర్తిగా చల్లారాక అందులో పెరుగు (లేదా చిక్కని చల్ల) కలిపి బాగా చిలికితే చిక్కటి పాల మాదిరిగా అవుతుంది. ఒక కప్పు ఉడికించిన పిండికి రెండు కప్పుల దాకా పెరుగు పట్టవచ్చు. అందుకని 'దధ్యాఢ్యం' అన్నాడు. అది 'నాతి ద్రవం, నాతి సాంద్రం'గా ఉండాలన్నాడు. అంటే, మరీ పలుచగానో లేక ముద్దలానో కాకుండా చిక్కని పాల మాదిరిగా ఉండాలి.



'కరంభ సంజ్ఞా యే భక్ష్యా హృద్యాః శీతాతిపుష్టిదాః! అత్యర్థ మనుజైః సేవ్యాః శరత్కాలనిదాఘయోః'..ఇలా తయారు చేసిన కరంభకం గుండెను బలసంపన్నం చేస్తుంది. చలవనిస్తుంది. బలకరం. పుష్టిని, తక్షణ శక్తిని ఇస్తుంది. వసంత కాలంలోనూ, వేసవి కాలంలోనూ ఇది మేలు చేస్తుందన్నాడు క్షేమశర్మ. కరంభకాన్ని మనం బార్లీ గింజల్ని ఉడికించి, దండిగా పెరుగు కలిపి, ఆ గింజలతో సహా మిక్సీ పడితే చిక్కటి మజ్జిగ తయారవుతాయి. ఇలాగూ కరంభకం తయారు చేసుకోవచ్చు. ధనియాలు, జీలకర్ర, శొంఠి, మిరియాలు కలిపి దంచిన పొడి గానీ, ఏలకులు, పచ్చకర్పూరం గానీ కలిపి దీన్ని తీసుకోవచ్చు. ఇది అమితమైన చలవనిస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

నాన్‌వెజ్‌తో చేసే వంటకాలకు చాలా సమయమే పడుతుంది. ముఖ్యంగా మటన్ అయితే మరికాస్త సమయం తీసుకుంటుంది. అయితే ఈ మటన్‌తోనే సులువుగా, వేగంగా వండుకోవచ్చు. ఆ వంటలే మటన్ ఖీమా కర్రీ, మటన్ ఖీమా ఉండలు. వీటిని వండుకోండిలా..

ఖీమా.. రుచిలో వారెవ్వా!



మటన్ ఖీమా కర్రీ

కావల్సిన పదార్థాలు

మటన్ ఖీమా- 500 గ్రాములు, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, నల్లయాలక- 1, పెద్ద ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, పచ్చిమిర్చి- 4, అల్లం వెల్లుల్లి పేస్ట్- టేబుల్ స్పూన్, కారం పొడి- ఒకటిన్నర టేబుల్ స్పూన్, టమోటాలు-2 (సన్నగా తరగాలి), ధనియాల పొడి- టీస్పూన్, కొత్తిమీర- టేబుల్ స్పూన్

తయారీ విధానం

కుక్కర్‌లో నూనె వేసి.. కాస్త వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలు వేయాలి. ఇందులో తగినంత ఉప్పు, కొద్దిగా పసుపు వేసి కలపాలి. ఉల్లిపాయ ముక్కలు రంగు మారేంత వరకూ కదుపుతూ వేయించాలి. నిలువుగా చీరి పచ్చిమిర్చి వేయాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేశాక మూడు నిముషాల పాటు కలపాలి. కాస్త మీడియం ఫ్లేమ్ పెట్టుకోవాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్ వాసన పోతుంది. తర్వాత మటన్ ఖీమా వేసి కలపాలి. నాలుగు నిముషాల పాటు కుక్ చేయాలి. ఆ తర్వాత కారం పొడి, ఉప్పుతో పాటు ధనియాల పొడి వేసి కలపాలి. వెంటనే సన్నగా తరిగిన టమోటా ముక్కలు వేయాలి. మూడు నిముషాలు గరిటెతో కలిపాక.. ఒక కప్పు నీళ్లు పోయాలి. కుక్కర్ మూత పెట్టి ఆరు విజిల్స్ వచ్చేంత వరకూ కుక్ చేయాలి. మటన్ ఖీమాను గరిటెతో కలిపి రెండు నిముషాల పాటు ఉడికించి.. ఇందులోకి కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. ఈ మటన్ ఖీమా కర్రీ చపాతీ లేదా అన్నంలోకి రుచికరంగా ఉంటుంది.



మటన్ ఖీమా ఉండలు

కావాల్సిన పదార్థాలు

లేత మటన్ ఖీమా- 300 గ్రాములు, చిన్న ఉల్లిపాయలు-2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 4, వెల్లుల్లి- 7, అల్లం ముక్క- 1 (సన్నగా తరగాలి), కారం పొడి- ఒకటిన్నర టీస్పూన్, ధనియాల పొడి- ఒకటిన్నర టీస్పూన్, పసుపు- కొద్దిగా, ఉప్పు- తగినంత, గరం మసాలా- ముప్పావు టీస్పూన్, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

జార్‌లో మటన్ ఖీమా, తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, తరిగిన అల్లం ముక్కల మిశ్రమం, కారం పొడి, ధనియాల పొడి, పసుపు, గరం మసాలా, ఉప్పు వేసి మిక్సీ పట్టాలి. మరీ మెత్తగా పట్టుకోకూడదు. గరుకుగా మిక్సీ పట్టాలి. వీటిని చిన్న బాల్స్‌లో ఒత్తుకోవాలి. చివరగా గుంత ప్యాన్‌లో నూనె వేసి వేడయ్యాక.. మీడియం ఫ్లేమ్‌లో ఉంచి ఈ బాల్స్‌ను వేసి ఫ్రై చేసుకోవాలి. ఈ మటన్ ఖీమా ఉండలు స్నాక్స్‌లా తినొచ్చు. రుచిగా ఉంటాయివి.

మేకప్

చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే మేకప్ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఉత్పత్తులను తగు మాత్రంగా వాడుకోవడంతో పాటు, చర్మానికి నప్పే సౌందర్యసాధనాలను ఎంచుకోవడం కూడా ముఖ్యమే!

కంటికి ఇంపుగా

లిప్‌స్టిక్ ఇలా...

డార్క్ స్కిన్ కలిగిన వాళ్లు లేత రంగు లిప్‌స్టిక్స్ ఎంచుకోవాలి. బీజ్, పేల్ పింక్, న్యాచురల్ కలర్, పేల్ బ్రౌన్ రంగులు వీళ్లకు బాగుంటాయి. అయితే లిప్‌లైనర్ కచ్చితంగా వాడుకోవాలి. పెదవుల ఔట్‌లైన్ గీసుకునేటప్పుడు, అవసరానికి మించి పెదవులను దాటనీయకూడదు. లిప్‌లైనర్‌తో లిప్‌స్టిక్ రంగు మ్యాచ్ అయ్యేలా చూసుకుంటే పెదవుల రంగు సహజసిద్ధంగా కనిపిస్తుంది.

ఐలైనర్ ఇలా...

చిక్కని కనురెప్పల వెంట్రుకలు కలిగినవాళ్లు కనురెప్పల మీద సన్నని లైన్ గీసుకోవాలి. కంటి చివర్లో వంపు తిప్పాలా వద్దా అనేది కంటి ఆకారం మీద ఆధారపడి ఉంటుంది. సోగ కళ్లయితే, కంటి చివర్లో వంపు బాగుంటుంది. చిన్న కళ్లు ఉన్నవాళ్లు ఐలైనర్‌ను మందంగా అప్లై చేసుకోవాలి. కింది కనురెప్పకు కూడా మస్కారా అప్లై చేయాలి.

బ్లష్ ఇలా...

బుగ్గలు గులాబీ మొగ్గల్లా ఉండాలని అవసరానికి మించి బ్లష్ అప్లై చేసుకుంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. కాబట్టి డ్రస్‌తో మ్యాచ్ అయ్యే బ్లష్‌ను బ్రష్‌తో అద్దుకున్న తర్వాత, అరచేతి మీద రుద్దుకోవాలి. అలా చేయడం వల్ల అదనపు బ్లష్ వదిలిపోతుంది. ఆ తర్వాత చీక్ బోన్స్ నుంచి చెవుల వైపుకు బ్రష్‌ను కదిలిస్తూ బ్రష్ అద్దుకోవాలి.



ఐ షాడో ఇలా...

ఐ షాడో కూడా డ్రస్‌కు మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి. స్మోకీ ఐస్ కోసం డార్క్ బ్రౌన్ షాడో బాగుంటుంది. ఐషాడో, ఐలైనర్ కలిసిపోయేలా అప్లై చేసుకుంటే స్మోకీ ఐస్ సొంతమవుతాయి. కనురెప్పలు పెద్దవిగా కనిపించాలనుకుంటే, కనురెప్ప మధ్యలో లైన్ గీసి, కనుబొమల వరకూ తేలికపాటి షాడో, ఐల్యాషెస్ వరకూ ముదురురంగు షాడో వేసుకోవాలి.

రూ.4.5 లక్షల కోట్లు ఉఫ్

భారీగా పతనమైన స్టాక్ సూచీలు .. 885 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్

- 81,000 దిగువకు జారిన ఇండెక్స్
- 25,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- రూ.457 లక్షల కోట్లకు పడిపోయిన బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్
- ప్రపంచ మార్కెట్లను కుదిపేసిన అమెరికా మాంద్యం భయాలు



ముంబై: వరుసగా ఐదు రోజులపాటు లాభపడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో భారీ పతనాన్ని చవిచూశాయి. అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చన్న భయాలు ప్రపంచ మార్కెట్లతో పాటు దలాల్ స్ట్రీట్‌నూ కుదిపేశాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు మెటల్, ఆటో, ఐటీ రంగ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దాంతో సెన్సెక్స్ 81,000, నిఫ్టీ 25,000 కీలక స్థాయిలను కోల్పోయాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సరికి, సెన్సెక్స్ 885.60 పాయింట్లు (1.08 శాతం) నష్టంతో 80,981.95 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 998.64 పాయింట్ల వరకు క్షీణించినప్పటికీ చివర్లో కాస్త కోలుకుంది. నిఫ్టీ విషయానికొస్తే, ఒక దశలో సూచీ 324.05 పాయింట్లు కోల్పోయి 24,686.85 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 293.20 పాయింట్ల నష్టంతో 24,717.70 వద్ద క్లోజైంది. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.46 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.457.16 లక్షల కోట్ల (5.46 లక్షల కోట్ల డాలర్లు)కి పడిపోయింది.

ఐఎస్ఎం మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్ ఏకంగా 46.6 పాయింట్లకు పడిపోవడం అమెరికా ఆర్థిక మాంద్యం భయాలను మళ్లీ తెరపైకి తెచ్చింది. అలాగే, యూఎస్ ఐటీ రంగ త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండటం, నిరుద్యోగిత రేటు 4.3 శాతానికి పెరగడం, బ్యాంక్ ఆఫ్ జపాన్ (బీఓజే) వడ్డీ రేట్లను మరింత పెంచే అవకాశాలు, చైనా వృద్ధి మందగమనం అంశాలు ప్రపంచ మార్కెట్ల సెంటిమెంట్‌పై తీవ్ర ప్రభావం చూపాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 నష్టపోయాయి. మారుతి సుజుకీ షేరు అత్యధికంగా 4.63 శాతం క్షీణించగా.. టాటా మోటార్స్ 4.17 శాతం పతనమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు మాత్రం 1.17 శాతం లాభపడింది.
- బ్లూచిప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈలోని స్మాల్ క్యాప్ సూచీ 0.58 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.19 శాతం తగ్గాయి. రంగాలవారీ సూచీల్లో హెల్త్‌కేర్ మినహా అన్నీ నేలచూపులు చూశాయి. రియల్టీ 3.56 శాతం క్షీణించగా.. మెటల్ 3 శాతం, ఆటో 2.97 శాతం, ఐటీ 2.05 శాతం నష్టపోయాయి. కమోడిటీస్, టెక్నాలజీ, క్యాపిటల్ గూడ్స్ ఒక శాతానికి పైగా పతనమయ్యాయి.
- గత నెల 26తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 347 కోట్ల డాలర్లకు పైగా తగ్గి 66,738.6 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయని ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం వారంలో నిల్వలు 400 కోట్ల డాలర్ల పెరుగుదలతో సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 67,085 కోట్ల డాలర్లకు ఎగబాకాయి.

ఐపీఓకు పారస్ హెల్త్‌కేర్

పారస్ హెల్త్ బ్రాండ్‌నేమ్‌తో గొలుసుకట్టు ఆసుపత్రుల నిర్వహణ సంస్థ పారస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ ఐపీఓ కోసం క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.400 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్, ఇన్వెస్టర్లకు చెందిన 1.5 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టనుంది.

ఓలా ఎలక్ట్రిక్ ఇష్యూకు 35 శాతం సబ్‌స్క్రిప్షన్

విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ తొలి రోజు ముగిసేసరికి ఇష్యూ సైజులో 35 శాతానికి సమానమైన బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కేటాయించిన షేర్లకు మాత్రం 1.57 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. కాగా, మౌలిక రంగ కంపెనీ సీగల్ ఇండియా ఐపీఓ రెండో రోజున పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది.

ఐటీ రిటర్న్‌లు 7.28 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయడానికి ఆఖరు గడువు జూలై 31 ముగిసే నాటికి మొత్తం 7.28 కోట్ల రిటర్న్‌లు దాఖలయ్యాయి. గత ఏడాదితో పోల్చితే దాఖలైన రిటర్న్‌ల సంఖ్య 7.5 శాతం అధికం. 2023-24 అసెస్‌మెంట్ సంవత్సరానికి 6.77 కోట్ల రిటర్న్‌లు దాఖలయ్యాయి. 2024-25 అసెస్‌మెంట్ సంవత్సరానికి దాఖలైన మొత్తం 7.28 కోట్ల రిటర్న్‌ల్లో 5.27 కోట్ల రిటర్న్‌లు అంటే 72 శాతం కొత్త పన్ను విధానం కింద దాఖలైనట్టు ఆదాయపు పన్ను శాఖ ప్రకటించింది. చివరి రోజు కావడం వల్ల జూలై 31వ తేదీన ఒక్క రోజులోనే 69.92 లక్షల రిటర్న్‌లు దాఖలైనట్టు తెలిపింది. 58.57 లక్షల మంది తొలిసారిగా ఐటీఆర్ దాఖలు చేశారు. 43.82 శాతం ఐటీఆర్‌లను ఆన్‌లైన్ విధానంలో దాఖలు చేసినట్టు తెలిపింది. ఐటీఆర్‌ల దాఖలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో కూడా ట్రాఫిక్ రద్దీని తట్టుకుంటూ ఈ-ఫైలింగ్ పోర్టల్ అద్భుతంగా పని చేసిందని పేర్కొంది.

మరింత త్వరగా ఐపీఓలకు ఆమోదం

ముంబై: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల ఆమోద ప్రక్రియను మరింత త్వరితం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం ఒక నిర్ణీత ఫారాన్ని రూపొందిస్తున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ ప్రకటించారు. ఐపీఓకు వచ్చే కంపెనీలు ఈ ఫారంలోని ఖాళీలను పూర్తి చేస్తే సరిపోతుందన్నారు. ఒకవేళ ఏమైనా క్లిష్టమైన అంశాలు ఉంటే, అదే ఫారంలోని ప్రత్యేక కాలంలో పూర్తి చేయవచ్చన్నారు. అయితే ఎప్పటి నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమయ్యేది వెల్లడించలేదు. దీనికి తోడు ఐపీఓల కోసం కంపెనీలు ఫైల్ చేసే పత్రాల చెకింగ్ కోసం ఈ ఏడాది డిసెంబరులోగా కృత్రిమ మేధ (ఏఐ)తో పనిచేసే ప్రత్యేక టూల్ తీసుకువస్తామని ఆమె వెల్లడించారు.

బిజినెస్

ఔషధాల పరీక్ష కోసం ప్రత్యేక లేబొరేటరీ



- వచ్చే నెల రోజుల్లో అందుబాటులోకి
- నాణ్యమైన, అందుబాటు ధరల్లో ఔషధాలను అందించటమే లక్ష్యం
- మెడ్‌ప్లస్ ఎండీ,సీఈఓ మధుకర్ రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిటైల్ ఫార్మసీ చెయిన్ మెడ్‌ప్లస్.. ఔషధాలను పరీక్షించేందుకు ప్రత్యేకంగా ఒక లేబొరేటరీని ఏర్పాటు చేస్తోంది. ఈ లేబొరేటరీలో ఔషధాలకు సంబంధించిన ప్రతి బ్యాచ్‌ను నిశితంగా పరీక్షించనున్నట్లు మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ఎండీ, సీఈఓ జీ. మధుకర్ రెడ్డి తెలిపారు. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబరేషన్ లేబొరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) అనుమతి పొందిన ఈ లేబొరేటరీ వచ్చే నెలన్నర రోజుల్లో అందుబాటులోకి రానుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా తాము ఈ లేబొరేటరీని ఏర్పాటు చేస్తున్నట్లు మధుకర్ తెలిపారు. మెడ్‌ప్లస్ బ్రాండ్ పేరుతో ఇప్పటికే పలు ఔషధాలను తమ రిటైల్ ఫార్మసీల ద్వారా విక్రయిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ జెనరిక్ ఔషధాల్లో రక్తపోటు, మధుమేహం, హృద్రోగ వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధుల్లో ఉపయోగించే ప్రిస్క్రిప్షన్ ఔషధాలతో పాటు ఓవర్ ది కౌంటర్ (ఓటీసీ) ఔషధాలు ఉన్నాయని మధుకర్ వివరించారు. దేశంలోని అన్ని ప్రధాన ఫార్మా కంపెనీలకు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో జెనరిక్ ఔషధాలను సరఫరా చేసే కాంట్రాక్ట్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ (సీడీఎంఓ)ల నుంచి తాము ఈ ఔషధాలను పొందుతున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్, విండ్‌లాస్ బయోటెక్ సహా మరికొన్ని కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. దీంతో తమ ఫార్మసీ రిటైల్ నెట్‌వర్క్ ద్వారా విక్రయిస్తున్న ఈ ఔషధాలపై 50 నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్‌ను ఇవ్వగలుగుతున్నట్లు తెలిపారు.

క్యూ1 లాభం నాలుగింతలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో మెడ్‌ప్లస్ అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,497.53 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.14.34 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.3.76 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా నాలుగింతలు వృద్ధి చెందగా ఆదాయం (రూ.1,293.68 కోట్లు) 15 శాతం పెరిగింది.

రూ.361 కోట్లు ఆదా..

మెడ్‌ప్లస్ బ్రాండ్ ఔషధాలతో వినియోగదారులు పెద్దఎత్తున లబ్ది పొందుతున్నారని మధుకర్ వివరించారు. గడచిన ఏడాది కాలంలో మెడ్‌ప్లస్ బ్రాండ్ కింద విక్రయించిన ఔషధాల విలువ రూ.614 కోట్లుగా ఉండగా అందులో వినియోగదారులు చెల్లించిన మొత్తం రూ.253 కోట్లుగా ఉందని ఆయన పేర్కొన్నారు. మెడ్‌ప్లస్ అందించిన డిస్కౌంట్స్‌తో వినియోగదారులు తాము కొనుగోలు చేసిన ఔషధాలపై ఏకంగా రూ.361 కోట్ల మేర లబ్ది పొందారని తెలిపారు. ప్రస్తుతం తమ జెనరిక్ ఔషధాల పోర్టుఫోలియోలో 433 ఔషధాలు ఉన్నాయన్నారు. త్వరలో ఈ ఔషధ పోర్టుఫోలియోను 900కు చేర్చాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. మెడ్‌ప్లస్‌లో ప్రస్తుతం 25 లక్షల మంది సభ్యులున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో మొత్తం రూ.170 కోట్ల విలువైన ఔషధాలను విక్రయించగా రూ.100 కోట్ల మేర వినియోగదారులు లబ్ది పొందారని మధుకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మెడ్‌ప్లస్ దేశవ్యాప్తంగా 4,500 స్టోర్లను నిర్వహిస్తోందన్నారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ ఏడాది కొత్తగా 600 స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగానే జూన్ త్రైమాసికంలో కొత్తగా 37 స్టోర్లను ప్రారంభించినట్లు మధుకర్ వివరించారు. కాగా డయాగ్నోస్టిక్స్ సేవలను బిజినెస్ 2 బిజినెస్ (బీ2బీ)కు విస్తరిస్తున్నట్లు మధుకర్ తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటికే కొన్ని కార్పొరేట్ కంపెనీలతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు.

కెనరా బ్యాంక్‌లో అధికార, కన్నడ భాషలకు ప్రాధాన్యత



ప్రయాస్ సంచిక ఆవిష్కరిస్తున్న కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజు, తదితరులు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్‌లో అధికారిక భాష హిందీతో పాటు కన్నడ భాషకు ప్రాధాన్యత ఇచ్చామని బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు తెలిపారు. శుక్రవారం నాడిక్కడ కెనరా బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అధికారిక భాష అమలు కమిటీ (బ్యాంకులు, బీమా సంస్థలు), బెంగళూరు ఆధ్వర్యంలో జరిగిన 77వ అర్ధ వార్షిక కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ అధికారిక కార్యకలాపాల్లో అధికార భాష హిందీ, కన్నడ భాషలను గరిష్ఠంగా వినియోగించేలా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. భాషా అమలు కమిటీ ద్వారా చైతన్యం కలిగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఈడీ అశోక్ చంద్ర, రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ డైరెక్టర్ సోనాలిసేన్ గుప్తా సహా వివిధ బ్యాంకులు, బీమా సంస్థల ప్రాంతీయ అధికారులు, కమిటీ దక్షిణ భారత విభాగం డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ పాల్గొన్నారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అధికారిక భాష అమలుకు సంబంధించి రాజభాష పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రయాస్ 49వ సంచికను విడుదల చేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,690 ▲	64,800 ▲	91,000 ▲
ముంబై	70,392 ▲	64,479 ▲	83,501 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	513	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	87	విజయవాడ	92
వరంగల్	87	గుంటూరు	92
కరీంనగర్	87	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	106
కర్నూలు	87	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		

అమరావతి నిర్మాణాలు భేష్!

- టీడీపీ సర్కారు మెరుగ్గా చేసింది
- ఐఐటీ హైదరాబాద్ బృందం వెల్లడి
- నేడు చెన్నై ఐఐటీ నిపుణుల రాక

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన నిపుణుల బృందం రాజధాని అమరావతిలో శుక్రవారం పర్యటించింది. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కేబీఎల్ సుబ్రహ్మణం, విభాగాధిపతి మున్వర్ బాషాల నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌ను పరిశీలించింది. సీఆర్డీఏ అధికారులతో భేటీ అయి రెండు గంటలకు పైగా నిపుణులు చర్చించారు. భవన నిర్మాణాల పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ప్రొఫెసర్ కేబీఎల్ సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో భవన నిర్మాణాల స్థితిగతులు ఎలా ఉన్నాయి, వాటిని ఎప్పటికి అందుబాటులోకి తీసుకురాగలుగుతాం అనే అంశాలపై సీఆర్డీఏతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఎన్నిరోజులు ఉండాలి? ఏయే అంశాలను పరిశోధించాలి? అనే విషయాలపై సీఆర్డీఏ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం కొంత మంది సభ్యుల బృందం పరిశీలిస్తోందని, భవిష్యత్తులో ఈ బృందాన్ని పెంచి మరింత విస్తృతస్థాయిలో పరిశోధించి నివేదిక అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం భవనాల పరిస్థితి బాగానే ఉందని, అయితే, అప్పుడే ఒక అభిప్రాయానికి రాలేమని చెప్పారు. కట్టడాలను పూర్తిగా పరిశీలించాకే నాణ్యతను అంచనా వేయగలమన్నారు. సాధ్యమైనంత త్వరలో నివేదిక ఇస్తామన్నారు. అనంతరం క్వార్టర్ల వెనుకవైపు నిర్మించిన సెప్టిక్ ట్యాంకు వ్యర్థాల నిర్వహణ కోసం నిర్మిస్తున్న సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ)ను పరిశీలించారు. నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు గుర్తించి సీఆర్డీఏ అధికారులకు తెలిపారు. అయితే ఆ నిర్మాణానికి పునాదులు టీడీపీ హయాంలో పడినా, నిర్మాణం మాత్రం వైసీపీ హయాంలో జరిగిందని అధికారులు వారికి తెలిపారు. కాగా భవన నిర్మాణాలకు వేసిన రంగులు, ప్లాస్టరింగ్ నాణ్యతను పరిశీలించిన అధికారులు ఐదేళ్ల తరువాత కూడా అవి చెక్కు చెదరక పోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భవన నిర్మాణాల విషయంలో గత టీడీపీ ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలను పాటించడం వల్లే భవనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కాగా, తుప్పు పట్టిన ఇనుము నిర్మాణాలకు పనికి వస్తుందా లేదా అన్నదానిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి తెలియజేస్తామని నిపుణులు తెలిపారు.

సామర్థ్య అంచనా బాధ్యత వారికి: మంత్రి

అమరావతిలో నిలిచిపోయిన కట్టడాల సామర్థ్యాన్ని అంచనా వేసే బాధ్యతను హైద్రాబాద్, చెన్నై ఐఐటీ నిపుణులకు అప్పగించినట్టు మంత్రి నారాయణ తెలిపారు. హైదరాబాద్ ఐఐటీ నిపుణులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగుల నివాస సముదాయాలను పరిశీలించినట్టు చెప్పారు. శనివారం చెన్నై ఐఐటీ నిపుణులు అమరావతిలో పర్యటించి అసెంబ్లీ, హైకోర్టు, ఐదు టవర్ల నిర్మాణాల సామర్థ్యాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డు విషయంపై కూడా రైతులతో మాట్లాడామని, 217 చదరపు కిలోమీటర్లకు అందరికి ఒకటే పాలసీ అమలవుతోందన్నారు. అన్ని సంస్థలు తిరిగిరావడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.


అమరావతిలో ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న నిపుణులు

ఉచిత ఇసుకలో సమస్యలెందుకు?

- అధికారులు పాయింట్లను పరిశీలించాలి
- గనుల శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని గనుల శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రవాణా చార్జీల విషయంలో నెలకొన్న గందరగోళం, రీచ్‌ల వద్ద వాహనాల బారులు తీరడం, లైన్‌లో ఉన్నా తమకు ఇసుక ఇవ్వలేదంటూ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. ఈ సమస్యలు ఎందుకు వస్తున్నాయో నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపాలని గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎంకే మీనాను ఆదేశించారు. శుక్రవారం గనులు, ఎక్సైజ్ శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆ రెండు విభాగాల ముఖ్యకార్యదర్శి మీనా భేటీలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీఎం ఆ ఇద్దరితో మాట్లాడినట్లు తెలిసింది. మీనా ఇటీవల తూర్పుగోదావరి జిల్లా పెండ్యాల, కోనసీమ జిల్లా రావులపాలెం ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఆ సందర్భంగా అక్కడున్న వినియోగదారులు, ట్రక్కుల యజమానులతో మాట్లాడారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. రీచ్‌లను పరిశీలించి ఏ సమస్యలు కనిపెట్టారని ఆరాతీసినట్లు తెలిసింది. ఆన్‌లైన్ పర్మిట్లు ఉన్నవారు, లేనివారు స్టాక్ పాయింట్ల వద్దకు రావడంతో పోటీ విపరీతంగా పెరిగిపోయిందని, వాహనాల క్యూ ఊహించని రీతిలో ఉంటోందని మీనా నివేదించారు. కాగా, అధికారులు వీలైనంత మేరకు ఇసుక స్టాక్‌పాయింట్లకు వెళ్లి సమస్యలు తెలుసుకుని, చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

మద్యం స్కామ్‌పై సీఐడీ!

- పది రోజుల్లోనే అప్పగించేలా చర్యలు
- అప్పటి ఫైళ్లన్నీ సీజ్ చేయండి
- నాణ్యత లేని మద్యం కనిపించకూడదు
- మద్యంపై అధిక ధరలతో దోపిడీ వద్దు
- ఎక్సైజ్ శాఖపై చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం స్కామ్‌పై సీఐడీ విచారణ జరిపిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. గత ఐదేళ్లకు సంబంధించిన ఫైళ్లన్నీ సీజ్ చేయాలని ఆదేశించారు. పది రోజుల్లో కేసును సీఐడీకి అప్పగించేందుకు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలన్నారు. శుక్రవారం ఆయన సచివాలయంలో ఎక్సైజ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. "గత ఐదేళ్లలో ఊహించని స్థాయిలో మద్యంలో అక్రమాలు జరిగాయి. ప్రజల ప్రాణాలు తీసే నాణ్యత లేని మద్యం ఇకపై రాష్ట్రంలో కనిపించకూడదు. నాణ్యత విషయంలో రాజీపడొద్దు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మద్యపానాన్ని పూర్తిగా మాన్పించడం సాధ్యంకాదు. కనీసం నాణ్యతగల మద్యం విక్రయించడం ద్వారా అనారోగ్య సమస్యలను కొంతమేర తగ్గించవచ్చు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

అడ్డగోలు దోపిడీ...


గత ప్రభుత్వం అడ్డగోలుగా మద్యం ధరలు పెంచి.. ప్రజలను దోచుకుందని చంద్రబాబు మండిపడ్డారు. మద్యం ధరలు పెంచడంతో గంజాయి, కల్తీ మద్యం, నాటు సారా వినియోగం పెరిగిందన్నారు. "ఇష్టానుసారంగా పెంచిన ధరల వల్ల పేదల జీవితాలు నాశనమయ్యాయి. పేదలు తమ సంపాదనంతా మద్యానికే ఖర్చుచేసే పరిస్థితి ఉండకూడదు. రేట్లు పెంచి పేదలను దోచుకున్న విధానానికి స్వస్తి పలకాలి. ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న మద్యం పాలసీలపై అధ్యయనం చేయండి" అని ఆదేశించారు. కొత్త మద్యం పాలసీకి సంబంధించిన ప్రతిపాదనలపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కొత్త పాలసీని ఆదాయం కోణంలో కాకుండా, అక్రమాలకు అవకాశం లేని విధంగా రూపొందించాలన్నారు.

అక్టోబరు నుంచి కొత్త పాలసీ

అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీని అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. అధికారులు తొలుత రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని మద్యం పాలసీలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. దీనికిగాను 4 కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నెల 12లోగా అధికారులు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తారు. ఆ తర్వాత ఒక కన్సల్టెన్సీ ద్వారా మరింత అధ్యయనం చేయించి తుది ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుంచుతారు. ఈ నెలాఖరుకు ఈ కసరత్తు పూర్తిచేసి, వచ్చే నెలలో కొత్త పాలసీని ప్రకటిస్తారు. సెప్టెంబరులో నూతన పాలసీ రూపకల్పన, లైసెన్సుల జారీ ప్రక్రియను పూర్తిచేసి.. అక్టోబరులో కొత్త పాలసీని అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే నెల రోజుల్లో మద్యం షాపుల్లో డిజిటల్ లావాదేవీల విధానం ప్రవేశపెట్టనున్నారు. ఎక్సైజ్ శాఖ పునర్నిర్మాణంపైనా ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నారు.

పలు అంశాల్లో కమిటీలు...

ఎక్సైజ్‌లో పలు అంశాలపై ప్రభుత్వం ఆ శాఖ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసింది. మద్యంలో ఎంఎన్‌సీ కంపెనీలు, పాపులర్ బ్రాండ్లను తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చే అంశంపై అదనపు కమిషనర్ ఎం.దేవకుమార్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. మద్యం ఉత్పత్తిలో నాణ్యత కోసం సమగ్ర నాణ్యతా విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు జాయింట్ కమిషనర్ వి.అనసూయాదేవి నేతృత్వంలో కమిటీని వేశారు. కల్తీ మద్యం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభించడంపై డిప్యూటీ కమిషనర్లు పి.శ్రీదేవి, కె.శ్రీనివాసులు నేతృత్వంలో మరో ఒక కమిటీని నియమించారు.



పీఎం కుసుమ్‌కు ఓకే

రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయం

- సాగు విద్యుత్‌పై రైతుకు స్వేచ్ఛ
- ప్రతీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో 2-5 మెగావాట్ల సోలార్ హబ్‌లు
- రైతుకు నేరుగా కరెంటు సరఫరా
- ఇంధన రంగంపై చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సాగు విద్యుత్‌పై రైతుకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ఇంధన శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవమ్ ఉత్థాన్ మహాభియాన్(పీఎం కుసుమ్) పథకాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయాలన్నారు. తద్వారా వ్యవసాయానికి పగటి పూట 9 గంటల పాటు విద్యుత్‌ను అందించవచ్చన్నారు. పీఎం కుసుమ్ పథకంలో భాగస్వాములవుతున్నామని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖకు స్పష్టం చేయాలని ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఇంధన శాఖపై సీఎం సమీక్ష చేశారు. రాష్ట్రంలో ఇంధన రంగ స్థితిగతులపై ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించేందుకు 33 కేవీ సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ ప్రవాహం వల్ల 10 శాతం మేర కరెంటు నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు జోక్యం చేసుకుని.. ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించేందుకు వీలుగా 11 కేవీ ఫీడర్ల పరిధిలో 2నుంచి 5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం వల్ల రైతు చేనుకు నేరుగా కరెంటును అందించవచ్చని సూచించారు. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ పథకంలో చేరడం వల్ల వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్‌ను అందించవచ్చన్నారు. గ్రామాల్లో రెండు నుంచి ఐదు మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేలా ప్రోత్సాహం అందించాలన్నారు. దీనివల్ల గ్రామా ల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించినట్లు అవుతుందని చెప్పారు. మరోవైపు 33 కేవీ ద్వారా కాకుండా 11 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ల ద్వారా కరెంటు నేరుగా రైతుకు సరఫరా అవుతుందని వెల్లడించారు. ఔత్సాహికుల నుంచి యూనిట్‌ను రూ.2.50కే కొనుగోలు చేయడం వల్ల చౌక ధరకు విద్యుత్ లభిస్తుందని చంద్రబాబు చెప్పారు. గతంలో వ్యవసాయ పంప్‌సెట్లకు సోలార్ ప్యానళ్లను అమర్చే పథకాన్ని అమలు చేశామని చెప్పారు. కేంద్రం సబ్సిడీ ఇస్తున్నందున ఔత్సాహికులకు 30 శాతం రాయితీ కూడా లభిస్తుందని వెల్లడించారు. కేంద్రం పీఎం కుసుమ్ పథకాన్ని 2026 మార్చి నెలాఖరు దాకా పొడిగించింది. రాష్ట్రస్థాయిలో లక్ష్యాలను కూడా నిర్దేశించింది. ఈ పథకం కింద వ్యక్తిగతంగానూ, గ్రూపుగానూ రైతులకు సబ్సిడీ అందిస్తుంది. రాష్ట్రంలో సోలార్ మిగులు విద్యుత్‌ను బ్యాటరీల్లో స్టోర్ చేసే విధానాన్ని అమలు చేద్దామని చంద్రబాబు సూచించారు. కాగా, నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సమీపంలోని సెంబ్‌కార్ప్ నుంచి 500 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి ఇప్పటికే రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదం లభించినందున, ఈ పీపీఏకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

నాడు వద్దన్న జగన్

జగన్ హయాంలో అదానీ నుంచి 7వేల మెగావాట్ల కరెంటును కొనుగోలు చేయడం కోసం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో ఒప్పందాన్ని చేసుకున్నారు. దీంతో పీఎం కుసుమ్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని కేంద్రానికి జగన్ సర్కారు తేల్చి చెప్పేసింది. రాష్ట్రంలో కుసుమ్ పథకాన్ని అమలై ఉంటే సెకీ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం పడేది కాదని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం వల్ల 25 ఏళ్ల కాలానికి రూ.75 వేల కోట్ల మేర భారం పడుతుందని అంటున్నారు. తాజా సమీక్షలో పీఎం కుసుమ్ పథకాన్ని అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు.

మహిళా హాస్టల్స్ పెట్టండి

- అంగన్వాడీల్లో వసతులు కల్పించండి: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీలున్నన్ని మహిళా వసతి గృహాలను అందుబాటులోకి తేవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వసతి గృహాల వద్ద చిన్నారుల సంరక్షణ కేంద్రాలు ఉండేలా చూడాలని, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో వాటి నిర్వహణను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీల్లో మౌలిక వసతులు మెరుగు పరచాలని సూచించారు. 'గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న చోట మినీ అంగన్వాడీల ను మెయిన్ అంగన్వాడీలుగా మార్చాలి. మేము సైతం కార్యక్రమాన్ని కొనసాగించాలి. పథకాలు అందించడమే కాదు వాటి ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించాలి. ఇందుకు సమగ్ర ప్రణాళికతో పని చేయాలి' అని అధికారులకు చంద్రబాబు సూచించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సాధికారత, మాతా, శిశు మరణాల నియంత్రణ, మిషన్ వాత్సల్య కింద చేపట్టే చైల్డ్ ప్రొటెక్షన్ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. గర్భిణులు, బాలింతలకు అమలవుతున్న పథకాలు, పిల్లలకు అందించే పౌష్టికాహార పథకాలపై సమీక్ష చేశారు. 2014లో ప్రవేశపెట్టిన బాలామృతం, అమృతహస్తం, గోరుముద్ద, గిరి గోరుముద్ద, బాల సంజీవని వంటి పథకాల స్థితిగతులను తెలుసుకున్నారు. అయితే గత ఐదు ఏళ్లలో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణంపై దృష్టి పెట్టలేదని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం కొత్తగా 2,048 అంగన్వాడీ కేంద్రాలను మంజూరు చేసి కేవలం 18 కేంద్రాలను మాత్రమే పూర్తి చేసిందని వివరించారు. అంగన్వాడీల అప్‌గ్రేడేషన్లో కూడా పురోగతి లేదని వివరించారు.


నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తున్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీశా

నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1800కోట్ల బకాయిలు!

- గత ప్రభుత్వ తప్పిదాల వల్లే: యాజమాన్యాల ఆవేదన
- 10 నాటికి కొంత బిల్లులు విడుదల: ప్రభుత్వం

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, ఆగస్టు 10 నాటికి కొంత మొత్తంలో బిల్లులు విడుదల చేస్తామని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీశ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఆస్పత్రులకు భారీగా బకాయిలు పెట్టింది. దీంతో యాజమాన్యాలు ఆగస్టు 15 నుంచి సేవలు నిలిపివేస్తామని మరోసారి నోటీసులు జారీ చేశాయి. దీంతో శుక్రవారం ఉదయం ట్రస్ట్ కార్యాలయంలో నెట్‌వర్క్ ఆస్పత్రులతో సీఈవో చర్చలు జరిపారు. ప్రభుత్వం రూ.1500 నుంచి రూ.1800 కోట్ల వరకు భారీగా బకాయిలు పెట్టడంతో తాము ఆస్పత్రులను నడపలేని దుస్థితికి వెళ్లిపోయామని యాజమాన్యాల ప్రతినిధులు తెలిపారు. ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తే సమస్య ఉండదని, గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ఈ సమస్య వచ్చిందన్నారు. తాము వైద్య సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. మందులు, సర్జికల్ ఐటమ్స్ ఇచ్చే వారు అప్పులు ఇవ్వడం లేదన్నారు. కొత్త రోగులను చేర్చుకుని వైద్యం చేయడానికి కూడా నిధులు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై సీఈవో స్పందిస్తూ.. ఆస్పత్రుల సమస్యలు తమకు అర్థమవుతున్నాయని, కానీ ప్రభుత్వం వైపు నుంచి కూడా ఆలోచించాలని కోరారు. ఆగస్టు 15 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం లాంటివి చేయవద్దని, ఈలోగానే కొంత మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వంలో ఎలాంటి పెండింగ్ లేకుండా బిల్లులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

3 వైద్య కళాశాలలకే అనుమతి: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఏపీలో జిల్లా ఆస్పత్రులకు అనుబంధంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు 2019 నుంచి 7 ప్రతిపాదనలు వచ్చినట్లు కేంద్రం తెలిపింది. పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నం, ఏలూరు, మర్కాపురం, పులివెందుల, విజయనగరం నుంచి వైద్యకళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని పేర్కొంది. వీటిలో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంలో మాత్రమే వైద్య కళాశాలలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చినట్టు వివరించింది. ఈ మేరకు శుక్రవారం లోక్‌సభలో టీడీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సభ్యుడిగా వేమిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 2: పార్లమెంటు పరిధిలోని పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ (సీఓపీయూ) సభ్యుడిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు ప్రభాకర్‌రెడ్డి ఈ పదవిలో ఉంటారు. పార్లమెంటులోని మూడు ఆర్థిక స్టాండింగ్ కమిటీలలో సీఓపీయూ ఒకటి. ప్రభుత్వరంగ సంస్థల (పీఎస్‌యూ) నివేదికలు, ఖాతాలను పరిశీలించేందుకు పార్లమెంటు సభ్యులతో ఈ కమిటీని ఎంపిక చేస్తారు.

అమరావతి వైభవం!

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. అమరావతిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ఎటువంటి సంస్థలను ఆహ్వానించాలి...ఎవరికి భూములు కేటాయించాలి అనే అంశంపైనా ముఖ్యమంత్రి చర్చించారు. దేశంలోని టాప్ 10లోని కాలేజీలు, ఆస్పత్రులు అమరావతిలోనే ఏర్పాటు కావాలన్నారు. కరకట్టపై సెంట్రల్ డివైడర్‌తో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. అమరావతిని అనుసంధానించేలా కృష్ణా నదిపై నాలుగు బ్రిడ్జీలు ఐకానిక్‌గా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇబ్రహీంపట్నం వద్ద ఐకానిక్ బ్రిడ్జిపై మరోసారి అధ్యయనం చేస్తామని తెలిపారు. సమీక్ష వివరాలను పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మీడియాతో పంచుకున్నారు. ఆయన తెలిపిన ప్రకారం ఈ సమీక్షలో చంద్రబాబు పేర్కొన్న విషయాలివి...

పనులు వేగవంతం...

"కోర్ క్యాపిటల్ సిటీ పరిధి 217 చదరపు కిలోమీటర్లు. సిటీలో తూర్పు నుంచి పడమరకు ఒక రహదారి గ్రిడ్‌ను ఏర్పాటు చేసి దాన్ని జాతీయ రహదారికి అనుసంధానిస్తాం. ప్రతి కిలోమీటర్‌కు ఒక రోడ్డు ఉంటుంది. ఇందులో ఈ-5, 11, 13, 15 రోడ్లను నేషనల్ హైవేకు కలిపేలా చర్యలు తీసుకుంటాం. ఒక సంవత్సరంలో వాటిని పూర్తి చేస్తాం. కొండలు ఉన్న చోట వాటి పక్క నుంచి ఈరోడ్లను నేషనల్ హైవేకు కలపాలి. అమరావతిలో నిర్మించే ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల ద్వారా కృష్ణానదిపై నాలుగు ఐకానిక్ బ్రిడ్జీలు నిర్మిస్తాం. ఇప్పటికే నదిపై రెండు సాధారణ బ్రిడ్జీలు ఉండగా, మరొకటి త్వరలో అందుబాటులోకి వస్తుంది. అవుటర్ రింగ్ రోడ్డు కేంద్రం నిర్మిస్తే, ఇన్నర్‌ను మన ప్రభుత్వం నిర్మిస్తుంది. అమరావతిలో వెస్ట్రన్, ఈస్ట్రన్ బైపాస్‌లు వస్తున్నాయి. ఇప్పటికే చేపట్టిన ఈస్ట్రన్ బైపాస్ రోడ్డు త్వరలో పూర్తి అవుతుంది"

సంపద కేంద్రంగా అమరావతి..

"గతంలో 130 సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, వాటి ప్రస్తుత పరిస్థితిపై అధికారులు దృష్టి సారించాలి. గతంలో ల్యాండ్ పొందిన వాళ్లు మళ్లీ ఎన్ని రోజుల్లో నిర్మాణాలు చేపట్టాలనేది స్పష్టత ఉండాలి. సంపద సృష్టి కేంద్రంగా అమరావతి ప్రాంతాన్ని మార్చే వారికే భూ కేటాయింపులు జరపాలి. గతంలో జరిపిన భూ కేటాయింపులపై పునఃసమీక్షించి, ఆసక్తి చూపే సంస్థలకే అవకాశం ఇవ్వాలి. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నాలుగు లైన్లుగా కరకట్ట రోడ్డు విస్తరణపై ముందుకెళ్లాలి. భూసమీకరణకు సహకరించి భూములిచ్చిన రైతులకు ఇచ్చే కౌలును, భూమి లేని రైతు కూలీలకు ఇచ్చే పింఛన్లను మరో ఐదేళ్లు పొడిగించాలి. గతఐదేళ్ల కాలంలో రైతులు పడిన కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈనిర్ణయం తీసుకున్నాం. వారికి ఇచ్చే మొత్తంలోనూ మార్పు ఏమీ లేదు"

తిరిగి హ్యాపీ నెస్ట్

"రాజధానిలో భూములు కేటాయించిన సంస్థలకు తమ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు మరో రెండేళ్లపాటు గడువును పొడిగించాం. సోమ, మంగళవారాల్లో రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం అవుతాయి. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తాం. గతంలో సీఆర్డీఏలో 778 మంది ఉద్యోగులను నియమించగా, ఇప్పుడు 249 మంది ఉద్యోగులు ఉన్నారు. మిగిలిన వారిని కూడా తీసుకునేందుకు అనుమతించాం. గతంలో సీఆర్డీఏ కోసం 47 మంది కన్సల్టెంట్లను తీసుకున్నాం. వారిలో 15 మంది కన్సల్టెన్సీల పనులు పూర్తి కాగా, మిగిలిన వారిని అథారిటీకి తీసుకొంటాం"

సీఆర్డీఏ పరిధిలో మార్పులేదు..

"8,352.69 చదరపు కిలోమీటర్ల పరిధిలో సీఆర్డీయే ఉండేలా గతంలో తీసుకున్న నిర్ణయంలో మార్పు ఉండదు. ఆ పరిధిని గత ప్రభుత్వం 6993.24 చదరపు కిలోమీటర్లకు కుదించింది. అయితే పాతవిధానమే కొనసాగుతుంది. సీఆర్డీఏ నుంచి ఎక్కువ భాగం తీసేసి గత ప్రభుత్వం . పల్నాడు, బాపట్ల అథారిటీలు ఏర్పాటుచేసింది. ఆ అథారిటీలు ఉంటాయి. కానీ వాటిలోని సీఆర్డీఏ భాగాన్ని వెనక్కి తీసుకొంటాం"

ఆ గ్రామాలు మళ్లీ కోర్ క్యాపిటల్‌కు..

గతంలో కోర్ క్యాపిటల్ సిటీ 217 చదరపు కిలోమీటర్లు ఉండేలా మాస్టర్ ప్లాన్‌ను తయారుచేశాం. ఇందులో 54 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న నాలుగు గ్రామాలను గత ప్రభుత్వం మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసింది. మాస్టర్ ప్లాన్‌ను గందరగోళానికి గురిచేసింది. మేం దాన్ని తిరిగి సరిచేశాం. ఆ నాలుగు గ్రామాలను తిరిగి కోర్ క్యాపిటల్‌లో కలుపుతున్నాం. సీడ్ క్యాపిటల్ నిర్మాణం విషయంలో సింగపూర్ ప్రభుత్వంతో ఉన్న ఒప్పందాన్ని గత ప్రభుత్వం రద్దు చేసింది. తిరిగి సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో సంప్రదింపులు మేం చర్చలు జరుపుతాం. అమరావతిలో నిర్మాణంలో ఉన్న అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భవనాల పటిష్ఠతను పరిశీలించాలని హైద్రాబాద్ ఐఐటీని కోరాం"

కరకట్ట రోడ్డు నాలుగులైన్లు,...

కరకట్టపై సెంట్రల్ డివైడర్‌తో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణాన్ని గతంలో మేం ప్రతిపాదించాం. అయితే, గత ప్రభుత్వం ఆ రోడ్డును రెండు లైన్లకు కుదించింది. గతంలో నిర్ణయించినట్లుగానే కరకట్ట రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన చేపడతాం. క్యాపిటల్ సిటీ ఎంత వరకు ఉంటే కరకట్ట రోడ్డు అంత వరకు ఉంటుంది. గతంలో మేం దీనిపై టెండర్లు పిలిచాం. ఆ తర్వాత ప్రభుత్వం మారింది. వాటికి తిరిగి టెండర్లు పిలుస్తాం. కేంద్రప్రభుత్వ సంస్థలు తమ కార్యాలయాలు నిర్మించుకునేలా చూడాలని రాష్ట్ర ఎంపీలందరికీ సంస్థల వారీగా బాధ్యతలు అప్పగించాలి. ఆర్-5 జోన్ విషయం కోర్టులో ఉన్న నేపథ్యంలో లీగల్ గా అధికారులు దానిపై అధ్యయనం జరపాలి" అని చంద్రబాబు ఆదేశించారు.

పట్టణ సేవలపై ముగ్గురు మంత్రుల సమీక్ష

- టీడీఆర్ బాండ్ స్కామ్‌ల్లాంటివి పునరావృతం కావొద్దని నిర్ణయం

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ సేవలు, పురపాలక సేవలను అనుసంధానించే అంశంపై చర్చించేందుకు సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ సమావేశమయ్యారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణాల్లాంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, శాఖల మధ్య సాధించాల్సిన సమన్వయం గురించి చర్చలు జరిపారు. టౌన్ ప్లానింగ్‌లోని రిజిస్ట్రేషన్ పరమైన లోపాలను ఉపయోగించుకుని అక్రమాలకు పాల్పడుతున్న అంశంపైనా చర్చి ంచారు. నెల్లూరు కార్పొరేషన్‌లో ఫోర్జరీ సంతకాలతో అనుమతులు పొందడంతో పలువురు సిబ్బందిపై కేసులు పెట్టి విచారణ చేపట్టారు. దీనిపై సమావేశం చర్చించింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో లోపాలను అడ్డుపెట్టుకుని తప్పుడు అనుమతులు పొందేందుకు చేస్తున్న యత్నాలను నియంత్రించాలని నిర్ణయించారు.

ధాన్యం సేకరణ విధానాన్ని మారుస్తాం

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- పౌర సరఫరాలశాఖపై సీఎం సమీక్ష

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చిన ధాన్యం సేకరణ విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 'ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలంటే రైతులు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితులను గత ప్రభుత్వం కల్పించింది. మా ప్రభుత్వంలో అలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరించాలి' అని సీఎం చంద్రబాబు సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. 2019 ముందు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అప్పులు రూ.21,622 కోట్లు కాగా, వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో అప్పుల భారాన్ని రూ.41,550 కోట్లకు తీసుకువెళ్లి ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని తెలిపారు. మార్కెట్‌లో కందిపప్పు ధర రూ.180 ఉంటే.. ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.150కు, బియ్యం కేజీ రూ.48కు విక్రయిస్తున్నట్లు వివరించారు. రేషన్ షాపుల్లో మరిన్ని సరుకులను తక్కువ ధరలకు అమ్మాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీని మళ్లీ పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. రేషన్ బియ్యం డోర్ డెలివరీ అంటూ చేపట్టిన విధానం కూడా లోపభూయిష్టంగా సాగిందని అధికారులు అంగీకరించారు. రాష్ట్రంలో ఎక్కడా ఈ వాహనాల ద్వారా డోర్ డెలివరీ జరగలేదని, వీధి చివరన వాహనం నిలిపి పంపిణీ చేశారని చె ప్పారు. రేషన్ వాహనాల విషయంలో ఎలా వ్యవహరించాలి? డీలర్లను ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు.


ఉత్తరాంధ్ర వైసీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్

విశాఖ 'స్థానిక' ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా బొత్స

- పోటీపై నేడు టీడీపీ కూటమి నిర్ణయం

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును వైసీపీ అధ్యక్షుడు జగన్ ఖరారుచేశారు. శుక్రవారమిక్కడ తాడేపల్లి నివాసంలో.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పోటీ చేసిన అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్సీగా ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ వైసీపీ నుంచి జనసేనలో చేరడంతో ఆయనపై అనర్హత వేటు పడింది(ఆయన విశాఖ దక్షిణ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు). దీంతో ఈ ఉప ఎన్నిక వచ్చింది. ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఆ రోజు నుంచి 13వ దాకా నామినేషన్లను స్వీకరిస్తారు. 14న వాటిని పరిశీలిస్తారు. అనివార్యమైతే ఈ నెల 30వ తేదీన పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. అయితే విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు స్థానికేతరుడు, విజయనగరం జిల్లాకు చెందిన బొత్సను ఎంపిక చేయడంపై వైసీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇంకోవైపు.. ఉప ఎన్నికలో పోటీపై టీడీపీ కూటమి శనివారం తన నిర్ణయం వెల్లడించే అవకాశం ఉంది. పోటీపై చర్చించేందుకు కూటమి పార్టీల నేతలు అనకాపల్లిలో శనివారమే సమావేశమవుతున్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తన పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో ఈ భేటీ నిర్వహిస్తున్నారు. పోటీకి టీడీపీ నేతలు పీలా గోవింద్, గండి బాబ్జీ తదితరులు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఈ ఉప ఎన్నికలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల కౌన్సిలర్లు, గ్రేటర్ విశాఖ కార్పొరేటర్లు.. మొత్తం 822 మంది ఓటర్లుగా ఉన్నారు.

నిధులివ్వకుండా 'ఉక్కు'ను చంపేస్తారా!



- వైజాగ్ స్టీల్‌పై మోదీ డబుల్ గేమ్: షర్మిల

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 'విశాఖ ఉక్కును ప్రైవేటీకరించం అని చెప్పి బతికించారా? లేక నిధులు ఇవ్వకుండా చంపాలని చూస్తున్నారా?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా విశాఖ ఉక్కుపై ఆంధ్రజ్యోతిలో వస్తున్న కథనాలపై స్పందిస్తూ శుక్రవారం ఎక్స్ వేదికగా ఆమె కేంద్రా న్ని నిలదీశారు. 'అమ్మ పెట్టదు అడుక్కు తిననివ్వదు అన్నట్లు ఉంది కేంద్రం తీరు. రూ.ఆరు వేల కోట్లు అప్పుల్లో ఉన్నామని, ఉక్కు తయారీకి ముడి పదార్థాలు నిండుకున్నాయని, ముడిపదార్థాలు కొనేందుకు చిల్లిగవ్వలేదని యాజమాన్యం చేతులు ఎత్తేస్తుంటే.. మోదీకి కనీసం చీమ కుట్టినట్లైనా లేదు. విశాఖ ఉక్కుపై డబుల్ గేమ్ ఆడుతున్నారు. లేదు లేదంటూనే మోదీ తన దోస్తులకు విశాఖ ఉక్కును కట్టబెట్టే కుట్ర చేస్తున్నారు. విశాఖ స్టీల్‌కు రూపాయి సహాయం చేయకుండా వెంటిలేటర్ మీదకు నెట్టారు. త్వరలోనే అదానీ, అంబానీ, జిందాల్ లాంటి వాళ్లకు కట్టబెట్టే ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్లాంట్‌కు పూర్వవైభవం తీసుకురావాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

భద్రత పెంచేలా ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన ద్వారకానాథ్‌రెడ్డి

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా తనకు ఉన్న 1+1 భద్రతను 3+3కి పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పెద్దిరెడ్డి సోదరుడు, తంబళ్లపల్లె వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి వివరాలు ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. ద్వారకానాథ్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్‌కు ప్రాణహాని ఉంది. భద్రత పెంచాలని జూన్ 12న జిల్లా ఎస్పీకి వినతి సమర్పించారు. అయితే ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు' అని తెలిపారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్‌కు ఇప్పటికే 1+1 భద్రతను కల్పించారు. వివరాలు ఇచ్చేందుకు సమయం ఇవ్వాలి' అని కోరారు. దీంతో విచారణను ఆగస్టు 7కి వాయిదా వేశారు.

పెదనాన్నే కాటేశాడు!

- చిన్నారిని చంపి ఇసుకలో పూడ్చేశాడు
- గ్రామస్థులు చితకబాదడంతో విషయం చెప్పిన ఉన్మాది
- శ్రీసత్యసాయి జిల్లాలో అమానుష ఘటన

హిందూపురం, ఆగస్టు 2: వరుసకు పెదనాన్న అయ్యే వ్యక్తి ఉన్మాదానికి ఎనిమిదేళ్ల చిన్నారి బలైపోయింది. సరదాగా నది వద్దకు వెళ్లొద్దామని తీసుకెళ్లి.. చంపేసి ఇసుకలో పూడ్చేశాడు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలంలోని తూముకుంటలో శుక్రవారం ఈ దారుణం చోటు చేసుకుంది. పరిగి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలింత తూముకుంటలోని తన సోదరి ఇంటికి ఇటీవల వచ్చింది. అక్కడ జాతర కావడంతో మంగళవారం తన కూతురు(8)ను కూడా పిలిపించుకుంది. ఆమె సోదరి భర్త గంగాధర్ మాయమాటలు చెప్పి చిన్నారిని శుక్రవారం ఉదయం సమీపంలోని పెన్నానది వద్దకు తీసుకెళ్లాడు. ఎంతసేపటికీ వారు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాలించారు. గ్రామ సమీపంలో గంగాధర్ మద్యం సేవిస్తూ కనిపించడంతో చిన్నారి గురించి ఆరా తీశారు. ఎంత అడిగినా చెప్పకపోవడంతో చితకబాదారు. దీంతో పాపను చంపేసి నది ఒడ్డున ఇసుకలో పూడ్చానని చెప్పాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ పోలీసులు గ్రామానికి చేరుకుని గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ కంజక్షన్, సీఐ శ్రీనివాసులు సమక్షంలో గంగాధర్‌ను నది వద్దకు తీసుకువెళ్లి చిన్నారిని పూడ్చిపెట్టిన స్థలాన్ని గుర్తించి, వెలికితీయించారు. చిన్నారి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఎస్పీ రత్న, ఏఎస్పీ విష్ణు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తూముకుంట ఎస్సీ కాలనీకి చెందిన గంగాధర్(45) గతంలోనూ హత్యలు చేశాడని పోలీసులు తెలిపారు. అతడికి మతిస్థిమితం లేదనీ చెబుతున్నారు. ప్రస్తుతానికి హత్యకేసుగా నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక అత్యాచారం జరిగినట్లు తెలిస్తే అదనపు సెక్షన్లు చేరుస్తామని ఎస్పీ రత్న తెలిపారు.

మదనపల్లె ఫైళ్ల దహనం ఘటనలో..
మున్సిపల్ వైస్ చైర్మన్ చలపతిపై కేసు

- ఈయన పెద్దిరెడ్డి అనుచరుడు.. ఇంట్లో గత నెల 27న సోదాలు
- 22 కీలక డాక్యుమెంట్లు స్వాధీనం... వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్

రాయచోటి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత కేసులో.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతిపై కేసు నమోదు చేశారు. గత ఐదేళ్లలో తమ భూఅక్రమాలు బయటకు రాకూడదనే ఉద్దేశంతోనే గత నెల 21వ తేదీ రాత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు, బినామీలు ఈ ఫైళ్లను కాల్చి బూడిద చేసినట్లు నిర్ధారణ అయింది. పోలీసులు పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుల ఇళ్లలో ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ కోవలోనే జింకా చలపతి ఇంట్లోనూ గత నెల 27న తనిఖీలు చేపట్టి.. సుమారు 22 కీలక డ్యాకుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించిన తర్వాత.. ఫోర్జరీ, ప్రభుత్వ రికార్డుల ఫోర్జరీ, ఫోర్జరీ రికార్డులు ఉంచుకోవడం, దొంగతనం, దొంగ సొత్తు ఉంచుకోవడం, సాక్ష్యాలు చెరిపివేయడం, నిందితులకు సహకరించడం వంటి అభియోగాలతో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని 8 సెక్షన్ల కింద కేసు (ఎఫ్ఐఆర్ నంబరు 137/2024) నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి గత ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్‌లను ప్రభుత్వం సస్పెండ్‌చేసింది. వీరిద్దరితో పాటు సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్నారు. పలువురు అనుమానితులు పరారీలో ఉన్నారు.

ఏపీలో 42,518 మంది ఆశా వర్కర్లు: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 42,518 మంది ఆశావర్కర్లు ఉన్నారని కేంద్రం స్పష్టం చేసింది. శుక్రవారం, లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జిల్లాల వారీగా ఆశావర్కర్ల నియమాకానికి సంబంధించిన వివరాలు కేంద్రం వద్ద ఉండవని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన సమాచారం మేరకు ఆశావర్కర్లు కంటి, ఈఎన్‌టీ, అత్యవసర వైద్య సేవలు, ప్యాలియేటివ్ కేర్ వంటి వాటిలో శిక్షణ పొందినట్లు తెలిపారు.



సీలేరు నదిలో అరుదైన చేప

- మత్స్యకారుల వలకు చిక్కిన 15 కిలోల మాషీర్ చేప

అత్యంత అరుదైన 'శీలావతి' జాతికి చెందిన మాషీర్ చేప శుక్రవారం అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం సీలేరు మత్స్యకారుల వలకు చిక్కింది. మంగంపాడు వద్ద సీలేరు నదిలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఈ 15 కిలోల బరువున్న చేప లభించింది. వీటిని స్థానికంగా గెలస్కోప్ చేపగా పిలుస్తారు. ఇవి హిమాలయాల్లో ఎక్కువగా ఉంటాయని, ఈ జాతి చేప అల్లూరి జిల్లా ఏజెన్సీలో ఉన్నట్టు గతంలో తమ పరిశోధనలో గుర్తించామని ఏయూ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీఈ బాబు చెప్పారు. ఈ చేపను బంగారుశెట్టి అనే మత్స్యకారుడు సీలేరు మార్కెట్‌లో రూ.3 వేలకు విక్రయించాడు. - సీలేరు

షూలో దూరిన పాముపిల్ల



త్రాచుపాము పిల్ల కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం శ్రీనివాసానగర్‌లోని ఓ ఇంట్లో గుమ్మం వద్ద ఉంచిన షూలోకి దూరింది. దానిని గమనించిన ఇంటి యజమాని స్నేక్ క్యాచర్ నరాల శివ(స్నేక్ శివ)కు ఫోన్ చేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న శివ షూలోని పామును చాకచక్యంగా బయటకు తీసి, ఖాళీ వాటర్ బాటిల్‌లో బంధించాడు. - కాకినాడ రూరల్

'ఏడుపు' పెంచెన్!

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీపై అబద్ధాలు, అర్ధసత్యాలు పోగేసిన జగన్ పత్రిక... శుక్రవారం ఊరూరా 'ఏడి'పించన్' అంటూ ఒక రోత కథనాన్ని ప్రచురించింది. రాష్ట్రమంతా పింఛను కష్టాలే ఉన్నాయన్నట్లుగా ఏడ్చేసింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం జోగిరాజుపేటలో చెట్టుకింద పింఛను పంపిణీ చేస్తున్నారంటూ ఒక ఫొటో ప్రచురించింది. అసలు విషయం ఏమిటంటే... ఆ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పి.శ్రీదేవి పింఛన్ల పంపిణీకి వెళ్లారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గురువారం ఉదయం 5.30కే గ్రామానికి చేరుకోవాలనే తొందరలో మందులు వేసుకోవడం మరచిపోయారు. ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేశారు. 10 గంటల సమయంలో శ్రీదేవి నీరసించి కిందపడిపోయారు. స్థానికులు, తోటి ఉద్యోగులు ఆమెను చెట్టు నీడలోకి తీసుకువెళ్లి సపర్యలు చేశారు. ఈలోపు కొంతమంది లబ్ధిదారులు అక్కడకే వచ్చారు. 'ఎలాగూ వచ్చాం కదా! పింఛను డబ్బు ఇక్కడే ఇచ్చేయండి' అని కోరడంతో శ్రీదేవి అక్కడున్న వారికి డబ్బులు ఇచ్చేశారు. కొద్దిసేపటికి కోలుకున్న ఆమె... ఇంటింటికి తిరిగి పింఛన్లు అందించారు. ఇదీ అక్కడ జరిగింది.

వలంటీర్లున్నప్పుడూ అంతే!

- సమస్య తెలిపేందుకే డోలీపై వెళ్లాం
- కొరుప్రోలు గ్రామ గిరిజనులు

అనకాపల్లి జిల్లా కొరుప్రోలుకు చెందిన అప్పారావును పింఛను కోసం 3 కిలోమీటర్లు డోలీలో తీసుకుపోయారు... అంటూ జగన్ పత్రిక మరో ఫొటో ప్రచురించింది. వలంటీర్లున్నపుడు లేని సమస్య ఇప్పుడొచ్చినట్లుగా కలరింగ్ ఇచ్చింది. అసలు విషయం ఏమిటంటే... జగన్ హయాంలోనూ ఎప్పుడూ కొరుప్రోలులో వలంటీర్లు పింఛను పంపిణీ చేయలేదు. ప్రతినెలా లబ్ధిదారులే పంచాయతీ కేంద్రమైన ఎంకే పట్నం వెళ్లి డబ్బులు తెచ్చుకునే వాళ్లమని గ్రామ గిరిజనులు తెలిపారు. తమ సమస్య అందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే డోలీల్లో వెళ్లినట్టు చెప్పారు. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, తహసీల్దార్ సోమశేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు కొరుప్రోలు వెళ్లి పింఛన్‌దారులతో సమావేశమయ్యారు. విషయం ఏమిటంటూ ఆరా తీశారు. దీంతో ఆ గ్రామస్థులు తమ సమస్యను ఏకరువు పెట్టారు. కొరుప్రోలు గ్రామానికి సరైన రహదారి సదుపాయం లేదు. దీనిపై వైసీపీ ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. ఆ గ్రామానికి ద్విచక్ర వాహనాలు తప్ప ఇతర వాహనాలు రాకపోకలు సాగించే వీలు లేదు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకే డోలీలో వెళ్లామని స్థానికులు తెలిపారు. పింఛను కోసం మునుపటిలా ఎంకే పట్నం రానక్కర్లేదని లబ్ధిదారులకు ముందే చెప్పామని సిబ్బంది పేర్కొంటున్నారు. ఆస్పత్రి పని మీద వచ్చామని చెప్పడంతో... అక్కడే పింఛను ఇచ్చామన్నారు.

వలంటీర్లు ఉన్నప్పుడు కూడా రాలేదు

గతంలో ఎన్నడూ గ్రామానికి వచ్చి పింఛన్లు ఇవ్వలేదు. ఐదేళ్ల నుంచి ఎంకే పట్నం వెళ్లే తీసుకుంటున్నాం. వలంటీర్లు ఉన్నా మా గ్రామానికి వచ్చి పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవు.

- గెమ్మిలి ఆనంద్, కొరుప్రోలు

సర్వర్ కోసం ఆగలేక...

చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ మీర్లేపల్లెలో దళితులకు పింఛన్లు ఆపివేశారని జగన్ పత్రిక వాపోయింది. ఇది కూడా అవాస్తవమే. పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి ఆస్గర్ గురువారం మీర్లేపల్లెలో ఉదయం 5.30 నుంచి 8.40లోపు 63మందికి పింఛను పంపిణీ చేశారు. ఈ మధ్యలో సర్వర్ పనిచేయక పోవడంతో కొంత సేపు పంపిణీకి అంతరాయం కలిగింది. ఈలోపే... వైసీపీ మద్దతుదారులు రచ్చ చేశారు. కావాలనే పింఛను పంపిణీలో ఆలస్యం చేస్తున్నారంటూ గొడవ పెట్టుకున్నారు. అంతే తప్ప... 'టీడీపీకి ఓటు వేయలేదని పింఛను ఆపేశారు' అంటూ జగన్ పత్రిక రాసిన రాతలో నిజం లేదని స్థానికులు తెలిపారు.

గెడ్డలను దాటి పింఛన్ల పంపిణీ

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో పలువురు సచివాలయ సిబ్బంది ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటి వెళ్లి మరీ పింఛన్లను పంపిణీ చేశారు. గిన్నెలకోట, ఇంజరి పంచాయతీల్లో 11 గ్రామాల్లోని లబ్ధిదారులకు పింఛను అందించేందుకు తాడు సహాయంతో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ దాటి అవతలికి వెళ్లారు. సచివాలయ సిబ్బంది పీకల్లోతు గెడ్డలో ఈదుకుంటూ వెళ్లి పింఛన్లను సకాలంలో అందించారు. ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించిన సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర సెర్ప్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు అభినందించారు.

ఇంటికే తెచ్చి ఇచ్చారు

రెండు నెలల నుంచి స్థానిక సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తున్నారు. గురువారం కూడా ఇంటివద్దకే వచ్చి డబ్బులు ఇచ్చారు. అందరినీ ఒక చోటికి రప్పించి పింఛన్ అందిస్తున్నారనేది అవాస్తవం.

- కె.వెంకటరమణ, పింఛన్ లబ్ధిదారుడు, జోగిరాజుపేట

పొలాల్లో ఉన్నా ఇచ్చారు



సచివాలయ సిబ్బంది మా ఇంటివద్దకు వచ్చి పింఛన్ డబ్బులు అందించారు. మమ్మల్ని ఎవరూ బయటకు రమ్మని చెప్పలేదు. కొంతమంది లబ్ధిదారులు పొలాల్లో ఉన్నా అక్కడికి వెళ్లి ఇచ్చారు.

- నారాయణమ్మ, జోగిరాజుపేట

అప్పుల కుప్ప ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

26.82 శాతానికి చేరుకున్నాయని ఈ నివేదిక వెల్లడించింది. 2022-23 నాటికి ఏకంగా 36 శాతానికి చేరుకున్నట్లు తెలిపింది. ఏటికేడాదీ వార్షిక రెవెన్యూ లోటు తీవ్రంగా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో ఆర్థిక సేవల వాటా తగ్గిపోయిందని, సాధారణ, సామాజిక సేవల భాగం పెరిగిందని తెలిపింది. 47% వ్యయం సామాజిక సేవలపైనే చేశారని తెలిపింది. వివిధ కీలక రంగాల్లో నిధుల వినియోగం రాష్ట్రంలో చాలా తక్కువగా ఉంది. 2019-20లో 9%, 20-21లో 8%, 21-22లో 7 శాతమే ఆ రంగాలపై ఖర్చుచేశారు. విద్య, క్రీడలు, సాధారణ ఆర్థిక సేవలు, వ్యవసాయం, ఇంధనం, వైద్య ప్రజా ఆరోగ్యం, పరిశ్రమలు, ఖనిజ వనరులు, ఎస్సీలు, బలహీన వర్గాలు, సామాజిక భద్రత, పోషకాహారంపై అతి తక్కువ వ్యయం చేశారు. రాష్ట్రంలో రెవెన్యూ వసూళ్లు కూడా తగ్గిపోయాయి. ఈ వసూళ్లు 2019-20లో 11.49%, 20-21లో 11.55%, 21-22లో 12.83%, 22-23లో 14.27 శాతమే ఉన్నట్లు ఎన్ఐపీఎఫ్‌పీ వెల్లడించింది. రెవెన్యూ వసూళ్ల కంటే రెవెన్యూ వ్యయమే అత్యధికంగా ఉందని తెలిపింది. ప్రజా ఆస్తుల నిర్మాణానికి ఉపయోగించే మూలధన వ్యయం కూడా ఏపీలో బాగా పడిపోయిందని, ఇది జీఎస్‌డీపీలో 2.29 శాతమే ఉందని స్పష్టం చేసింది. రెవెన్యూ వసూళ్లలో సబ్సిడీ శాతం 35.97 శాతం ఉందని తెలిపింది. జీఎస్‌డీపీలో 25 శాతానికి మించి అప్పులున్న రాష్ట్రాల్లో బిహార్, పంజాబ్, యూపీ, బెంగాల్ కూడా ఉన్నాయని వెల్లడించింది.

టీడీపీ ఆఫీసుపై దాడిచేసిన.. మీ కార్యకర్తలపై ఏం చర్యలు తీసుకున్నారు?

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంపై దాడి చేయడాన్ని ఎలా చూడాలని నిలదీసింది. శుక్రవారం కోర్టు సమయం ముగియడంతో విచారణను సోమవారాని(5వ తేదీ)కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఉత్తర్వులిచ్చారు. విచారణ సందర్భంగా పోలీసుల తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా స్పందిస్తూ.. ఏ కారణాలతో కేసు దర్యాప్తులో జాప్యం జరిగింది.. టీడీపీ కార్యాలయంపై దాడిలో నిందితుల పాత్ర, సాక్ష్యాధారాలను జత చేసి కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. మంగళగిరి పరిధిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకదాడి వ్యవహారంలో మంగళగిరి రూరల్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ కార్యకర్తలు జి.రమేశ్, షేక్ రబ్బాని బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, రవిచందర్, వీరారెడ్డి, న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. దాడికి సంబంధించి 2021లో కేసు నమోదైందని.. మూడేళ్ల తర్వాత కొందరి వాంగ్మూలాల ఆధారంగా పిటిషనర్లపై కేసు పెడుతున్నారని.. రాజకీయ వైరంతో ఎంపిక చేసుకున్న వ్యక్తులను ఇందులో నిందితులుగా చేరుస్తున్నారని తెలిపారు. కొందరు వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేసేందుకే కేసు దర్యాప్తును పునఃప్రారంభించారని.. పోలీసులు కేసును సరిగ్గా దర్యాప్తు చేయకుంటే అందుకు పిటిషనర్లను బాధ్యులుగా చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు.



లేవలేని స్థితిలో ఉన్న కృష్ణ తేజ పరిస్థితిని మంత్రికి వివరిస్తున్న కుటుంబ సభ్యులు

90 శాతం వైకల్యం ఉన్నా పింఛను ఇవ్వలేదు

- టీడీపీ కార్యాలయంలో మంత్రికి ఫిర్యాదు
- తక్షణమే పింఛను మంజూరుకు ఆదేశం

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పింఛన్లు, వేధింపులు, ఆరోగ్య సమస్యలు, ఇతర అంశాలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి శుక్రవారం ఎక్కువగా వినతులు వచ్చాయి. విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వినతులు స్వీకరించారు. తన బిడ్డ చుండూరి కృష్ణ తేజకు తొంభై శాతం అంగ వైకల్యం ఉన్నా గత ప్రభుత్వంలో పింఛను ఇవ్వలేదని తండ్రి చుండూరి బాబు ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి వెంటనే పింఛను మంజూరుకు ఆదేశాలు జారీ చేశారు. తన కుమారుడికి వంద శాతం వైకల్యం ఉన్నా నాటి మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే సంతకం ఉంటేనే పింఛను ఇస్తామని అధికారులు చెప్పారని, ఎమ్మెల్యే వద్దకు వెళ్తే సంతకం పెట్టలేదని పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన వాలే వీర నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తన బిడ్డ సునీల్‌కుమార్‌ను ఆస్పత్రికి చికిత్సకు తీసుకువెళ్లి చంపేశారని, అవయవాల కోసం ఈ పని చేశారనే అనుమానం ఉందని, దీనిపై విచారణ జరపాలని విజయవాడకు చెందిన నిర్మలకుమారి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం అగ్రిగోల్డ్ డిపాజిటర్ల సమస్యను పట్టించుకోలేదని డిపాజిటర్లు కొందరు వినతిపత్రం అందజేశారు. వైసీపీ నేతల దౌర్జన్యం వల్ల ధాన్యం వ్యాపారం చేసుకోలేకపోతున్నానని నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన ఆకుల నారాయణ వాపోయారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం సూదివారిపాలెం, అంబటివారిపాలెం గ్రామాలకు ఒకే మంచినీటి చెరువు ఉందని, దానిలో చేపలు పెంచుతూ విషపూరితం చేస్తున్నారని, శుభ్రమైన మంచినీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు. తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా హనుమంతపురంలో వైసీపీ నేతలు దొంగ ఓట్లు వేస్తుంటే అడ్డుకొన్నందుకు ఎస్సై చంద్రమౌళి తనను దుర్భాషలాడి అవమానించాడని తెలిపారు. ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత రమణయ్య నాయుడు కోరారు. పరీక్షలో క్వాలిఫై కాలేనివారికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ఏఎన్ఎంలు కోరారు. గుంటూరు జిల్లాలోని ఐటీసీ కంపెనీలో పనిచేస్తుండగా జరిగిన ప్రమాదంలో చేతి వేళ్లు తెగిపోతే కంపెనీ పరిహారం ఇవ్వలేదని, తనకు మరేదైనా ఉద్యోగం ఇప్పించాలని పల్లపాడుకు చెందిన సాయి మహేశ్ కోరారు.



మిస్ యూనివర్స్ - ఇండియాకు ఏపీ నుంచి అర్హత సాధించిన చందనా జయరాంను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఎంని, చందనా జయరాం కలిశారు. కుప్పంలోని శాంతిపురం మండలం ఎంకేపురానికి చెందిన చందనా ఇటీవల మిస్ యూనివర్స్ - ఇండియాకు ఎంపికయ్యారు.

జగన్ కార్యకర్తలను గెంటేస్తుంటే.. మేం ఎవరొచ్చినా ఆహ్వానిస్తున్నాం!

- వారి సమస్యలు విని పరిష్కరిస్తున్నాం: గొట్టిపాటి

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్‌రెడ్డి తనను కలవడానికి ప్యాలెస్‌కు వస్తున్న వైసీపీ కార్యకర్తలను మెడబట్టి బయటకు నెట్టిస్తున్నారు. మేం మా పార్టీ కార్యాలయంలో ఎవరు కలవడానికి వస్తున్నా సాదరంగా ఆహ్వానిస్తున్నాం. వారు చెప్పినవి వింటున్నాం. అర్జీలు తీసుకుని పరిష్కరించడానికి యత్నిస్తున్నాం. మాకు, ఆయనకు ఇదీ తేడా' అని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యాఖ్యానించారు. శుక్రవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పైశాచికత్వం తాడేపల్లి ప్యాలెస్ వద్ద బయటపడిందన్నారు. 'ప్రజలను కలవడానికి నిర్మించిన ప్రజా వేదికను జగన్ అధికారంలోకి వస్తూనే కూలగొట్టించి సమస్యలు చెప్పుకొనే వేదిక లేకుండా చేశాడు. అధికారం పోయాక ఇంటికి వచ్చిన కార్యకర్తలను హింసించి పంపుతున్నాడు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సమస్యల పరిష్కారానికి టీడీపీ నిరంతరం తన తలుపులు తెరిచే ఉంచుతుంది' అని చెప్పారు. గత కొన్ని రోజుల్లో పది వేల అర్జీలు ప్రజల నుంచి అందాయని, వాటిని పరిష్కరించడంపై దృష్టి పెట్టామని తెలిపారు. 'చిన్న చిన్న కారణాలు చూపించి, అడ్డగోలు నిబంధనలు పెట్టి గత ప్రభుత్వ హయాంలో పేదల పింఛన్లను తొలగించారు. వాటిపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. వైసీపీ నేతల భూ కబ్జాలు, అక్రమంగా ఒకరి భూమి మరొకరి పేరుపై మార్చడం, టీడీపీ శ్రేణులపై అనేక కేసులు మోపడంపైనా ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి' అని చెప్పారు.



టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న పల్లా

సెల్‌ఫోన్ విసిరికొట్టి.. మెడపట్టి గెంటేశారు

- తాడేపల్లిలో జగన్ ప్యాలెస్ వద్ద వైసీపీ కార్యకర్తలకు అవమానం

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు జనానికి పూర్తిగా దూరమయ్యారు. కొద్దిమంది నేతలు, సలహాదారులు మినహా సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకూ ఆయన దర్శనం దొరికేది కాదు. 151 మంది ఎమ్మెల్యేలున్న జగన్ పార్టీని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి, కేవలం 11 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసినా ఆయన మారలేదు. ఇప్పటికీ అదే వైఖరి. జగన్‌ను కలిసేందుకు తాడేపల్లి ప్యాలెస్‌కు వద్దకు వచ్చిన కార్యకర్తలు గంటల కొద్దీ పడిగాపులు కాసినా ఆయన దర్శనం లభించడం లేదు. పైగా ఆయన సెక్యూరిటీ సిబ్బంది కార్యకర్తల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. శుక్రవారం తాడేపల్లి నివాసం వద్ద జగన్‌ను కలిసేందుకు వచ్చిన వైసీపీ కార్యకర్తలకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. కొందరు కార్యకర్తలు జగన్‌ను కలిసేందుకు ప్రయత్నించగా, ఆయన ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ముందస్తుగా ఎంపిక చేసినవారిని మాత్రమే జగన్ వద్దకు పంపాలన్న ఆదేశాలు ఉన్నాయి. దీంతో మిగిలివారిని పంపడం కుదరదంటూ తెగేసి చెప్పారు. దీంతో జగన్‌ను కలిసేందుకు తనకు అనుమతి ఉందని ఒక కార్యకర్త వాదించారు. లోపల ఉన్న నేతతో మాట్లాడాలంటూ నంబర్‌ను డయల్ చేసి సెక్యూరిటీ సిబ్బంది చేతికి సెల్‌ఫోన్ అందించారు. సెక్యూరిటీ గార్డు అది తీసుకుని నేలకు విసిరికొట్టారు. అంతేగాక కార్యకర్త మెడపట్టి గెంటేశారు. ఈ సంఘటనతో అక్కడే ఉన్న కార్యకర్తలు ఆగ్రహం చెందారు. జగన్ బయటకు రావాలంటూ గట్టిగా కేకలు వేశారు. జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సమయంలో మరో యువకుడిని సిబ్బంది తోసివేశారు. ఈ ఘటన మీడియాలో ప్రసారమైనా, సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరిగినా జగన్ స్పందించలేదు. తన నివాసం వద్ద కార్యకర్తలకు అవమానం జరిగినా పెదవి విప్పకపోవడంతో సొంత పార్టీలోనే విమర్శలు వస్తున్నాయి. ఓవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్వయంగా వినతులు తీసుకుంటుంటే.. జగన్ సొంత కార్యకర్తలను కూడా దగ్గరకు రానివ్వడం లేదని విమర్శిస్తున్నారు. ఘోర ఓటమి చవిచూసినా జగన్‌లో మార్పురాలేదని, ఇదే వైఖరిని కొనసాగిస్తే పార్టీకి మనుగడ కష్టమని కొందరు ముఖ్యనేతలు వ్యాఖ్యానిస్తున్నారు. సామాన్య కార్యకర్తల నుంచి అందరిని కలుస్తానని జగన్ ఇటీవల ప్రకటించినా... తనను కలిసేందుకు పార్టీ ముఖ్యనేతలు రాకపోవడంతో ఆయనలో అసహనం పెరుగుతోందని అంటున్నారు. అయితే ముందుగా ఎంపిక చేసిన కార్యకర్తలను ప్యాలెస్‌కు రప్పించి.. సామాన్యులను, కార్యకర్తలను జగన్ పేరుపేరునా పలుకరిస్తున్నారని వైసీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారు.



జగన్ ఇంటి వద్ద వైసీపీ కార్యకర్త ఫోన్‌ను విసిరి కొడుతున్న దృశ్యం

వైసీపీ నేత భూ దందా

- కబ్జాకు యత్నం.. కత్తితో బెదిరింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలో ఘటన

అనకాపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో భూ కబ్జాలు ఆగడం లేదు. తాజాగా రాంబిల్లి మండలం హరిపురంలో విశాఖ వాసికి చెందిన స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ వైసీపీ నాయకుడు యత్నించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ భూకబ్జా ఉదంతంపై బాధితుడి ఫిర్యాదు మేరకు రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ నరసింగరావు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖకు చెందిన అమరకవి 2004లో రాంబిల్లి మండలం హరిపురం గ్రామ పరిధిలోని సర్వే నంబరు 102లో 1.03 ఎకరాలు కొనుగోలు చేశారు. దీనిలో 43 సెంట్లు ఇతరులకు విక్రయించి, మిగిలిన భూమిని చూసుకునే బాధ్యతను అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలో ఉంటున్న తన మేనల్లుడు శ్రీమంతుల నవీన్‌కుమార్‌కు అప్పగించారు. ఆ స్థలంలో గత నెల 27న పనులు చేయిస్తుండగా.. యలమంచిలి వైసీపీ నాయకుడు కర్రి శివశంకర్ గణేశ్‌రావు మరో 20 మందితో వెళ్లి అడ్డుకున్నారు. మా స్థలంలోకి ఎందుకు వచ్చారంటూ శివశంకర్‌ను నవీన్ కుమార్ నిలదీశారు. దీంతో శివశంకర్ బృందం నవీన్ కుమార్‌పై దాడి చేసి.. కొట్టడమే కాకుండా తనతో తెచ్చుకున్న కత్తితో చంపుతానని బెదిరించారు. నవీన్‌కుమార్ గురువారం రాంబిల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జీతాలు, పింఛన్ల కింద.. ఒక్క రోజే 8 వేల కోట్లు

- 64 లక్షల మంది పేదలకు రూ.2,737 కోట్లు పంపిణీ
- ఒకేరోజు 97.54% మందికి సామాజిక పింఛన్లు రికార్డు: బాబు

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, రిటైరైన ఉద్యోగులకు పెన్షన్లు, పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద ఈ నెల ఒకటో తేదీన ఒక్క రోజే రూ.8 వేల కోట్లు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ముఖ్యంగా 64 లక్షల మంది పేదలకు ఒక్క రోజే సామాజిక పింఛన్ల రూపంలో రూ.2,737 కోట్లు పంపిణీ చేశామని శుక్రవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులో రికార్డు స్థాయిలో 97.54 శాతం మందికి పింఛన్లు అందించాం. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల ఆర్థిక భద్రత మా బాధ్యత. పెరిగిన పింఛను ఆ పేదల జీవితాలకు భరోసా కల్పిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నాం. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగం. ప్రజలకు ఏ మంచి చేయాలన్నా వారే కీలకం. అలాంటి వర్గానికి కూడా ఒకటే తేదీనే జీతాలు అందజేశాం. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా పెన్షన్ చెల్లించాం. ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలు అనేకం ఉన్నా ఉద్యోగుల జీతాలు, పింఛన్ల కోసం రూ.5,300 కోట్లు విడుదల చేసి మొదటి తేదీనే వారికి దక్కే ఏర్పాటు చేశాం. రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర కీలకం. ఉద్యోగులతో పని చేయించుకోవడంతో పాటు వారి సంక్షేమం చూస్తూ గౌరవం ఇచ్చే ప్రభుత్వం మా కూటమి ప్రభుత్వం' అని తెలిపారు. కలిసి కష్టపడదాం.. రాష్ట్ర భవిష్యత్‌ను మారుద్దామని వారికి పిలుపిచ్చారు.

చంద్రబాబు మడకశిర పర్యటన తీరు భేష్

- తరలింపుల్లేకుండా సాదాసీదాగా సీఎం కార్యక్రమం: రఘువీరా



మడకశిర, ఆగస్టు 2: ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిరలో సభ నిర్వహించిన తీరు అద్భుతమంటూ సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా నీలకంఠాపురంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు మడకశిరకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఒక ప్రభుత్వ కార్యక్రమాన్ని చాలా సాదా సీదాగా నిర్వహించారు. బలవంతపు తరలింపులు లేకుండా సభను నిర్వహించడం అభినందనీయం. భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను ఏ ప్రభుత్వమైనా ఇదే తరహాలో నిర్వహించడం మంచిది' అని రఘువీరా సూచించారు. 'పేదలకు న్యాయం జరగాలంటే కేంద్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే కుల గణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేరళలో భారీ వర్షాలకు వందలాది మంది చనిపోవడం చూసి రాహుల్‌గాంధీ చలించి పోయారని రఘువీరా అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



మాట్లాడుతున్న చిత్ర నిర్మాత కొణిదెల నిహారిక

నగరంలో కమిటీ కుర్రోళ్లు సందడి

లబ్బీపేట: నగరంలో కమిటీ కుర్రోళ్ళు చిత్ర బృందం సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగాంగా బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో విలేక రుల సమావేశంలో చిత్ర నిర్మాత కొణిదెల నిహారిక మాట్లాడారు. యదు వంశీ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కిందని, 20మంది కొత్తవాళ్ల పరిశ్ర మకు పరిచయమవుతున్నారని ఆమె తెలిపారు. ఆగస్టు 9వ తేదీన చిత్రం విడుదలవుతోందని, విజయవంతం చేయాలని కోరారు. తమిళంలో తాను హీరోయిన్‌గా నటించిన చిత్రం వచ్చే నెలలో విడుదల కానుందని, మంచి కథ దొరికితే తెలుగులో నటించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గోదా వరి జిల్లాల్లోని ఒక ఊరిలో 90స్ కిడ్స్ చిత్రమే ఇది అని డైరెక్టర్ యదు వంశీ తెలిపారు. చిత్ర నటీనటులు పాల్గొన్నారు.

పునఃప్రారంభం కానున్న అశోక్ లేల్యాండ్

● ప్రభుత్వం సహకరిస్తే సంస్థను ప్రారంభిస్తామన్న చైర్మన్ ధీరజ్ జి.హిందుజా: ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, ఆగస్టు 2: కృష్ణాజిల్లా బాపులపాడు మండలం, మల్లవల్లిలో గత ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా మూసివేసిన అశోక్ లేల్యాండ్ ప్లాంట్‌ను పునఃప్రారంభించేందుకు యాజమాన్యం సిద్ధమవుతోందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లవల్లిలో ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని జూలై 29వ తేదీన కంపెనీ చైర్మన్ ధీరజ్ జి.హిందుజాకు లేఖ రాశానని తెలిపారు. అందులో సీఎం చంద్రబాబు పారిశ్రామికాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించానని, ప్లాంట్ ప్రారంభిస్తే 5 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నానని తెలి పారు. దీనిపై సంస్థ చైర్మన్ సానుకూలంగా స్పందించారని, మల్లవల్లిలో బస్సు బాడీబిల్డింగ్ యూనిట్‌ను స్థాపించడం తమ లక్ష్యమని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అవసరమని హిందూజా కోరారని పేర్కొన్నారు. సంస్థ యాజమాన్యం త్వరలో రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌ను కలుస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి తమ మద్దతు ఇవ్వటానికి ఆసక్తిగా ఉన్నట్లు సంస్థ తెలిపిందని స్పష్టం చేశారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అశోక్ లేల్యాండ్ పునఃప్రారంభంలో కీల కంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

రెస్టారెంట్లపై జీఎస్టీ విధానాన్ని సవరించాలి


మంత్రి పయ్యావుల కేశవ్‌తో సౌత్ ఇండియా హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

వన్‌టౌన్, ఆగస్టు 2: రాష్ట్రంలోని హోటల్స్ రెస్టారెంట్లపై ప్రస్తుతం విధిస్తున్న జీఎస్టీలో సవ రణలు చేయాలని సౌత్ ఇండియా హోటల్స్, రెస్టా రెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్ర వారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి విన్నవించారు. ఫెడరేషన్ ఆఫ్ హోటల్, రెస్టారెంట్స్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా అపెక్స్ సంస్థగా సౌత్ ఇండియా హోటల్స్, రెస్టా రెంట్స్ అసోసియేషన్ దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తోందని ప్రతి నిధులు తెలిపారు. హోటల్ ప్రాంగణంలో ఉన్న రెస్టారెంట్లలో యూనిట్‌కు రోజుకు రూ.7,500 కంటే తక్కువ టారిఫ్‌తో ఉన్నచోట వసతి, ఆహారం, పానీయ సేవల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ లేకుండా 5 శాతం జీఎస్టీ, రూ. 7,500 అంత కంటే ఎక్కువ ఉన్నచోట పూర్తి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ హెడ్డింగ్ కింద 18 శాతం జీఎస్టీ వసూలు చేసే ప్రస్తుత పద్ధతికి సవరణ అవసరమ న్నారు. రెస్టారెంట్ ఫుడ్ సర్వీసుల జీఎస్టీ పన్నును గది ధరల నుంచి వేరు చేయాలని కోరారు. రెస్టారెంట్లపై ఇన్‌పుట్ క్రెడిట్ లేకుండా 5 శాతం, ఇన్ పుట్ క్రెడిట్‌తో 12 శాతం మేరకు వసతి టారిఫ్‌తో సంబంధం లేకుండా జీఎస్టీ విధించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యక్షుడు కె. శ్యామరాజు తదితరులు ఉన్నారు.

బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కృషి


కమిషనర్ ధ్యానచంద్రకు మొక్కను అందజేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

వన్‌టౌన్ ఆగస్టు 2: బిల్డర్ల సమస్యలను తెలియజేస్తే వాటి ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని విజయవాడ మునిసి పల్ కమిషనర్ ధ్యానచంద్ర హామీ ఇచ్చారు. బిల్డర్స్ అసో సియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వ రరావు, అమరావతి సెంటర్ జనరల్ సెక్రటరీ బి. శివకుమార్ పట్నాయక్, ఆర్కిటెక్చర్ ఇంజనీర్ సత్యనారాయణ, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ తదితరులు శుక్రవారం కమిషనర్‌ను ఆయన చాంబర్ లో కలిశారు. విజయవాడ కమిషనర్‌గా వచ్చినందుకు ఆయనకు శుభాకాం క్షలు తెలిపారు. బిల్డర్ల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

డీఆర్ఆర్ స్టేడియం పరిశీలన

విజయవాడ స్పోర్ట్సు: ఒలింపిక్స్‌లో పోటీపడే స్థాయిలో క్రీడాకారులకు కోచింగ్ ఇప్పించాలని డీఆర్ఆర్ స్టేడియం అధికారులకు వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర సూచించారు. ఎంజీ రోడ్డులోని దండమూడి రాజగో పాలరావు స్టేడియాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. క్రీడాకారులకు అందుతున్న వసతులపై ఆరాతీశారు. క్రీడా నైపుణ్యం పెంచేలా నగరపాలక సంస్థ ఎప్పుడూ సౌకర్యాల కల్పనకు కృషి చేస్తోందన్నారు. స్టేడియంలో మర మ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిమ్‌ను, బ్యాడ్మింటన్ కోర్టులను పరిశీలించారు. కమిషనర్ వెంట డీఎఫ్‌వో, వీఎంసీ స్పోర్ట్సు ఇన్‌చార్జి డి.మాల్యాద్రి, ఎస్ఎఫ్‌వో ఎం.రాజా, కేడీబీఏ సెక్ర టరీ పర్సా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికలపై హింసను తగ్గించడమే ధీర లక్ష్యం

● ఆయుష్ హాస్పిటల్‌లో ప్రచార కార్యక్రమం ప్రారంభం


మాట్లాడుతున్న డాక్టర్ కె. గీతాదేవి

భారతీనగర్: మహిళలు, బాలికలపై హింసను తగ్గించ డంతోపాటు విద్యార్థులకు, యువకులకు, సమాజానికి అవగాహన కల్పించడమే ధీర ప్రచార కార్యక్రమం లక్ష్యమని ఆయుష్ హాస్పిటల్ కన్సల్టెంట్, ఒబెస్ట్రిక్స్ అండ్ గైనకాలజీ డిపా ర్ట్మెంట్ హెడ్ డాక్టర్ కె.గీతాదేవి అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఒబెస్ట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళలపై జరుగు తున్న హింసను ఎదుర్కోవడానికి ధీర ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం ఆయుష్ హాస్పిటల్‌లో ప్రారంభించారు. ఆయుష్ హాస్పిటల్ కన్సల్టెంట్, ఒబె స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ కె. గీతాదేవి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శారద విద్యాసంస్థల బాలికలు 400 మంది పాల్గొన్నారు.

సత్తా చాటిన సందీప్

● మూడ్రోజుల మ్యాచ్‌లో 404 పరుగులతో అజేయంగా నిలిచిన కృష్ణా బ్యాటర్


వై.సందీప్

విజయవాడస్పోర్ట్సు, ఆగస్టు 2: మూల పాడు క్రికెట్ స్టేడియం వేదికగా పరుగుల వరద పారించి 2015 నుంచి ఎవ్వరూ సాధించని ఫీట్ 404 పరుగులతో కృష్ణా యువ బ్యాటర్ వై సం దీప్ అజేయంగా నిలిచాడు. ప్రకాశంతో జరు గుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ పురు షుల క్రికెట్‌లో 167 పరుగుల వ్యక్తిగత ఓవర్‌నైట్ స్కోర్‌తో శుక్రవారం బరిలో దిగిన సందీప్ ఆట ముగిసే సమయానికి 471 బంతుల్లో 58 ఫోర్లు, 8 సిక్స్‌లతో 404 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 715/9 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. తర్వాత బరిలో దిగిన ప్రకాశం జట్టు 8 ఓవర్లలో వికెట్ నష్టానికి 37 పరుగులను చేసింది. రోహిత్ 29 పరుగులతో నిలిచాడు.


సారె తీసుకొస్తున్న భక్తులు

దుర్గమ్మకు ఆషాఢ సారె

వన్‌టౌన్, ఆగస్టు 2: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆషాఢమాస సమర్పణల కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. ఆదివారం అమావాస్యతో ఆషాఢమాసం ముగుస్తోంది. దీంతో సారె సమర్పించేందుకు వచ్చే భక్త బృందాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. శుక్రవారం 25 బృందాలకు చెందిన 550 మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం తరపున ఈవో, డిప్యూటీ కలెక్టర్ ఎల్.రమాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. ఆమెకు దుర్గగుడి ఈవో రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంత్ డైమెండ్స్ బృందం 50 మంది, వైజాగ్‌కు చెందిన వల్లూరి మహేష్ బృందం 30 మంది, హైదరాబాద్‌కు చెందిన వెంకటనారాయణ బృందం 26 మంది, విజయవాడ లక్ష్మీనగర్‌కాలనీ బృందం 50 మంది, రాజరాజేశ్వరిపేట కె.సునీత బృందం 30 మంది, నరసరావుపేట పావని బృందం 25 మంది అమ్మవారికి సారె సమర్పించారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో భక్తుల రద్దీ ఏర్పడింది.

స్వర్ణ తాపడానికి రూ.లక్ష విరాళం

అనంతపురం అరవింద్‌నగర్‌కు చెందిన బి.క్రియాన్ష్ లోకేరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి విచ్చేసి డోనర్ సెల్ ద్వారా ఆలయ గోపురం స్వర్ణ తాపడానికి రూ.1,01,116 విరాళం అందజేశారు.


కొణెదల నిహారికకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సేవలో నిహారిక

చిత్రనటి, నిర్మాత కొణెదల నిహారిక శుక్ర వారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలి కారు. దర్శనం అనంతరం ఈవో రామారావు ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. కమిటీ కుర్రోళ్లు సినిమా బాక్సా ఫీసు వద్ద విజయవంతం కావాలని ఆమె అమ్మవారిని కోరుకున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

● తల్లిపాల వారోత్సవాల్లో కలెక్టర్ జి.సృజన


అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 2: పుట్టిన నాటి నుంచి తల్లి పాలు ఇవ్వడం బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని చనుబా లకు మించిన ఔషధం మరొకటి లేదని తల్లిపాలపై అవగా హన కల్పించేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని కలె క్టర్ జి.సృజన తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం క్రీస్తురాజపురంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణు లకు సీమంతాలు చేసి, పౌష్టికాహారం పంపిణీ చేశారు. మహిళా శిశు సంక్షేమం, అంగన్వాడీల నిర్వహణపై ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, ఆయన ఆలోచనలకు అనుగుణంగా ప్రైవేట్ నర్సరీ స్కూళ్లకు దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 1,475 అంగన్వాడీల ద్వారా 10,251 మంది గర్భిణులు, 125 మంది బాలింతలు, 7 నెలల నుంచి 3 ఏళ్ల వయసు 50,0633 మంది చిన్నారులు, 3 నుంచి 6 ఏళ్లున్న 48,009 చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహా రం అందిస్తున్నా మని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జి.ఉమాదేవి, సీడీపీవో జి.మంగమ్మ, సూపర్‌వైజర్ రెహాన, పిన్న మనేని సిద్ధార్థ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర పద్మజచౌదరి, జూనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, డాక్టర్ శశి, డాక్టర్ దీప్తి, డాక్టర్ శ్రీతేజ, సోషల్ వర్కర్ నిస్సార్ బేగం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వరలక్షణాలుంటే పరీక్షలు చేయించుకోండి


బిళ్లనపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 2: "దోమలు విజృంభించకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లా ర్చిన నీటినే తాగాలి. జ్వర లక్షణాలుంటే వెంటనే వైద్య సిబ్బంది సహకారంతో డెంగ్యూ, మలేరియా, డయే రియా పరీక్షలు చేయించు కోవాలి." అని ప్రజలకు ప్రజా రోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజారోగ్య పరిరక్షణపై అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె సూచిం చారు. బిళ్లనపల్లిలో అనారోగ్య కారణాలతో ఇటీవల వ్యక్తి మృతి చెందడంతో వైద్యాధి కారులతో కలిసి శుక్రవారం ఆమె గ్రామంలో పర్యటించారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రిపోర్టులను పరిశీలించారు. తాగునీరు, క్లోరినేషన్, ఫాగిం గ్‌పై సర్పంచ్ వెలివెల రామకృష్ణ, కార్యదర్శి సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ ఫీవర్‌సర్వే నిర్వహించాలని ఆదేశించారు. బీఎల్ఎన్ కుమార్, జిల్లా మలేరియా అధికారి రామారావు, వైద్యాధికారి మంజూష, సబ్ యూనిట్ అధికారి వెంకటరాజు, సీహెచ్ఎం ఫణికుమార్ పాల్గొన్నారు.

విజయవాడ ఆర్పీఎఫ్ జట్టుకు అభినందన


టైటిల్ కైవసం చేసుకున్న ఆర్పీఎఫ్ జట్టుతో అధికారులు

రైల్వేస్టేషన్, ఆగస్టు 2: విజయవాడ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) జట్టు ఇంటర్ డివిజనల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగోవసారి టైటిల్‌ను కైవసం చేసుకో వడంతో జట్టు సభ్యులను, కెప్టెన్‌ను, మేనేజర్, కోచ్ లను సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి తోకల, విజయ వాడ డివిజన్ సెక్యూరిటీ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదనరావు శుక్రవారం అభినందించారు. విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ జట్టు అవిశ్రాంత కృషిని ప్రశంసిం చారు. భవి ష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గుంతకల్లు డివి జనల్‌లో కిందటి నెల 29 నుంచి 31వ తేదీ వరకు జరిగిన డివిజనల్ వాలీ బాల్ టోర్నమెంట్‌లో విజయవాడ - గుంతకల్ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. గుంతకల్ జట్టును 3-0 స్కోరుతో విజయవాడ జట్టు ఓడించింది. 25 -19, 25-11, 25-14 స్కోర్లతో విజయవాడ ఆర్పీఎఫ్ జట్టు తన ఆధిపత్యాన్ని చాటుకొని చాంపి యన్ షిప్ కైవసం చేసుకుంది.

ప్రైవేట్ బ్యాంక్ రికవరీ ఏజెంట్ ఆత్మహత్య

● పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో

● రూ.లక్షన్నర అప్పు ఇప్పిస్తే తిరిగి చెల్లించలేదని ఇద్దరు స్నేహితులపై ఆరోపణ



గుదే అఖిల్ (ఫైల్), కంకిపాడు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

కంకిపాడు, ఆగస్టు 2: "స్నేహితులు అప్పు కావా లంటే మరో స్నేహితుడి వద్ద ఇప్పించాను. తిరిగి ఇవ్వమంటే అప్పు తీసుకున్న వారు ఇవ్వడం లేదు. నేను అప్పు ఇప్పిం చిన స్నేహితుడు నాపై ఒత్తిడి తెస్తున్నాడు. ఏం చేయాలో అర్థం కావడం లేదు."అంటూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరి గింది. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గుదే అఖిల్(28) గుడివాడ లోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో రికవరీ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అఖిల్‌కు స్నేహితులైన పామర్తి కృష్ణ, వీరంకి వంశీ కుమార్‌కు ప్రశాంత్ అనే మరో మిత్రుడు వద్ద నుంచి రూ.1.50 లక్ష అప్పుగా ఇప్పించాడు. అయితే కృష్ణ, వంశీ తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని అఖిల్‌పై ప్రశాంత్ ఒత్తిడి తెచ్చాడు. దీంతో తన వద్ద డబ్బులు తీసుకున్న కృష్ణ, వంశీ ఇవ్వకపోవడం, డబ్బుల కోసం ప్రశాంత్ ఒత్తిడి అధికమవడంతో అఖిల్ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే సమయంలో అఖిల్ సెల్ఫీ వీడియో తీశాడు. కృష్ణ, వంశీలు తనను మోసం చేశారని, డబ్బు తిరిగి ఇవ్వాలని ఎన్నిసార్లు ప్రాధేయపడినా పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో విషయం బయ టకు వచ్చింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వా స్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తాతాచార్యులు తెలిపారు.

అఖిల్ కుటుంబానికి న్యాయం చేయాలి

అఖిల్‌కు కుటుంబానికి న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. అఖిల్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతికి కారణమైన కృష్ణ, వంశీని తక్షణం అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. ఉదయం నుంచి ఆందోళన చేస్తున్నా తమను పట్టించుకోరా అంటూ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కంకిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.శ్రీని వాసరావు, ఎస్సై తాతాచార్యులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు.


వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీధర్ మాదిగ

మాదిగలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ మానికొండ శ్రీధర్

ధర్నాచౌక్, ఆగస్టు 2: దేశంలోని మాదిగలకు, మాదిగ ఉప కులాలకు ఆగస్టు 1న నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ మానికొండ శ్రీధర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు శుక్రవారం ఆయన పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణను త్వరితగతిన అమలు చేయాలని సీఎం చంద్రబాబును ఆయన కోరారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మంద కృష్ణమాదిగ తన ఖాతాలో వేసుకుని సంబరాలు చేయడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు.

మాదిగ సంఘాల జేఏసీ హర్షం

ధర్నాచౌక్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై మాదిగ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో జేఏసీ నేత కాండ్రు సుధాకర్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ మూడు దశబ్దాలుగా పోరాటం సాగిందన్నారు. ఎస్సీలో ఒక సామాజికవర్గమే ఫలాలు పొందుతుందని దీంతో వి ఎగతా మాదిగ, మాదిగ ఉప కులాలు అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు తీర్పుతో వర్గీకరణకు మార్గం సుగమమైందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, రాజ్యాంగ రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమా నంగా అందించాలని మాజీ డిప్యూటీ మేయర్ సిరిపురపు గ్రిటన్ కోరారు. ఎమ్మార్పీ ఎస్ ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు. చింతా శాంతకుమార్, అప్పికట్ల జీవరత్నం, కాంపాటి రాజ్‌కుమార్, బూతపాటి ఫిలోమాన్, మందా వెంకటే శ్వర రావు మాదిగ, నూకపోగు యేసు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు వీసీబీ ప్రతిభా పురస్కారాలు


పురస్కార గ్రహీతలతో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు యాజమాన్యం

పటమట: 2023-24 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన వీసీబీ సభ్యుల పిల్లలకు రూ.31.85 లక్షలతో విద్యా ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్(వీసీబీ) డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు తెలిపారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు శుక్రవారం మొగల్రాజపురంలోని శారదా కళాశా లలో వీసీబీ పాలకవర్గసభ్యులు అజయ్, బి.రామచంద్రరావు అవార్డులను అందిం చారు. పదో తరగతిలో నూటికి 90 శాతం పైగా మార్కులు సాధించిన ఎస్. మోక్షి త్‌వెంకటసాయి(574), సాయిశ్రీ పేరం(471), ఇంటర్ విద్యార్థిని ఆశ్ర ఫాతిమా (941), ఎం.గుణశేఖర్(918), ఆర్.గీతశ్రీవల్లి(932)కి చెక్కులు, మెమొంటోలు, ప్రశంసాపత్రాలను కోటేశ్వరరావు, అజయ్, బి.రామచంద్రరావు, జీఎం జీవీ రావు, జోనల్ మేనేజర్ సి.సుబ్రహ్మణ్యం అందజేశారు. 2005 నుంచి తమ బ్యాంక్ వి ద్యా ప్రతిభా పురస్కారాలు అందజేస్తుందని కోటేశ్వరరావు తెలిపారు. గత 19 సంవత్సరాల్లో 4,745 మందికి రూ.21.36 కోట్ల విలువైన చెక్కులను అందజేశామని వివరించారు. బ్యాంకు సభ్యులు పిల్లల చదువులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీకే విద్యా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

నార్త్ ఏసీపీగా రాజారావు బాధ్యతల స్వీకరణ



విజయవాడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : విజయ వాడ ఉత్తర మండలం ఏసీపీగా ఎం.రాజారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతిలో పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఉత్తర మండలంలో పనిచేస్తున్న డీఎస్పీ ప్రసా ద్‌ను ఇటీవల జరిగిన బదిలీల్లో డీజీపీ కార్యాలయానికి పంపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాజారావు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును కలిశారు. సెంట్రల్ జోన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కె.దామోదర్ కూడా సీపీని కలిశారు.


డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్, చెన్నుపాటి శ్రీనివాస్

మర్యాదపూర్వక కలయిక

పెనమలూరు, ఆగస్టు 2: డీజీపీగా బాధ్యతలు స్వీక రించిన ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీతో కాసేపు చర్చించారు. ఆయన వెంట టీడీపీ నేత చెన్నుపాటి శ్రీనివాస్ ఉన్నారు.

వృద్ధురాలిని బెదిరించి గొలుసు, సెల్‌ఫోన్ అపహరణ

వన్‌టౌన్, ఆగస్టు 2: కొత్తపేట పోలీస్ స్టేషన్ పరి ధిలో కలరా హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఒక అపార్ట్మెం ట్‌లో శుక్రవారం ఉదయం వృద్ధురాలిని బెదిరించి, కొట్టి ఆమె మెడలో గొలుసు, సెల్‌ఫోన్‌ను దుండగుడు అపహ రించాడు. గాయాలతో ఉన్న వృద్ధురాలు ఒక ప్రైవేటు ఆస్ప త్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం తెలుసుకున్న వెస్ట్ డీసీపీ హరికృష్ణ, కొత్తపేట పోలీసులు వృద్ధురాలి నివా సానికి వెళ్లి పరిశీలించారు. పోలీసు జాగిలాలను తీసుకు వెళ్లారు. చికిత్స పొందుతున్న వృద్ధురాలు చీమకుర్తి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. "ఇంట్లో నేను ఒక్కదాన్నే ఉం టున్నా. శుక్రవారం ఉదయం బయట కూరగాయలు అమ్మే వ్యక్తి వద్ద గోంగూర కొనుగోలు చేసి అతనికి డబ్బులు ఇద్దా మని లోపలకు వెళ్లా. ఇంతలో అమాంతంగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నా రెండు చేతులను గట్టిగా పట్టుకు ని బలంగా పిడిగుద్దులు గుద్దాడు. దాంతో స్పృహతప్పి కిం దపడిపోయా. కొద్దిసేపటి తర్వాత నా ఇంటిపైన కాపుర ముంటున్న కోటేశ్వరమ్మను పిలిచా. నా ముఖంపై ఉన్న రక్తం మరకలను కోటేశ్వరమ్మ గమనించి కంగారుపడింది. నా రెండో కూతురు మిధునకు ఫోన్ చేసి విషయం చెప్పిం ది. దుండగుడు నా మెడలోని మూడు కాసుల బంగారు గొలుసు, శ్యామ్‌సంగ్ సెల్‌ఫోన్‌ను అపహరించుకు పోయా డు. తరువాత నా అన్న సీతారాం వచ్చి చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు." అని సంధ్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై కేసు

విద్యాధరపురం, ఆగస్టు 2: శివాలయం సెంట ర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తనపై స్కూల్ ప్రిన్సిపాల్ అన్నదాసు శ్రీనివాసరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని విద్యార్థిని ఇచ్చిన ఫిర్యా దుపై శుక్రవారం రాత్రి భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. భవానీపురానికి చెందిన విద్యార్థిని ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆ స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థిని పట్ల లైంగిక వేధింపులకు పాల్పడడంతో విషయాన్ని విద్యా ర్థిని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు, బంధువులు, కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. అనంతరం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవానీపురం సీఐ ఉమా మహేశ్వరరావు తన సిబ్బందితో ఘటనా ప్రాంతానికి వెళ్లి విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల నుంచి వి వరాలు సేకరించారు. పోలీసులు ప్రిన్సిపాల్ శ్రీనివాసరా వును అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో ప్రిన్సిపాల్ రాజీ చేసుకునే విధంగా ఓ నాయకుడు ప్రయ త్నించినట్లు తెలిసింది. అందుకు బాలిక తల్లిదండ్రులకు కొంత నగదును ఆశజూపినట్టు తెలిసింది. గతంలో కూడా ప్రిన్సిపాల్ ఇద్దరి బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేసినా సరిగా స్పందించలేదని వి ద్యార్థుల తల్లిదం డ్రులు ఆరోపిస్తున్నారు.


పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న హజరత్తయ్య

పింగళికి ఘన నివాళి

ధర్నాచౌక్, ఆగస్టు 2: ప్రతీ భారతీయుడు దేశభక్తి కలిగి గాంధీ, పింగళి వెంకయ్య అడుగుజాడల్లో నడవాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య పిలుపునిచ్చారు. జాతీయ ఉద్య మాల్లో ప్రధానపాత్ర పోషించడంతో పాటు జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య జయంతిని ప్రభుత్వం నిర్వహించాలని ఆయన కోరారు. పింగళి వెం కయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థ, రాష్ట్ర నటీనట, నాట్య వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం నిర్వహించారు. బాపు వి క్టోరియా మ్యూజియంలోని పింగళి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవీ, వెంకయ్య కోడలు పింగళి సుశీలమ్మ, ఎన్జీవో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి రాంబాబు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య కృషి గుర్తుండిపోతుంది: ప్రధాని మోదీ

» తెలుగు జాతికి ఎనలేని గౌరవాన్ని తెచ్చిన పింగళి: చంద్రబాబు

» నిత్యస్ఫూర్తి ప్రదాత పింగళి: పవన్



న్యూఢిల్లీ, అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 'మనకు త్రివర్ణ పతాకాన్ని అందించడంలో పింగళి వెంకయ్య చేసిన కృషి ఎన్నటికీ గుర్తుండిపోతుంది' అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. శుక్రవారం పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ నెల 9 నుంచి 15 వరకు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా ఉద్యమానికి మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు.దేశ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. 'జాతీయ పతాకం రూపంలో ఆయన భారత జాతి చేతికి ఒక ఆత్మ గౌరవ ప్రతీకను అందించారు. ప్రతి ఒక్కరూ గర్వించే... నిత్యం స్ఫూర్తిని చాటే మువ్వన్నెల జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుని దేశ సేవను స్మరించుకొందాం' అని ఆయన ట్విట్టర్లో పేర్కొన్నారు. భారత దేశానికి జాతీయ పతాకాన్ని అందించి నిత్యస్ఫూర్తిని రగిలించిన పింగళి వెంకయ్యను భరతజాతి ఎప్పటికీ మరువదని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం పింగళి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నట్లు తెలిపారు. జాతీయపతాకానికి సెల్యూట్ చేసిన ప్రతిసారి పింగళి స్ఫురణకు వస్తూనే ఉంటారన్నారు.

మచిలీపట్నం మెడికల్ కాలేజీకి పింగళి పేరు పెట్టాలి: బాలశౌరి

పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఘన నివాళులు అర్పించారు. పింగళి వెంకయ్య మచిలీపట్నం ప్రాంతంలో పుట్టడం మన అదృష్టమని, మచిలీపట్నంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీకి పింగళి వెంకయ్య పేరు పెట్టాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఈ విషయమై గతంలో సీఎం జగన్‌కు కూడా లేఖ రాశానని, అయితే పింగళి పేరు పెట్టకుండా అప్పటి ఎమ్మెల్యే పేర్ని నానీ అడ్డుకున్నారని బాలశౌరి చెప్పారు.

2029 ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి

» ఎన్నారై టీడీపీకి మంత్రి అనగాని సూచన



మంత్రి అనగానితో టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధులు

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి విజయానికి కీలకంగా పని చేసిన ఎన్నారై టీడీపీ ప్రతినిధులు ఇక నుంచి 2029 ఎన్నికలు లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో తనను కలసిన ఎన్నారై టీడీపీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. తమ బృందం ఎన్నారై టెక్ బ్రెయిన్స్ పేరుతో 2024 ఎన్నికల సమయంలో చేసిన కృషిని మంత్రికి వివరిస్తూ... కూటమి అభ్యర్థుల గెలుపు కోసం 1.80 కోట్ల మందికి వాట్సాప్ మెసేజ్‌లు పంపామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్ స్పందిస్తూ... 'ఎన్నారై టీడీపీ సభ్యులు ఎంతో శ్రమకోర్చి, డబ్బులు ఖర్చు పెట్టుకుని, పార్టీ కోసం కష్టపడ్డారు. వారి సేవల్ని ఎప్పటికీ మరువబోము' అని అన్నారు. '2029 లక్ష్యంగా గ్రీవెన్స్ యాప్‌ను రూపొందిస్తున్నాం. ఈ యాప్ ద్వారా ప్రతి మంత్రి, నాయకుడు తమ వద్దకు వచ్చే వినతులను వేగంగా పరిష్కరించగలుగుతారు. తద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగి, రానున్న ఎన్నికల్లో లబ్ధి చేకూరుతుందని' అని ఎన్నారై ప్రతినిధులు కిరణ్ తుమ్మల, సూర్య తేలప్రోలు, మురళీ కోగంటి, తేజ్ మన్నవ, వల్లభనేని నాగేశ్వరరావు, యలమంచిలి వెంకట్, మనోజ్ తెలిపారు.

పవన్ కల్యాణ్‌కు సిరిసిల్ల వస్త్రాలు

» నేత కళాకారుడు హరిప్రసాద్‌కు అవకాశం



పవన్ కల్యాణ్ కోసం తయారు చేసిన దుస్తులను చూపిస్తున్న హరిప్రసాద్

సిరిసిల్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు వస్త్రాలు నేసే అవకాశం సిరిసిల్ల నేత కళాకారుడికి లభించింది. సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ ఇటీవల పవన్ కల్యాణ్‌కు ఆయన చిత్రంతో తయారు చేసిన చిన్న మగ్గాన్ని జ్ఞాపికగా పంపించాడు. ఇది చూసిన అమెరికాలోని అట్లాంటాకు చెందిన పవన్ కల్యాణ్ అభిమాని ఒకరు స్పందించి, పవన్ కల్యాణ్ కోసం రూ.5 లక్షలు విలువ చేసే కాటన్ వస్త్రాన్ని సిరిసిల్ల హరిప్రసాద్‌తో నేయించారు. హరిప్రసాద్ దంపతులు చేనేత మగ్గంపై 25 రోజులపాటు శ్రమించి లెనిన్ కాటన్ నూలుతో వస్త్రాన్ని తయారు చేశారు. జనసేన లోగో కోసం ఎర్రని, నల్లని పట్టు దారం ఉపయోగించారు. ఆ వస్త్రంతో నాలుగు షర్టులు, రెండు ప్యాంట్లను సిరిసిల్లలోనే కుట్టించిన అభిమాని శుక్రవారం పవన్‌కల్యాణ్‌కు పంపించారు. హరిప్రసాద్ ఇప్పటికే చేనేత మగ్గంపై అగ్గిపెట్టెలో అమిరే చీర, జీ20 లోగో, చిన్న మగ్గాల జ్ఞాపికలను తయారు చేయడంతోపాటు విభిన్నమైన పట్టుచీరలను నేస్తున్నాడు. ఇటీవల ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారానికి వెళ్లే అవకాశం కూడా హరిప్రసాద్‌కు దక్కింది.

మధ్యాహ్న భోజనం మెనూ మార్చాలి

» తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ మార్చాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జయరాజు నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని కోరింది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

» పీటీడీ కార్మిక పరిషత్

ప్రభుత్వంలో విలీనం తర్వాత ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ కార్మిక పరిషత్ అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. అమరావతి సచివాలయంలో శుక్రవారం టీఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేను కార్మిక పరిషత్ నాయకులు కలిసి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని, పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల పనిష్మెంట్స్‌కు సంబంధించి, 01/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, వివిధ కేటగిరీల్లో ఖాళీపోస్టులను భర్తీ చేయాలని కోరారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు

శ్రీశైలం, ఆగస్టు 2: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. భక్తులు గత 29 రోజుల్లో హుండీల్లో సమర్పించిన నగదు లెక్కించగా రూ.3,31,70,665 లభించింది. అదే విధంగా 127 గ్రాముల బంగారు, 4.400 కిలోల వెండి లభించాయి. వీటితోపాటు 489 యుఎస్‌ఏ డాలర్లు, 4,445 యూఏఈ దిర్హమ్స్, 5 లక్షల వియత్నాం డాంగ్స్, 90 థాయిలాండ్ బట్స్, 108 ఖతార్ రియాల్స్, 20 ఇంగ్లండ్ పౌండ్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి.

ఏలూరులో వందేభారత్ రైలుకు హాల్ట్ ఇవ్వాలి

» ఎంపీ పుట్టా మహేష్ కుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని రైల్వే ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోచింగ్) దేవేంద్రకుమార్‌కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం, ఇక్కడ రైల్‌భవన్‌లో దేవేంద్రకుమార్‌తో ఎంపీ భేటీ అయ్యారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరలో ఏలూరులో వందేభారత్ రైలు ఆగేలా చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు ఎంపీ తెలిపారు.

500 నక్షత్ర తాబేళ్ల స్వాధీనం



మంగళం(తిరుపతి), ఆగస్టు 2: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ లోని విజయవాడ పాయింట్ వద్ద శుక్రవారం రవాణాకు సిద్ధంగా వున్న 500 నక్షత్ర తాబేళ్లను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో తిరుపతి రేంజ్ ఎఫ్ఆర్వో సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్ఎస్వో రవీంద్ర, ఎఫ్‌బీవో సురేష్ బాబు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. విజయవాడ పాయింట్ వద్ద అనుమానాస్పదంగా కన్పించిన కొందరు వ్యక్తులను ప్రశ్నించే ప్రయత్నం చేయగా వారి వద్ద ఉన్న గోనె సంచులను వదిలి పారిపోయారు. ఆ సంచులను అధికారులు పరిశీలించి అందులో 500 నక్షత్ర తాబేళ్లున్నట్లు గుర్తించారు. పరారైన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు తిరుపతి ఎఫ్ఆర్వో సుదర్శన్ రెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న నక్షత్ర తాబేళ్లను మామండూరు అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టినట్లు చెప్పారు.

ఆ 67 కోట్లు వదిలేస్తారా?



» ఈ-ఆటో కొనుగోళ్లలో ఎస్సీ కార్పొరేషన్ సొమ్ము స్వాహా

» అడ్వాన్స్ తీసుకుని సరఫరా చేయని డీలర్లు

» అడ్వాన్స్ తిరిగి చెల్లించకపోయినా పట్టించుకోని గత ప్రభుత్వం

» వారికి అండదండలందించిన ఓ ఐఏఎస్ అధికారి

» ఇప్పుడైనా వసూలు చేస్తారో లేదో!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

> వైసీపీకి ముఖ్యుడైన ఆ ఐఏఎస్ అధికారి కారణంగా ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.67 కోట్లు గండిపడింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను అప్పనంగా ఓ డీలర్‌కు ఇచ్చేశారు. ఈ-ఆటోల కొనుగోలు కోసం అడ్వాన్స్ చెల్లించినా ఆ డీలర్ ఆటోలు సరఫరా చేయకపోగా, తిరిగి ఆ సొమ్మును కూడా ప్రభుత్వానికి వాపసు చేయకపోవడం దారుణం. అడ్వాన్స్‌లు ఇచ్చింది గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయినా... గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ డీలర్ల నుంచి ఆ సొమ్మును వసూలు చేయలేకపోవడానికి ఆ అధికారే కారణమని చెప్తున్నారు. ప్రస్తుతం రిటైర్ అయిన ఆ అధికారి ఆ డీలర్ ఆ అధికారికి బినామీనేనని... అందుకే గతంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులుగా పనిచేసిన పినిపె విశ్వరూప్, మేరుగ నాగార్జునలు కూడా డీలర్‌కు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి రాబట్టుకునేందుకు విఫలయత్నాలు చేశారన్న అపవాదు ఉంది.

గతంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు చేసే క్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి వాటిని ఘనవ్యర్థాల షెడ్‌కు తరలించి సేంద్రియ ఎరువులు తయారుచేయాలనేది లక్ష్యం. అందుకోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను ఎస్సీ యువత ద్వారా కొనుగోలు చేసి వాటిని చెత్తను తరలించేందుకు గ్రామ పంచాయతీల్లో వినియోగించాలని నిర్ణయించారు. 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థిక అభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ), జాతీయ ఎస్సీ ఆర్థిక అభివృద్ధి సంస్థ నిధులు(ఎన్ఎస్‌సీఎఫ్‌డీసీ) వాడుకోవాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా అప్పటి ఉమ్మడి 13 జిల్లాల్లో 13 ఈ-ఆటో సర్వీసు కేంద్రాలను ప్రారంభించాలని, భవిష్యత్తులో 42 సర్వీసు కేంద్రాలుగా విస్తరించాలని ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అప్పట్లో ఈ-ఆటోలను సరఫరా చేసేందుకు పుణెకు చెందిన కెనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ ఆథరైజేషన్‌తో తాడేపల్లికి చెందిన వెంకటేశ్వర ట్రేడర్స్ ఒప్పందం చేసుకుంది. ఈమేరకు 7500 పవర్ ఆటోలు సరఫరా చేయాలని ఒప్పందం చేసుకుని రూ.77.91 కోట్లు అడ్వాన్స్‌గా పొందారు. కొనుగోలు ఆర్డర్‌ను ఎస్సీ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ ఇచ్చారు. అయితే అనిల్ కుమార్‌రెడ్డి రూ.57.98 కోట్ల విలువ కలిగిన 2,550 వాహనాలు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 4,950 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్ ఇంకా రూ.19.92 కోట్లు ఆయన వద్దనే మిగిలిపోయింది. అనిల్ కుమార్‌రెడ్డి ఈగల్ అగ్రి ఎక్విప్‌మెంట్, కావలి పేరుతో 280 మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.23.72 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.14.27 కోట్లు విలువ కలిగిన 209 మెషిన్లు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 71 మెషిన్లు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ అవి సరఫరా చేయకపోగా తిరిగి చెల్లించాల్సిన రూ.9.45 కోట్లు కోట్లు తిరిగి చెల్లించలేదు. ఇదే కంపెనీ 660 ట్రాక్టర్లు సరఫరా చేస్తామని రూ.38.87 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.26.56 కోట్లు విలువ కలిగిన 451 ట్రాక్టర్లు మాత్రమే సరఫరా చేశారు. తిరిగి చెల్లించాల్సిన రూ.12.31 కోట్లు డీలర్ వద్దనే ఉన్నాయి. వెరసి ఒక్క అనిల్‌కుమార్‌రెడ్డి వద్దనే రూ.41.68 కోట్లు నిలిచిపోయాయి. ఇదే రకంగా మరో డీలర్ రాధా మాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 1647 ఇన్నోవాలు ఇతియోస్ వాహనాలు సరఫరా చేస్తామని రూ.221.64 కోట్లు అడ్వాన్స్ తీసుకుంది. రూ.198.59 కోట్ల విలువ కలిగిన1417 వాహనాలు సరఫరా చేసింది. ఇంకా 230 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్‌లో రూ.23.05 కోట్లు డీలర్ వద్దనే నిలిచిపోయింది. తిరిగి చెల్లించడం లేదు. అప్పటి ధరల ప్రకారం వాహనాలు ఇవ్వలేమని, పెరిగిన ధరల ప్రకారం తీసుకునేందుకు అంగీకరిస్తే పరిశీలిస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎంట్రాన్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 15 మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.3.52 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకుని 6 మెషిన్లు సరఫరా చేసింది. ఇంకా 9 వాహనాలు సరఫరా చేయలేదు. వారు తీసుకున్న అడ్వాన్స్ ఇంకా రూ.2.93 కోట్లు ఆ కంపెనీ వద్దనే మిగిలి ఉంది. మొత్తంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మొత్తం రూ.67.67 కోట్లు అడ్వాన్స్ ఎస్సీ కార్పొరేషన్‌కు తిరిగి చెల్లించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఎస్సీ కార్పొరేషన్‌తో ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో కెనటిక్ గ్రీన్ ఎనర్జీ సంస్థ నుంచి రూ.7.72 కోట్లకు గాను ఐసీఐసీఐ బ్యాంక్ జారీచేసిన ఈఎండీని సమర్పించారు. ఈ ఈఎండీ బ్యాంక్ గ్యారెంటీ జనవరి 24, 2022 వరకు గడువు ఉండేట్లు తీసుకున్నారు. ఈ బ్యాంక్ గ్యారెంటీని సమర్పించిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌కు లేఖ రాస్తూ మొత్తం సరఫరా చేసే ఈ-ఆటోల విలువలో 25 శాతం మొత్తంతో పాటు రూ.1.50 కోట్ల ఈఎండీ మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్‌కు సంస్థ లేఖ రాసింది. ఈ చెల్లింపులు సంస్థ ఆథరైజ్డ్ డీలర్ వెంకటేశ్వర ట్రేడర్స్‌కు చెల్లించాలని ఆథరైజ్ చేసింది. అయితే ఆ తర్వాత కెనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సమర్పించిన బ్యాంక్ గ్యారెంటీ నకిలీదని తేలింది. దీనిపై ఎన్ని నోటీసులిచ్చినా వెంకటేశ్వర ట్రేడర్స్ లెక్కచేయలేదు. ఆ తర్వాత మంత్రి విశ్వరూప్ పదవి మారడంతో కొత్తగా వచ్చిన మంత్రి మేరుగ నాగార్జున కూడా అడ్వాన్స్ తిరిగి చెల్లించాలని డీలర్లకు హెచ్చరించడంతో ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగారు. సీఎం కార్యాలయం నుంచి, ప్రభుత్వ పెద్దల నుంచి ఫోన్లు రావడంతో అడ్వాన్స్ తిరిగి చెల్లించే ప్రక్రియ ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఈ-ఆటోలను, ఇన్నోవాలను సరఫరా చేయని డీలర్ నుంచి అడ్వాన్స్‌ను తిరిగి రాబట్టడంలో సాక్షాత్తు ఆ శాఖ మంత్రులే విఫలమవ్వడం వెనుక ఆ ఉన్నతాధికారి హస్తముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జగన్ సర్కార్‌లో ఆ అధికారి కీలకంగా ఉన్నారని, ఆయన మాట చెల్లుబాటు కావడంతోనే ఐదేళ్ల పాటు ఈ అవినీతిని కప్పిపుచ్చుకోగలిగారని పేర్కొంటున్నారు.

తల్లీబిడ్డల కోసం బేబీ బెర్తులు

» లఖ్‌నవూ రైలులో 2 బేబీ బెర్తుల ప్రయోగం



న్యూఢిల్లీ, ఆగస్టు 2: రైళ్లలో ప్రయాణించే చంటి బిడ్డల తల్లుల కోసం బేబీ బెర్తులను ప్రయోగాత్మకంగా తీసుకువచ్చామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. శుక్రవారం రాజ్యసభలో బీజేపీ ఎంపీ సుమర్ సింగ్ సోలంకీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా బేబీ బెర్తుల గురించి వెల్లడించారు. "లఖ్‌నవూ మెయిల్ రైలులో ఒక కోచ్‌లోని దిగువ బెర్తులకు రెండు బేబీ బెర్తులను ప్రయోగాత్మకంగా తీసుకువచ్చాం. అయితే సామాన్లు పెట్టుకునే స్థలం తగ్గిపోవడం, సీట్ల మధ్య దూరం తక్కువగా ఉండడం వంటి సమస్యలు మా దృష్టికి వచ్చాయి. ప్యాసింజర్ కోచ్‌లలో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతుంటాయి" అని మంత్రి తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశవ్యాప్తంగా అన్ని రైళ్లలో బేబీబెర్తులను ప్రవేశపెడతాం అని పేర్కొన్నారు. బేబీ బెర్తులను అవసరం లేనప్పుడు లోయర్ బెర్తు కిందకు మడతపెట్టొచ్చు.

ఆ శృంగార వీడియోలు వాస్తవమే

» ప్రజ్వల్ రేవణ్ణ కేసులో ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ఆరోపణలు వచ్చిన శృంగార వీడియోలు వాస్తవమైనవేనని ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఇచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు ఒరిజినల్ అని ఎఫ్ఎస్ఎల్ అందులో పేర్కొంది. సోషల్ మీడియాలో ప్రచారమైన ఫొటోలు, వీడియోలు ఎడిట్ లేదా మార్ఫింగ్ జరగలేదని నిర్ధారించింది. ఎలాంటి యానిమేషన్, గ్రాఫిక్స్ ఉపయోగించలేదని ఎఫ్ఎస్ఎల్ నివేదికలో స్పష్టం చేసింది. దీంతో విచారణ మరింత లోతుగా జరిపేందుకు సిట్‌కు అవకాశం లభించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల్లో మహిళలు మాత్రమే కనిపించారు. అందులో ఎక్కడా పురుషుడి ముఖం కనిపించలేదు. ప్రస్తుతానికి అశ్లీల వీడియోల్లో ఉన్నది ప్రజ్వల్ అవునా కాదా అనేది తేలాల్సి ఉంది. వీడియోలు మాత్రం వాస్తవమైనవని ప్రాథమిక నివేదిక ద్వారా స్పష్టమైంది.

వచ్చే జూన్‌కల్లా రామాయపట్నం పోర్టు సిద్ధం

» ఆర్అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన రెడ్డి వెల్లడి

కందుకూరు, ఆగస్టు 2: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టు పనులను వచ్చే ఏడాది జూన్ నెలాఖరుకు పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, కలెక్టరు ఆనంద్, పోర్టు అధికారులతో కలిసి శుక్రవారం మంత్రి పోర్టు పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ రూ.4929 కోట్లతో నిర్మించతలపెట్టిన ఈ పోర్టులో ఇప్పటివరకు 1300 కోట్లతో 51 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. పోర్టు నిర్మాణ పురోగతిపై ప్రతి నెలా నివేదిక ఇవ్వాలని కలెక్టరుకు సూచించారు. మరో మంత్రి ఆనం మాట్లాడుతూ ఈ పోర్టు పూర్తయితే జిల్లాలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు.

20 రోజుల్లో 14 మంది చిన్నారుల మృతి

» ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఓ మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఘటన

» విచారణకు ఆదేశించిన లెఫ్టినెంట్ గవర్నర్

» ఆప్ ప్రభుత్వంపై మండిపడిన బీజేపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశ రాజధాని ఢిల్లీలోని ఓ మానసిక వికలాంగుల ఆశ్రమంలో 20 రోజుల వ్యవధిలో 14 మంది చిన్నారులు మృతి చెందడం కలకలం రేకెత్తిస్తోంది. వారి మరణాలకు కారణాలేంటన్నది ఇంకా తెలియకపోవడం గమనార్హం. రోహిణి ప్రాంతంలో ఢిల్లీ ప్రభుత్వం మానసిక వికలాంగుల కోసం ఆశాకిరణ్ షెల్టర్ హోం నడుపుతోంది. అయితే గత 20 రోజుల్లోనే ఈ షెల్టర్‌లో ఉంటున్న వారిలో 14 మంది మృత్యువాత పడడంతో ఆందోళన చెలరేగింది. ఈ మరణాలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ) వీకే సక్సేనా విచారణకు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే అన్ని షెల్టర్ హోంలపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక అందజేయాలని ఉన్నతాధికారులను ఎల్‌జీ ఆదేశించినట్లు రాజ్‌నివాస్ వెల్లడించింది. ఆయా షెల్టర్లలో వ్యయం, ఎంతమంది ఉంటున్నారు, అందిస్తున్న సౌకర్యాలు, వైద్య సదుపాయాలు వంటి వివరాలను మూడు వారాల్లోగా అందించాలని కోరినట్లు తెలిపింది. షెల్టర్‌లో మరణాల వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం ఉందని తెలిస్తే సహించబోమని ఢిల్లీ మంత్రి అతిశీ తెలిపారు. పోస్టుమార్టం నివేదికలు వస్తే ఆ మరణాలకు అసలు కారణాలేంటన్నవి తెలుస్తాయని మంత్రి అన్నారు. ఘటనపై మెజిస్ట్రియల్ దర్యాప్తుకు ఆదేశించామని, 24 గంటల్లో ప్రాథమిక నివేదిక వస్తుందని చెప్పారు. ఆశాకిరణ్ ఆశ్రమంలో 980 మంది పేషెంట్లు, 450 మంది కేర్‌టేకర్లు ఉన్నారని తెలిపారు. మరణాల నేపథ్యంలో ఆప్ ప్రభుత్వం మీద జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ మండిపడ్డారు. నిజనిర్ధారణ కమిటీని అక్కడికి పంపించారు. ఆశాకిరణ్ షెల్టర్ హోంలో ఈ ఏడాది జనవరి నుంచి 20 మంది చనిపోయారు. ఈ హోం సాంఘిక సంక్షేమ శాఖ కిందకు వస్తుంది. ఈ శాఖకు ప్రస్తుతం విభాగాధిపతి లేకపోవడం గమనార్హం. బీజేపీ నేతలు ఆశాకిరణ్ షెల్టర్ హోం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. షెల్టర్‌లో పిల్లలకు శుభ్రమైన నీరు, సరిపడా భోజనం, వైద్యం అందించడం లేదని తమకు తెలిసిందని వారు పేర్కొన్నారు.

పేదరికం నుంచి 80 కోట్ల మందికి విముక్తి!

» భారత్‌లో స్మార్ట్ ఫోన్లతో సాధ్యమైందన్న ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు

న్యూయార్క్, ఆగస్టు 2: భారత్‌లో 80 కోట్ల మంది ప్రజలు కేవలం ఐదారేళ్లలోనే పేదరికం నుంచి బయటపడ్డారని ఐక్యరాజ్యసమితి(ఐరాస) జనరల్ అసెంబ్లీ(యూఎన్‌జీఏ) అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ తెలిపారు. దీనికి కారణం స్మార్ట్ ఫోన్ల వినియోగమేనని పేర్కొన్నారు. "భారత్‌లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఒకప్పుడు బ్యాంకు లావాదేవీలు తెలియవు. చెల్లింపులు ఎలా చేయాలో తెలీదు. కానీ, ఈ రోజు వారంతా తమ బిల్లులను స్మార్ట్ ఫోన్ల ద్వారా చెల్లిస్తున్నారు. నగదును అందుకుంటున్నారు. ఆర్డర్లు పెడుతున్నారు" అని వ్యాఖ్యానించారు. వేగవంతమైన అభివృద్ధికి డిజిటలైజేషన్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు కూడా ఫోన్ సిగ్నల్స్ అందించడం, ఇంటర్నెట్‌ను విస్తరించడం వంటివి



'యూఎస్ తలసరి'లో పావు వంతు చేరేందుకు భారత్‌కు 75 ఏళ్లు

» వరల్డ్ బ్యాంకు నివేదిక అంచనా

న్యూఢిల్లీ, ఆగస్టు 2: వచ్చే కొన్ని దశాబ్దాల కాలంలో భారత్ సహా 100కు పైగా దేశాలు అధిక ఆదాయం కలిగిన దేశాలుగా మారడానికి తీవ్రమైన అవరోధాలను ఎదుర్కొనే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. అలాగే అగ్రరాజ్యం అమెరికా తలసరి ఆదాయంలో భారత్ కేవలం పావు వంతును చేరుకోవడానికి దాదాపు 75 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. అదే చైనాకు అయితే పదేళ్లకు పైగా పట్టే అవకాశం ఉందని, ఇండోనేషియాకు దాదాపు 70 ఏళ్లు పడుతుందని 'వరల్డ్ డెవలప్‌మెంట్ రిపోర్ట్ 2024: ది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్' పేర్కొంది. 2023 చివరినాటికి 108 దేశాలను మధ్య ఆదాయ దేశాలుగా వర్గీకరించారు. వీటి వార్షిక తలసరి జీడీపీ 1,136 డాలర్ల నుంచి 13,845 డాలర్ల శ్రేణిలో ఉంది. ఈ దేశాల్లో 600 కోట్ల జనాభా ఉండగా.. ఇది ప్రపంచ జనాభాలో 75 శాతానికి సమానం. ఈ జనాభాలో ప్రతి ముగ్గురిలో ఒకరు తీవ్రమైన పేదరికంలో జీవిస్తున్నారు. వేగంగా వృద్ధాప్య జనాభా పెరుగుతుండటం, అప్పుల పెరుగుదల, భౌగోళిక, రాజకీయ, వాణిజ్య ఘర్షణలు, పర్యావరణాన్ని కలుషితం చేయకుండా ఆర్థిక పురోగతిని వేగవంతం చేయడంలో ఇబ్బందులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొంది. చాలా మధ్య ఆదాయ దేశాలు గత శతాబ్ద ప్లేబుక్‌నే వాడుతున్నాయని,

కేంద్ర-రాష్ట్రాల మధ్య గట్టి వారధిగా గవర్నర్లు

» గిరిజన ప్రజల సంక్షేమానికి కృషి చేయాలి

» ఢిల్లీలో గవర్నర్ల సదస్సులో ప్రధాని పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమర్థవంతమైన వారధి నిర్మించేందుకు గవర్నర్లు కీలక పాత్ర పోషించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్ లో గవర్నర్ల సదస్సునుద్దేశించి ఆయన ప్రసంగించారు. అణగారిన వర్గాలకు న్యాయం లభించే విధంగా ప్రజలు, సామాజిక సంస్థలతో సంప్రదింపులు జరపాలని సూచించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పరిధిలోనే ప్రజలకు సేవ చేసేందుకు ఏర్పర్చిన ముఖ్యమైన వ్యవస్థ అని ఆయన అన్నారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రజల ప్రయోజనాలకు గవర్నర్లు తోడ్పడాలని చెప్పారు. గవర్నర్ల సదస్సును ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము....జాతీయ లక్ష్యాలు సాధించేందుకు తోడ్పడాలని గవర్నర్లకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేసేందుకే కాక, సామాన్యులకు సంక్షేమ కార్యక్రమాలు చేరేందుకూ కృషి చేయాలన్నారు. క్రిమినల్ న్యాయవ్యవస్థకు సంబంధించిన కొత్త చట్టాలతో న్యాయ వ్యవస్థలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆమె చెప్పారు. ప్రజాస్వామ్యం సాఫీగా పనిచేయాలంటే కేంద్ర ఏజెన్సీలు అన్ని రాష్ట్రాల్లో సమన్వయంతో పనిచేయాలని, ఇందుకు ఏ విధంగా కృషి చేయాలో రాజ్యాంగాధినేతలుగా గవర్నర్లు సూచించాలని ఆమె కోరారు. రాష్ట్రాల్లో చాన్సలర్లుగా కూడా గవర్నర్లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నందువల్ల నూతన విద్యావిధానం సూచించిన సంస్కరణలు అమలు అయ్యేలా చూడాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు మార్గాలను సూచించాలని కోరారు. యువతకు మరిన్ని ప్రయోజనాలు సమకూర్చేందుకు, ఐక్యతా స్ఫూర్తిని ప్రజల్లో నెలకొల్పేందుకు కేంద్ర చేపట్టిన ప్రచారం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. సహజ వ్యవసాయ విధానాలను పెంపొందించేందుకు రాజ్‌భవన్లు మార్గదర్శకం కావాలని చెప్పారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖడ్, హోంమంత్రి అమిత్‌షా కూడా రెండు రోజుల సదస్సులో తొలిరోజు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా ఈ సదస్సుకు హాజరయ్యారు.

మతం మారిన దళితులకు ఎస్సీ హోదా తగదు

» జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ ఎదుట దళిత సంఘాల నిరసనలు

కొచ్చి, ఆగస్టు 2 : క్రైస్తవం, ఇస్లామ్‌లోకి మారిన దళితులను ఎస్సీలుగానే గుర్తించాలనే ప్రతిపాదనను అత్యధిక దళిత సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ అంశంపై పరిశీలన కోసం సుప్రీంకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలో నియమించిన విచారణ కమిషన్ ఎదుట ఈ సంఘాలు తమ నిరసన తెలియజేశాయి. కేరళలోని కొచ్చిలో గురువారం జస్టిస్ బాలకృష్ణన్.. కేరళ పులయార్ మహాసభ (కేపీఎమ్ఎస్) సహా పలు దళిత సంఘాలతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. సమావేశంలో పలు దళిత సంఘాలు తమ అభ్యంతరాలను తెలియజేశాయి. ఎస్సీలతో పోల్చితే మతం మారిన దళితులు విద్యా, ఆర్థిక, సామాజికపరంగా మంచి స్థితిలో ఉన్నారని కేపీఎమ్ఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. అందువల్ల ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న పది శాతం రిజర్వేషన్ల కేటగిరీలో వారిని చేర్చరాదని వాదించారు. అదే సమయంలో.. వారికి రిజర్వేషన్ కల్పనను తాము వ్యతిరేకించడం లేదని, వెనుకబడిన కులాలకు కేటాయించిన రిజర్వేషన్లలోంచి వీరికి ప్రత్యేకంగా కేటాయించాలని సూచించారు. అయితే, మతం మారిన దళితుల విషయంలో వస్తున్న ప్రతిపాదనల వెనుక స్పష్టమైన కుట్ర ఉన్నదని, ఎస్సీలకు దక్కుతున్న రాజకీయ అవకాశాలను దెబ్బతీసే ఆలోచన దీని వెనుక ఉన్నదని ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ నేత నిశా రాజేశ్ ఆరోపించారు.

స్తంభించిన సహకార బ్యాంకింగ్

» సీ ఎడ్జ్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ హ్యాకింగ్

గుంటూరు సిటీ, ఆగస్టు 2: రాష్ట్రంలోని సహకార బ్యాంకుల కార్యకలాపాల్లో తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడింది. బ్యాంకులకు చెందిన సీ-ఎడ్జ్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ హ్యాక్ అయినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లు సాఫ్ట్‌వేర్‌ను హ్యాక్ చేసినట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా గుర్తించి సహకార బ్యాంకులను హెచ్చరించినట్లు అధికారులు చెబుతున్నారు. హ్యాకింగ్ అయిన తర్వాత స్థానిక బ్యాంకులు గుర్తించక పోవడంతో భారీ స్థాయిలో నగదు గల్లంతు అయినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే సాఫ్ట్‌వేర్ హ్యాకింగ్ వల్ల రాష్ట్రంలోని 26 సహకార బ్యాంకులు, వాటి అనుబంధ శాఖల్లో ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. నగదు బదిలీకి తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల బ్యాంకు అధికారులు జరిగిన విషయం ఖాతాదారులకు చెప్పి ప్రత్యామ్నాయ మార్గాలను చూపిస్తున్నారు.

యూఓహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఆరేళ్ల మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, నాలుగేళ్ల బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి. సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 440 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ:** మేథమెటికల్ సైన్స్ 40, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 20, బయాలజీ 60, అప్లయిడ్ జియాలజీ 18, సైకాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- **ఇంటిగ్రేటెడ్ ఎంఏ:** తెలుగు 19, హిందీ 20, లాంగ్వేజ్ సైన్సెస్ 19, ఉర్దూ 14, ఎకనామిక్స్ 17, హిస్టరీ 35, పొలిటికల్ సైన్స్ 25, సోషియాలజీ 25, ఆంత్రోపాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీలో 28 సీట్లు ఉన్నాయి.
- బీఎస్ ఆనర్స్/రీసెర్చ్: కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటిగ్రేటెడ్ ఎంఏలో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు మాత్రం ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి. లేదంటే ఓరియంటల్ ఎగ్జామినేషన్(తెలుగు/హిందీ/ఉర్దూ) ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు స్పెషలైజేషన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు పదోతరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా తెలుగు చదివుండాలి. బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌నకు కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థులందరికీ ఇంటర్ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.125
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 22
- **ఫిజికల్ రిపోర్టింగ్, అడ్మిషన్ కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 30, 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 3 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

బిట్స్ పిలానీలో పీజీ ప్రోగ్రామ్‌లు

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. ఇవి వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు. సంబంధిత విభాగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కెరీర్ బ్రేక్ లేకుండా కోర్సులు కొనసాగించే వీలుంటుంది. వారాంతాల్లో లైవ్ ఆన్‌లైన్ సెషన్స్, మిగిలిన రోజుల్లో ఆఫీసు వేళల తరవాత ఆన్‌లైన్ లెక్చర్స్ ఉంటాయి. డౌట్ క్లియరింగ్ సెషన్స్, ఆన్‌లైన్ ట్యుటోరియల్స్, ఇండస్ట్రీ టాక్స్, ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ఫైనల్ సెమిస్టర్‌లో డిజర్టేషన్(ప్రాజెక్ట్ వర్క్) ఉంటుంది. ప్రతి సెమిస్టర్‌లో మిడ్, కాంప్రహెన్సివ్ పరీక్షలు ఉంటాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారా లేదా ఎంచుకొన్న పరీక్ష కేంద్రానికి వెళ్లి రాయవచ్చు.



ఎంటెక్ డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు సెమిస్టర్లు. డేటా సైంటిస్టులు, డేటా అనలిస్ట్‌లు, డేటా ఆర్కిటెక్ట్‌లు, డేటా ఇంజనీర్లుగా రాణించేందుకు అవసరమైన మేథమెటికల్, ఇంజనీరింగ్ స్కిల్స్ పెంపొందించేలా కోర్సుని రూపొందించారు. మేథమెటికల్ ఫౌండేషన్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టికల్ మెథడ్స్, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిథమ్స్ డిజైన్, సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, డేటా మైనింగ్, మెషిన్ లెర్నింగ్, డేటా విజువలైజేషన్ అండ్ ఇంట్రప్రిటేషన్, ఎథిక్స్ ఫర్ డేటా సైన్స్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ అండ్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, డేటా వేర్‌హౌసింగ్, ప్రాసెసింగ్ ఆఫ్ అనలిటిక్స్ తదితర అంశాలు వివరిస్తారు.

ఎంటెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు సెమిస్టర్లు. మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్లు, ఏఐ సైంటిస్ట్‌లుగా రాణించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. ఇందులో మెషిన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, నెట్‌వర్క్స్, కంప్యూటర్ విజన్, రోబోటిక్స్, డీప్ లెర్నింగ్, డేటా అనాలిసిస్ తదితర అంశాలు వివరిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి 11 నెలలు. ఇందులో రిగ్రెషన్, ఫీచర్ ఇంజనీరింగ్, క్లాసిఫికేషన్, అన్ సూపర్‌వైజ్డ్ లెర్నింగ్ అండ్ అసోసియేషన్ రూల్ మైనింగ్, టెక్స్ట్ మైనింగ్, డీప్ లెర్నింగ్ అండ్ ఏఎన్ఎన్ తదితర అంశాలు బోధిస్తారు. ఎనిమిది వారాల క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్ కూడా ఉంటుంది.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఎమ్మెస్సీ/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం, ప్రోగ్రామింగ్ నాలెడ్జ్ తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** bits-pilani-wilp.ac.in/

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.



- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆఫీస్, డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, ఎచ్చెర్ల, శ్రీకాకుళం-532410
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimedskills.in

స్కిల్స్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

సికింద్రాబాద్‌లోని శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్...30 రోజుల ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణను ప్రారంభించింది. ఇందుకోసం 50 మంది విద్యార్థులను ఇప్పటికే ఎంపిక చేసింది. ఈ శిబిరంలో ఏఐ-ఆధారిత నైపుణ్యాలైన కంటెంట్ క్రియేషన్, వెబ్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలు, వీడియో, ఫొటో ఎడిటింగ్, ఏఐ సాధనాలను ఉపయోగించి వాయిస్ ఓవర్ జనరేషన్ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇందులో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు 9281079569 మొబైల్ నెంబరులో సంప్రదించవచ్చు.

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ, ఎంసీఏ

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)-స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఐసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో తొమ్మిది సీట్లు ఉన్నాయి. ఎంసీఏ ప్రోగ్రామ్‌ను కాకినాడలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూసీఈకే)లో, ఎంబీఏ ప్రోగ్రామ్‌ను జేఎన్‌టీయూకేకు చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్)లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం డిగ్రీ/ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. రెండు ప్రోగ్రామ్‌లకూ ఐసెట్ 2024 అర్హత తప్పనిసరి. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు రూ.25000; ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు రూ.75000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ-533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ప్రభుత్వ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్)... వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్- XIV) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ ఉన్న వారు దరఖాస్తుకు అర్హులు. మూడు దశల ఎంపిక విధానం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

896 ఖాళీలు



రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనే బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్.

పోస్టుల వివరాలు:

1. ఐటీ ఆఫీసర్(స్కేల్-1): 170 పోస్టులు
2. అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్-1): 346
3. రాజ్‌భాష అధికారి(స్కేల్-1): 25
4. లా ఆఫీసర్ స్కేల్-1): 125
5. హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1): 25
6. మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్-1): 205

అర్హతలు: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్). డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/డెయిరీ సైన్స్/ఫిషరీ సైన్స్/పిసి కల్చర్/అగ్రి.మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్/కో- ఆపరేషన్ అండ్ బ్యాంకింగ్/ఆగ్రో ఫారెస్ట్రీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/ఫుడ్ సైన్స్/అగ్రికల్చర్ టెక్నాలజీ బిజినెస్ మేనేజ్‌మెంట్/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/సెరికల్చర్/ఫిషరీస్ ఇంజనీరింగ్). పీజీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్). పీజీ(హిందీ/సంస్కృతం). డిగ్రీ(ఎల్ఎల్‌బీ), పీజీ డిప్లొమా(పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/హెచ్ఆర్/హెచ్ఆర్‌డీ/సోషల్ వర్క్/లేబర్ లా). ఎంఎంఎస్(మార్కెటింగ్)/ఎంబీఏ(మార్కెటింగ్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/పీజీపీఎం/పీజీడీఎం.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.850. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

తెలుగు రాష్ట్రాల్లో మెయిన్స్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్(ప్రిలిమినరీ పరీక్ష):** అక్టోబరు
- **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** నవంబరు
- **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల వెల్లడి:** నవంబరు/డిసెంబరు
- **ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష కాల్ లెటర్ డౌన్‌లోడ్:** డిసెంబరులో
- **ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష తేదీ:** డిసెంబరు
- **తుది పరీక్ష ఫలితాల ప్రకటన:** 2025 జనవరి/ఫిబ్రవరి
- **ఇంటర్వ్యూ నిర్వహణ:** 2025 ఫిబ్రవరి/మార్చి
- **ప్రొవిజనల్ అలాట్‌మెంట్:** 2025 ఏప్రిల్
- **వెబ్‌సైట్:** https://www.ibps.in/

పరీక్ష విధానం

ప్రిలిమినరీ

లా ఆఫీసర్, రాజభాష అధికారి పోస్టులకు: ఈ పరీక్షను మొత్తం 125 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మూడు సెక్షన్లు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇంగ్లీష్ నుంచి 50 ప్రశ్నలు(25 మార్కులు), రీజనింగ్ నుంచి 50 ప్రశ్నలు(50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ నుంచి 50 ప్రశ్నలు(50 మార్కులు) ఇస్తారు.

ఐటీ ఆఫీసర్, అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్, హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టులకు: ఈ పరీక్షను మొత్తం 125 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మూడు సెక్షన్లు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 50 ప్రశ్నలు(25 మార్కులు), రీజనింగ్ నుంచి 50 ప్రశ్నలు(50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 50 ప్రశ్నలు(50 మార్కులు) ఇస్తారు.

- ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్


రాజభాష అధికారి మినహా మిగతా అన్ని పోస్టులకు: మొత్తం 60 మార్కులకు ప్రొఫెషనల్ నాలెడ్జ్‌లో పరీక్ష ఉంటుంది. 60 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. ప్రశ్న పత్రం ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు.

రాజ భాష అధికారి పోస్టులకు: పరీక్షను 60 మార్కులకు నిర్వహిస్తారు. రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ప్రొఫెషనల్ నాలెడ్జ్(ఆబ్జెక్టివ్) నుంచి 45 ప్రశ్నలు, రెండో సెక్షన్‌లో ప్రొఫెషనల్ నాలెడ్జ్(డిస్క్రిప్టివ్) నుంచి 2 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలు ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.

- మెయిన్ ఎగ్జామ్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మాత్రమే ఇంటర్వ్యూకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు.

లిటిల్స్

అనాలోచిత చర్య ఫలితం



ఒక చెరువు దగ్గర చిన్న కప్ప మరియు ఎలుక ఎంతో స్నేహంగా మసలుకుంటూ ఉండేవి. వాటి మధ్య ఎలాంటి భేదాలు లేని స్నేహం ఉండేది. రోజూ కప్ప చెరువులో నుండి బయటకు వచ్చి ఎలుకతో సరదాగా కబుర్లు చెప్పి, కాసేపు ఆటపాటతో కాలం గడిపి వెళుతూ ఉండేది. అంత మంచి మిత్రుల మధ్య కూడా ఒకసారి భేదాలు వచ్చాయి. దానికి కారణం కప్ప ఎలుకను అపార్థం చేసుకోవడమే. ఎప్పుడూ తాను ఎలుక కలుగు దగ్గరకు వెళ్లడమే తప్ప, ఎలుక తన దగ్గరకు రాదు కాబట్టి ఎలుకకు పొగరు అని కప్ప అనుకున్నది. ఒకరోజు ఎలుకకు మంచి గుణపాఠం చెప్పాలి అనుకున్నది. ఎలుక కలుగు దగ్గరికి వెళ్లి వస్తూ తన కాలికి ఎలుక తోకను తాడుతో గట్టిగా కట్టేసింది. ఎలుక ఇది గమనించుకోలేదు అలవాటుగా కప్ప గెంతుతూ చెరువులోకి పోగానే, దానితో పాటు, ఎలుక కూడా రావలసి వచ్చింది. నీటిలో ఎలా ఈదాలో తెలియని ఎలుక ఎగిరి కప్ప వీపుపైన కూర్చుంది. ఆ బరువు కప్ప ఎక్కువ సేపు మోయలేక ఇబ్బంది పడింది. పైనుండి ఈ రెంటినీ గమనిస్తున్న గద్ద ఒకటి వేగంగా ఎగురుతూ వచ్చి, రెండిటినీ తన చెట్టు మీదకు తన్నుకుని పోయింది. కప్ప చేసిన అనాలోచిత చర్య వలన తన ప్రాణాలే కాక తనను నమ్మి స్నేహం చేసిన ఎలుక ప్రాణాలు కూడా ప్రమాదంలో పడ్డాయి, అందుకే ముందూ వెనుకలు ఆలోచించకుండా ఎవరికీ అపకారం తలపెట్టకూడదు.

జంతువులు ఎన్ని?




సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?



డైలీ సుడోకు - 374

					6		9	3
			2	7		1	6	
4		9	3		1	5		
			9	3				6
3		6	7		4	9		5
7				2	8			
		1	8		7	4		2
	4	8		5	2			
2	5		4					

సుడోకు - 373 సమాధానం

1	7	2	5	4	6	8	9	3
5	8	3	2	7	9	1	6	4
4	6	9	3	8	1	5	2	7
8	1	4	9	3	5	2	7	6
3	2	6	7	1	4	9	8	5
7	9	5	6	2	8	3	4	1
9	3	1	8	6	7	4	5	2
6	4	8	1	5	2	7	3	9
2	5	7	4	9	3	6	1	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.